
BALA CHELIMI

BALA




JULI JUL 2026

JULI

₹40

జూలై - 2026

PRGI Regn. No. 52828/1992

# బాల చెలిమి

పిల్లల వికాస పత్రిక

# BALA CHELIMI

Telugu Children's Monthly Magazine

సంపుటి : 35 • సంచిక : 10



*Friendship knows no boundaries. In every smile and shared moment, children teach us that kindness, joy, and togetherness are the true colors of life.*

JULY - 2026

Editor : **Er. VEDAKUMAR MANIKONDA**

A PUBLICATION OF **CHILDREN'S EDUCATIONAL ACADEMY,** HYDERABAD, TELANGANA



A Symphony of Grace,Our Little Stars Embrace the Beauty of Japanese Fan Dance.
Foundational Stage of Oxford Grammar High School – Pre Primary.



## JULY 2026

Colours of Joy, Where Every Tiny Step, Cheerful Smile, and Graceful Move Painted the Stage with Pure Happiness.

Oxford Grammar High School
#Street No. 13, Himayathnagar, Hyderabad
Ph : 040 2763 6214, +91 99590 20512
www.oxfordgrammarschool.com

ogs FOUNDATIONAL STAGE

45 YEARS OF MERITORIOUS PERFORMANCE

| Sun | Mon | Tue | Wed | Thu | Fri | Sat |
|---|---|---|---|---|---|---|
| | | | 1 | 2 | 3 | 4 |
| 5 | 6 | 7 | 8 | 9 | 10 | 11 |
| 12 | 13 | 14 | 15 | 16 | 17 | 18 |
| 19 | 20 | 21 | 22 | 23 | 24 | 25 |
| 26 | 27 | 28 | 29 | 30 | 31 | |
| | | | | | | |

NOTES :


Great achievements begin with curious minds.


Printed at : Deccan Press, Azamabad, Hyderabad-20, Ph : 90599 50055

# బాలచెలిమి

పిల్లల వికాస పత్రిక


సంపుటి: Volume: 35 సంచిక : Issue : 10 హైదరాబాద్ Hyderabad జులై July పేజీలు Pages 52 రూ. ₹. 40









లోపలి పేజీల్లో.......




| | | |
|---|---|---|
| చిన్న వయస్సు నుంచే జవాబుదారీతనం అలవాటు చేసుకోవాలి.... | మణికొండ వేదకుమార్ .. | 5 |
| సమాజ ప్రయోజనాలకు అంకితమైన రూడాల్ఫ్ డీజిల్ పరిశోధనలు (సైంటిస్ట్) | జుగాష్‌విలి | 6 |
| ప్రాణాధారం (ప్రపంచ ముంపు దినోత్సవం) | డా. నీరజ అమరవాది | 7 |
| దొంగా – పోలీస్ (పాట)... | గంగదేవు యాదయ్య | 8 |
| శ్రీజ ఆకుల | షీరోస్-256 | 9 |
| దీర్ఘం పెట్టు – అర్థం పట్టు (అక్షరం) | చొక్కాపు వెంకటరమణ | 10 |
| ఏదీ వ్యర్థం కాదు (కథ) | కాంచనపల్లి వేంకట కృష్ణారావు | 11 |
| భద్రత, వేగం, సామర్థ్యానికి ప్రతీక – సీ 295.. | బాలచెలిమి డెస్క్ | 12 |
| అల్లరి పిల్లలు (కథ) | సీమ హన్సిక | 13 |
| టైర్లతో సరదా ఆటలు (ఆట).. | శ్రీమతి మీనాస్వామినాథన్ | 14 |
| బంగారు మర్రి – 14 (సీరియల్) | పైడిమర్రి రామకృష్ణ | 15 |
| పదాల మేడ-2 (ఫజిల్) | మాదారపు వాణిశ్రీ | 16 |
| మారిన దొంగ (కథ) | ఆర్. విశ్వక్సేనా రెడ్డి | 17 |
| పేరాశ పనికి రాదు | పంచతంత్ర కథ | 18 |
| ఆరాధన – ఆలయ సంస్కృతి | దేశరాజు శ్యాంసుందర్‌రావు – స్థపతి | 19 |
| రాక్షసుడి గుహలో రాజకుమారి (సైన్స్) | డాక్టర్ మహీధర నళినీ మోహన్ | 20 |
| వాన వచ్చేసిందోచ్ (లఘునాటిక) | డా. సమ్మెట విజయ | 21 |
| భారతీయ మహిళా శాస్త్రవేత్తలు (సైన్స్ వెన్నెల-21) | డా. నాగసూరి వేణుగోపాల్ | 23 |
| టేకు చెట్టు (చెట్టు – చేమ) | కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి | 25 |
| ఆశ (కార్టూన్) | జుగాష్ విలి | 26 |
| ఫిఫా ప్రపంచ కప్-2026 ఫుట్‌బాల్ పండుగ (స్పోర్ట్స్) | బాలచెలిమి డెస్క్ | 28 |
| సరైన మార్గం (కథ) | గీస శ్రీజ | 29 |
| వేమన పద్యం | | 30 |
| బుజ్జి పిచుక (అనువాద కథ) | అనిల్ బత్తుల | 31 |
| సామెతలు | | 32 |
| చిట్టి గువ్వల కోసం ఆకాశ్ చేసిన అద్భుతం (కథ) | అల్లం లాస్య | 33 |

శివాజీ ఔదార్యం (చరిత్ర కథలు - 1)... ........................................... బాల కథా సౌరభం ........................ 34
అమ్రాబాద్ అడవుల నుంచి ఎదిగిన విష్ణుకుండులు (చరిత్ర పాఠాలు-17)............ డా. ద్యావనపల్లి సత్యనారాయణ .......... 35
నేర్చుకుందామా.............................................................................. ............................................ 36
కలం-చెలిమి .................................................................................... ............................................ 36
కోతి సలహా (కథ).............................................................................. వడ్డేపల్లి వెంకటేశ్......................... 37
వరుస మూడు సంఖ్యలు (మాథ్స్ ట్రిక్స్) ........................................... అంకెల మామయ్య చంద్రయ్య............ 38
చెలిమి క్లబ్....................................................................................... బాలచెలిమి డెస్క్............................ 38
AI నేర్చుకుందాం -- ఓపెన్ ప్రపంచంలోకి అడుగుపెడదాం (విద్య)................ లత ................................................ 39
మహబూబ్ నగర్ జిల్లా బడిపిల్లల కథలు పుస్తక ఆవిష్కరణ ... ....................... ............................................ 40
కాకి - పాము కథ (పిల్లల కథల్లో సైన్స్-6)............................................ కె శ్రీకృష్ణ సాయి ........................... 41
అమరావాది ఫౌండేషన్ పురస్కారాల ప్రకటన........................................... ............................................ 42
భారతదేశ వీరత్వ పురస్కారాలు (జి.కె.)............................................... బాలచెలిమి డెస్క్............................ 43
"సుస్థిర భవిష్యత్తు కోసం యువత సాధికారత" - Er. వేదకుమార్ మణికొండ......... బాలచెలిమి డెస్క్............................ 44
విహార యాత్రలో ఎదురైన వింతైన అనుభవం (కథ)... ................................ ఆర్.మహేష్ బాబు ......................... 45
హిమాలయన్ క్వెయిల్ - హిమాలయాల గూఢ పక్షి (నేచర్)........................... సచిన్ కోత్వాల్ ............................. 46
మూలాలు మరచిన మొక్క (కథ)... ........................................................ ఎలగొండ రవి ............................... 47
బాల చెలిమి గ్రంథాలయం - విద్యార్థుల్లో పఠనాసక్తిని పెంపొందించిన బడిబాట ..... శ్రీమతి ఝాన్సీ లక్ష్మి ........................ 48
ఎడ్యుకేషన్ వీక్-2026 వేడుకల్లో కళా వైభవం (సమాచారం)......................... బాలచెలిమి డెస్క్............................ 49
భావాలకు ప్రాణం పోసిన మహానటి సావిత్రి (వ్యక్తిత్వం) ............................... సువేగా....................................... 50



# చెలిమి లేఖలు

మా పాఠశాలలో బాలచెలిమి గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసి, విలువైన పుస్తకాలను అందుబాటులోకి తీసుకు వచ్చిన బాలచెలిమి మాసపత్రిక సంపాదకులు శ్రీ వేదకుమార్ గారికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు. గ్రంథాలయంలోని అనేక బాలల కథల పుస్తకాలను వినియోగించాము. ఆ పుస్తకాలను చదవడం ద్వారా విద్యార్థులు తమ పఠన నైపుణ్యాలను మెరుగుపరుచుకోవడమే కాకుండా, కథలను ఆస్వాదిస్తూ ఎంతో ఆనందాన్ని పొందారు. ఈ గ్రంథాలయం విద్యార్థులలో చదువుపట్ల ఆసక్తిని పెంపొందించి, జ్ఞానాన్ని విస్తరించడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తోంది.

**- శ్రీ బి. సతీష్,** ప్రధానోపాధ్యాయులు, కుకునూరుపల్లి,

బాలచెలిమి గ్రంథాలయంలోని పుస్తకాల సేకరణ ఎంతో సమాచారభరితంగా మరియు ఉపయోగకరంగా ఉంది. వాటి ద్వారా కొత్త విషయాలు తెలుసుకొని, నా జ్ఞానాన్ని పెంపొందించుకున్నాను. ఈ అద్భుతమైన పుస్తకాలను అందించిన బాలచెలిమి మాసపత్రిక సంపాదకులు శ్రీ వేదకుమార్ సార్ గారికి నా హృదయ పూర్వక కృతజ్ఞతలు.


**- మిస్బా నాజ్,** 9వ తరగతి

బాలచెలిమి గ్రంథాలయంలో చాలా మంచి పుస్తకాలు ఉన్నాయి. వాటిని చదవడం నాకు ఎంతో ఇష్టం.

**-మహమ్మద్ జునైద్,** 9వ తరగతి

*Cover Picture :*
**FRIENDSHIP BEYOND BOUNDARIES,**
(Joy Without Borders)
Source : Social Media

*బొమ్మలు:*
**కూరెళ్ల శ్రీనివాస్,**
m : 98495 43728



**సంపాదకులు : మణికొండ వేదకుమార్**

BALA CHELIMI
"CHANDRAM" 3-6-712/2, St. No. 12,
Himayatnagar, Hyderabad - 500 029.
e-mail : edit. chelimi@gmail. com, www. balachelimi. com
Mob: 98480 44713

# చిన్న వయస్సు నుంచే జవాబుదారీతనం అలవాటు చేసుకోవాలి...

పిల్లలూ...

స్కూళ్ళు తెరిచారు. స్కూలు వాతావరణానికి తిరిగి అలవాటయ్యారా! కొత్త స్నేహితులు తోడయ్యారా! క్లాస్‌రూమ్‌నూ, పాఠాలను సరికొత్తగా స్వంతం చేసుకోవడం మీ బాధ్యతగా గుర్తించండి.

ఈ వయసు నుంచే పిల్లలు జవాబుదారీతనాన్ని అలవాటు చేసుకోవాలి. ఒక పనికి లేదా నిర్ణయానికి బాధ్యత వహించి వాటి ఫలితాలకు సమాధానం చెప్పే స్థితిని జవాబుదారీతనం అంటారు. జవాబుదారీతనం మనం చేసే పనులకు, నిర్ణయాలకు బాధ్యతతో నిలిచే లక్షణం. ఇది ప్రతిభ, నిజాయితీ, సామాజిక బాధ్యతలు పెరుగుదలకు, మెరుగుదలకు మూలధాతువు. పాఠశాల వయస్సులో పిల్లలు ఈ గుణాన్ని అలవరుచుకుంటే బాధ్యత గలిగిన పౌరులుగా, సరైన నిర్ణయాలు తీసుకోగలిగిన సమర్థవంతమైన పౌరులుగా తయారవుతారు. తాము చేయవలసిన పనులను, అవి చేయవలసిన పద్ధతులను వారే నిర్ణయించుకునే అవకాశాన్ని వారికివ్వాలి. తన నిర్ణయానికి, సమయానికి, పనికి బాధ్యత వారిదే కనుక ఆయా పనుల ఫలితాలకు బాధ్యత కూడా వారిదే అవుతుంది. ఆ పనులలో వారు సాధించిన విజయాలు, జరిగిన తప్పులు, అవి ఎందుకు జరిగాయో, ఎలా సరిదిద్దుకోవాలో అందరి ముందు చర్చించడమే జవాబుదారీతనం.

ఇది చిన్నప్పటి నుంచి, ఇంటి నుంచే ప్రారంభం కావాలి. వయస్సును బట్టి పిల్లలు తమ పనులు తామే చేసుకునేలా స్వేచ్ఛనివ్వాలి. తాము భోజనం చేసిన పాత్రలను వారే కడిగి శుభ్రం చేయడం, తమ బెడ్‌రూమ్‌ను నీట్‌గా వుంచుకోవడం, తమ పుస్తకాలను ర్యాక్‌లలో సర్దుకోవడం, తన స్కూల్ బ్యాగ్, షూస్, యూనిఫామ్, ఆట వస్తువులు తమకు అనుకూలంగా భద్రంగా పెట్టుకోవడం వారి పనిగా ప్రోత్సహించాలి. దీనివల్ల జాగ్రత్త, బాధ్యత, ఇబ్బందులు అన్నీ వారికర్థమవుతాయి. ఆ పనుల్లోని ఇబ్బందులను లేదా ఆనందాలను తల్లిదండ్రులతో మాట్లాడటం ద్వారా అవగాహన పెరుగుతుంది.

పాఠశాలలో మొక్కలు పెంపకం, పాఠశాల శుభ్రత, డిబేట్, క్లాస్‌రూమ్‌లో క్రమశిక్షణ వంటి అనేక అంశాలలో పిల్లలందరిని భాగస్వాములను చేయాలి. తరగతుల వారీగా ప్రాజెక్ట్ వర్క్‌లు అప్పగించాలి. ఆ తర్వాత సమీక్షలు జరపాలి. పిల్లలు నిర్భయంగా తమ అభిప్రాయాలను చెప్పే అవకాశం యివ్వాలి. తప్పొప్పులను వారికర్థమయ్యేటట్లు చెప్పాలి. దీనివల్ల విద్యార్థుల్లో సామూహిక స్వభావం, విషయ విస్తృతి, పారదర్శకత, లోపాలను గుర్తించి, అంగీకరించి, సరిదిద్దుకోవడం అలవాటవుతుంది. ఈ ప్రాజెక్టుల్లో పాల్గొన్న వారు చేసిన పనీ, దాని ఫలితాలు గురించి, వారి ఫీడ్‌బ్యాక్ గురించి చిన్న చిన్న వ్యాసాలు రాయించాలి. దీనివల్ల సృజనాత్మకత, భావవ్యక్తీకరణ నైపుణ్యాలు పెరుగుతాయి. బాధ్యత పూర్తి చేసిన పిల్లలకు చిన్న చిన్న బహుమతులు, ప్రశంసలు యివ్వాలి. వారిపట్ల వారికి నమ్మకం ఏర్పడుతుంది.

పాఠశాల వాతావరణం, టీచర్ మోడలింగ్, పేరంటల్ సహకారం, ప్రాక్టికల్ అవకాశాల సమన్వయంతో పిల్లల్లో జవాబుదారీతనం అనే గొప్ప గుణాన్ని, విలువనూ పెంపొందించవచ్చు.


అప్పుడే పిల్లలు ఉత్తమ బాధ్యతాయుత పౌరులుగా ఎదుగుతారు.

మీ


వేదకుమార్.యం

(మణికొండ వేదకుమార్)

ఎడిటర్ బాలచెలిమి



# సమాజ ప్రయోజనాలకు అంకితమైన రూడాల్ఫ్ డీజిల్ పరిశోధనలు



రూడాల్ఫ్ డీజిల్ మానవ చరిత్రలో పారిశ్రామికాభివృద్ధికి కొత్త దిశను చూపిన మహనీయుడు. ఆయన ఆవిష్కరించిన డీజిల్ ఇంజన్ నేటికీ ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు కీలక ఆధారం.

రూడాల్ఫ్ డీజిల్ 1858 మార్చి 18న పారిస్ నగరంలో జన్మించారు. 1870లో ఫ్రాంకో - ప్రష్యన్ యుద్ధానంతరం వీరి కుటుంబం ఇంగ్లాండ్ వలస వెళ్ళింది. తీవ్ర ఆర్థిక సమస్యల నేపథ్యంలో జర్మనీలోని ఆగ్స్‌బర్గ్‌లో మేనమామ వద్ద వుంటూ చదువుకున్నాడు. 1875లో మ్యూనిక్‌లో థర్మోడైనమిక్స్‌లో ఉన్నత విద్యను అభ్యసించారు. తర్వాత ఒక పరిశ్రమలో ప్లాంట్ మేనేజర్‌గా పని చేస్తూ యంత్రాల సామర్థ్యాన్ని పెంచే మార్గాలపై పరిశోధనలు ప్రారంభించారు.

ఆ కాలంలో ఆవిరి యంత్రాలు అధిక ఇంధనాన్ని వినియోగిస్తూ తక్కువ సామర్థ్యంతో పని చేసేవి. ఈ పరిస్థితిని మార్చాలన్న సంకల్పంతో కొత్త తరహా అంతర్గత దహనయంత్రాన్ని రూపొందించే ప్రయత్నం చేసారు. మొదట అమ్మోనియా ఆధారిత విస్తరణ యంత్రాన్ని రూపొందించే ప్రయత్నం విఫలమైంది. అయితే ఆ పరిశోధనలే డీజిల్ ఇంజన్ ఆవిష్కరణకు పునాది వేశాయి. 1893 ఆగస్ట్ 10న జర్మనీలోని ఆగ్స్‌బర్గ్‌లో ఆయన రూపొందించిన తొలి డీజిల్ ఇంజన్ విజయవంతంగా పని చేసింది. తరువాత రెండు సంవత్సరాల పాటు అనేక సాంకేతిక మెరుగుదలలు చేపట్టి 1896లో మరో నమూనాను ప్రదర్శించారు. ఆనాటి ఆవిరి యంత్రాల సామర్థ్యం 10 శాతమే ఉండగా ఈ ఇంజన్ 75.5 శాతం సామర్థ్యాన్ని సాధించి ఒక అద్భుతంగా ప్రశంసలు పొందింది.

1898లో మ్యూనిక్ నగరంలో జరిగిన ప్రదర్శనలో డీజిల్ ఇంజన్ ప్రదర్శించగా అంతర్జాతీయ స్థాయిలో విశేష ఆదరణ లభించింది. ఈ ఆవిష్కరణ పరిశ్రమలు, రవాణా, నౌకాయానం వ్యవసాయ రంగాలలో విప్లవాత్మక మార్పులకు దారి తీసింది.

రూడాల్ఫ్ డీజిల్ దూరదృష్టి కలిగిన శాస్త్రవేత్త. భవిష్యత్తులో వృక్ష ఆధారంగా ఇంధనాల, బయోఫ్యూయల్ వినియోగానికి తన ఇంజన్ అనుకూలంగా ఉండాలని భావించారు. నేటి బయోడీజిల్ భావనకు ఆయన ఆలోచనలే పునాదిగా నిలిచాయి. తన జీవితకాలంలో అనేక సాంకేతిక వ్యాసాలు, పరిశోధనా పత్రాలు రచించి ఇంజనీరింగ్ రంగానికి విశేష సేవలందించారు. తన పరిశోధనా ఫలితాలను 1893లో "థియరీ అండ్ కన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఎ రేషనల్ హీట్ ఇంజన్" అనే గ్రంథ రూపంలో ప్రచురించారు.

రూడాల్ఫ్ డీజిల్‌కు పారిశ్రామిక, శాస్త్రీయ సంస్థల నుంచి గౌరవాలు లభించాయి. ఆయన పేరు మీదుగా అనేక సాంకేతిక సంస్థలు, పరిశోధనా కేంద్రాలు పురస్కారాలు అందిస్తున్నాయి. 1913 సెప్టెంబర్‌లో బెల్జియంలోని ఆంటెర్ప్ నుంచి ఇంగ్లండ్‌లోని హార్విచ్‌కు ప్రయాణిస్తున్న ఓడలో ఆయన అదృశ్యమయ్యారు. ఆయన మరణం ఒక రహస్యంగానే ఇప్పటికీ మిగిలిపోయింది.

శాస్త్రీయ దృష్టి, సృజనాత్మక, పట్టుదల, సమాజ ప్రయోజనాల పట్ల అంకిత భావానికి రూడాల్ఫ్ డీజిల్ జీవితం ఒక గొప్ప ఉదాహరణగా నిలిచింది.

– జుగాష్‌విలి
బాలచెలిమి డెస్క్, m : 83094 52998




హాయ్ పిల్లలూ, వర్షంలో ఆడుతున్నారా! కాగితం పడవలను వర్షపు నీటిలో వేస్తూ ఆనందిస్తున్నారా! మనుషులకి, జంతువులకి, మొక్కలకీ అందరికీ ముఖ్యమైనది నీరు. ఏదో కారణం వల్ల ఒకరోజు మనకి నీరు దొరకలేదనుకోండి. ఆ పరిస్థితిని ఊహించగలమా. అలాంటి ప్రాణాధారమైన నీరే ఎన్నో ప్రాణాలు పోవడానికి కారణమవుతోందంటే నమ్మగలమా. ప్రపంచంలోని ప్రమాద మరణాలు ఎక్కువగా నీటిలో మునిగిపోవటం వల్లనే సంభవిస్తున్నాయట. ఐక్యరాజ్యసమితి కూడా నీటి వల్ల జరిగే ప్రమాదాల తీవ్రతను గుర్తించి, ఆ మరణాలను తగ్గించే లక్ష్యంతో జూన్ 25వ తేదీన 'ప్రపంచ ముంపు దినోత్సవాన్ని (World Drowing prevention day)' జరుపుకోవాలని తీర్మానించింది. 2021 వ సంవత్సరం నుండి సముద్రాలు, నదులు, చెరువుల దగ్గరకి వెళ్లినప్పుడు తీసుకోవలసిన భద్రత, అవగాహనలను పెంచడానికి ప్రపంచ ముంపు దినోత్సవాన్ని జరుపుకుంటున్నాము. ప్రపంచవ్యాప్తంగా సంవత్సరానికి సూమారు 3,72,000 మంది నీటి ప్రమాదాలలో ప్రాణాలు కోల్పోతున్నారు. వీరిలో కూడా 1-24 వయసులోని వారే ఎక్కువగా ఉంటున్నారు. చుట్టపక్కల ఉన్న నదులు, సరస్సులు, బావులు, గుంతలు, ఈతకొలనులలోనే ఈ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. పెద్ద పెద్ద నగరాలలో ఒక్కసారిగా వర్షం పడడం వల్ల కార్లు, బైకులతో సహా కొట్టుకుపోయిన సంఘటనలను వింటూనే ఉంటాము.

“A watchful eye is the cheapest life guard”.

భారతదేశాన్ని పరిశీలిస్తే, ఉత్తరాన ఉన్న హిమాలయాలు గంగ, బ్రహ్మపుత్ర వంటి నదులకు జన్మస్థానం. వాతావరణ మార్పుల వల్ల హిమానీనదాలు ఆకస్మికంగా ముంచెత్తుతాయి. దాని వల్ల ముఖ్యనదులు, వాటి ఉపనదులు, పరీవాహకప్రాంతాలలో ఊహించలేనంత నీరు చేరుతుంది. దాని వల్ల ప్రజలు, యాత్రికులు పెద్ద సంఖ్యలో ప్రాణాలు కోల్పోవడం మనం చూస్తూనే ఉన్నాం. నాగరికత, కార్పోరేటీకరణ పేరిట ప్రకృతికి ఎంతో హాని చేస్తూ, నదులకు అడ్డంగా పవర్ ప్రాజెక్టులను, ఇతర నిర్మాణాలను నిర్మించటం వల్ల కృత్రిమ వరదలు వస్తున్నాయి. దానితో ముందు జాగ్రత్త చర్యలు చేపట్టక పోవడంతో నీట కలిసిపోతున్న ప్రాణాలకు లెక్కలేదు. నదీ పుష్కరాల సమయంలో ఎంతో మంది నీటిలో గల్లంతుకావడం వింటూనే ఉంటాము. ఎంతో మందిని బలిగొంటున్న ప్రజారోగ్య సమస్య 'ముంపు'కు గురికావడం అని ఐక్యరాజ్య సమితి గుర్తించింది. అందుకే ప్రతి సంవత్సరం ఒక థీమ్ ప్రకారం ప్రజలలో ఈ సమస్యను అధిగమించడానికి తీసుకోవలసిన ముందస్తు చర్యలను ప్రచారం చేస్తోంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ సహకారంతో 194 సభ్య దేశాలు 2029 నాటికి నీటితో వచ్చే ప్రమాదాలను అరికట్టాలని, వాటి కోసం అవసరమైన చర్యలను వేగం చేయాలను కుంటున్నాయి. ముఖ్యంగా పాఠశాల పిల్లల భద్రతకు కొన్ని

పరిష్కారాలను నిర్దేశించింది.

1.పాఠశాల వయస్సు పిల్లలకు ప్రాథమిక ఈతను నేర్పించడం, 2.నీటి భద్రత, సురక్షిత రక్షణ నైపుణ్యాలను బోధించటం, 3.నీటి వనరుల చుట్టూ నియంత్రణను, పర్యవేక్షణకు సిబ్బందిని అందుబాటులో ఉంచడం, 4.వ్యక్తిగత ఫ్లోటేషన్ పరికరాలను ధరించడంతో పాటు, సురక్షితమైన బోటింగ్, షిప్పింగ్, ఫెర్రీ నిబంధనలను అమలుచేయడం.

జలమే జీవకోటికి ప్రాణాధారం. నీటిని సంరక్షించుకోవడం ఎంత ముఖ్యమో, ఆ నీటి గండం నుంచి రక్షించుకోవడమూ అంతే ముఖ్యం. పిల్లలూ మీరు ఎప్పుడైనా నీటి దగ్గరికి వెళ్లినప్పుడు, సెల్ఫీలు, రీల్స్, టిక్ టాక్ లు అంటూ అలవికాని సాహసాలు చేయద్దు. నీరు మన జీవితాల్లో అంతర్భాగం. అది మనకు జీవితాన్ని ఇస్తుంది. కొద్దిగా ఆదమరిస్తే ప్రాణాలను తీసుకుంటుంది.

"Every child deserves to learn the art of swimming and the importance of water safety. On this day, letμs strive for equal opportunities for all".

– డా. నీరజ అమరవాది
m : 9849160055

పాట

# దొంగా-పోలీస్



ఎడమ నుండి కుడికి వెళ్ళిపోండ్రీ
కుడి నుండి ఎడమకు కూడిపోండ్రీ
తూర్పుకు తూర్పుకు తిరుగుండ్రీ
దండం దండం పెట్టుండ్రీ
తెచ్చినవన్నీ పెట్టుండ్రీ
వెనుకకు వెనుకకు మల్లుండ్రీ
అమ్మ గారొచ్చీ పూజ చేస్తరు
అయ్య గారొచ్చీ ఆరగిస్తరు
తాతగారొచ్చి తాళమేస్తరు
దొంగలు వచ్చి దోసుకుంటరూ
పోలీసులొచ్చీ పట్టుకుంటరూ
దొంగా పోలీస్ ఆడుకుందమా
దుష్షుం.. దుష్షుం.. కొట్టుకుందామా...

– గంగదేవు యాదయ్య
ఉయ్యాలా జంపాలా
m : 90591 12105

చందదారులుగా చేరండి!

బాల చెలిమి

చందదారులను చేర్పించండి!

'యం. వేదకుమార్ సంపాదకత్వంలో వెలువడుతున్న 'బాల చెలిమి' పిల్లల మాసపత్రిక బాలబాలికలకు చేరడంలో తల్లిదండ్రుల, ఉపాధ్యాయ, పాఠశాల నిర్వహకుల, మేధావుల అమూల్య సహకారాన్ని కోరుతున్నాం. చందదారులుగా చేరడంతోపాటు తమకు తెలిసినవారిని చందదారులుగా చేర్పించాల్సిందిగా అభ్యర్థిస్తున్నాం.

SCAN & PAY

**మా చిరునామా :**

BALA CHELIMI
"CHANDRAM" 3-6-712/2,
St. No. 12, Himayatnagar
Hyderabad - 500 029.
Mob: 9030626288
E-mail:desk. chelimi@gmail. com,
www. balachelimi. com

**చందా వివరాలు :**

విడి ప్రతి : రూ. 40
వార్షిక చందా : రూ. 400
2 సం॥లకు : రూ. 750
'బాల చెలిమి' పేరిట నగదు, చెక్ లేదా ఆన్‌లైన్ రూపంలో చందామొత్తం చెల్లించవచ్చు.


**ACCOUNT DETAILS :**

Bank Name : Canara Bank
A/C No. : 30101010003714
Branch : Ashoknagar, HYDERABAD.
IFSC Code : CNRB0013010

# శ్రీజ ఆకుల

## భారత టేబుల్ టెన్నిస్ కొత్త రాణి

శ్రీజ ఆకుల (1998 జూలై 31–) తన ప్రతిభతో గణనీయ పురోగతిని సాధించిన ప్రముఖ భారత టేబుల్ టెన్నిస్ క్రీడాకారిణి. ఆమె 2022లో మహిళల వ్యక్తిగత, డబుల్స్ విభాగాలలో జాతీయ ఛాంపియన్‌షిప్ సాధించారు. 2022 ఏప్రిల్‌లో జరిగిన 83వ సీనియర్ జాతీయ, ఇంటర్–స్టేట్ టేబుల్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్స్‌లో గెలుచుకున్నారు.




2021లో జరిగిన జాతీయ మహిళల సింగిల్స్ పోటీలో రెండో స్థానంలో నిలిచినప్పుడే ఆమె విజయానికి అడుగులు పడ్డాయి. అప్పుడు ఆమె మనికా బాత్రాతో తలపడ్డారు. శ్రీజ సాధించిన విజయాలు జాతీయ స్థాయికి మించి విస్తరించాయి. 2022 కామన్వెల్త్ గేమ్స్‌లో భారత దేశానికి సగర్వంగా ప్రాతినిధ్యం వహించారు. శరత్ కమల్‌తో కలిసి మిక్స్‌డ్ డబుల్స్ పోటీలో బంగారు పతకం సాధించారు. వీటికి తోడు 2019లో జరిగిన దక్షిణాసియా క్రీడల్లో మహిళల డబుల్స్, మహిళల టీమ్ పోటీలలో బంగారు పతకాలు సాధించి తన శక్తి సామర్థ్యాలను ప్రదర్శించారు. విలక్షణ టేబుల్ టెన్నిస్ క్రీడాకారిణిగా తన స్థానాన్ని మరింత సుస్థిరం చేసుకున్నారు.

శ్రీజ ప్రయాణం కేవలం విజయాలతోనే సాగలేదు, ఓటములు కూడా ఎదుర్కొన్నారు. కానీ విజయపథంలో పరాజయాలు భాగమని నిరూపిస్తూ ఆమె మరింత శక్తితో తిరిగి పుంజుకున్నారు.

**– 'షీరోస్–256**

**ఇన్‌స్పైరింగ్ వుమెన్ ఫ్రమ్ ఇండియా' నుండి....**

### మీకు తెలుసా?

2022లో శ్రీజ సాధించిన జాతీయ విజయం అసాధారణ అద్భుతం. 1964లో హైదరాబాద్‌కు చెందిన మీర్ ఖాసిం అలీ జాతీయ టైటిల్ కైవసం చేసుకున్న 58 సంవత్సరాల సుదీర్ఘ విరామం తరవాత ఆమె ఈ ఘనత సాధించారు.




# అక్షరాలతో ఆటలు

## దీర్ఘం పెట్టు - అర్థం పట్టు

**మాటలో ఒక్క అక్షరానికి దీర్ఘం పెట్టు - అర్థం మారుతుంది**

| | | | |
|---|---|---|---|
| నెల | నేల | కలం | కాలం |
| పదం | పాదం | పుట | పూట |
| జడ | జాడ | పడు | పాడు |
| దివి | దీవి | సుతుడు | సూతుడు |
| వడ | వాడ | వరం | వారం |
| తడి | తాడి | పతకం | పాతకం |
| గది | గాది | లలన | లాలన |
| కనుక | కానుక | | |
| తపము | తాపము | | |
| మెడ | మేడ | | |

- చౌక్కాపు వెంకటరమణ
రచయిత, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత
(తానా 'తెలుగు తేజం' పుస్తకం నుండి...)
m: 92465 20050



కథ

# ఏదీ వ్యర్థం కాదు



ఆలోచిస్తే ఏదీ వ్యర్థం కాదు. తగిన విధంగా పనికి రానిది కూడా ఉపయోగించుకోవచ్చు. అది ఉపయోగ పడటమే కాకుండా దాని ఉపయోగం కనిపెట్టిన వాడికి మంచి పేరు తేవచ్చు. అందుకు ఉదాహరణగా మీకొక కథ చెబుతాను" చెప్పారు విద్యాపతి గురువుగారు.

"చెప్పండి గరువుగారు" ఎంతో ఆసక్తితో అడిగారు శిష్యులు.

దేవపురంలో గిరిధరుడు ధనవంతుడు. ధనం ఉందని అతనికి గర్వం లేదు, మంచితనం ఉంది. గిరిధరుడు నివసిస్తున్న భవనం అతని తాతలు నూట ఏభై ఏళ్ల క్రితం కట్టినది అది బాగా పాతపడి పోయింది. భవనంలోని అనేక చెక్కతలుపులకు చెదలు పట్టసాగాయి. అవి అలానే వదిలేస్తే ఇంట్లో బట్టలు, పుస్తకాలను కూడా తినివేస్తాయని భయపడి వడ్రంగిని పిలిపించి ఆ తలుపులు తీసివేసి మంచి తలుపులు చెదలు పట్టకుండా కొన్ని రసాయనాలు పూసి చెయ్యమని చెప్పాడు గిరిధరుడు.

వడ్రంగి వాటిని పరిశీలించి గిరిధరుడు చెప్పినట్టుగా పాతతలుపులు తీసివేసి కొత్త తలుపులు మంచి చెక్కతో చేయడానికి ఒప్పుకున్నాడు. అలా కొలతల ప్రకారం కొత్త తలుపులు చేసి తీసుకొచ్చాడు. పాత తలుపులు జాగ్రత్తగా తీసి గిరిధరుడి ఇంటిముందు పెట్టాడు. ఇక కొత్త తలుపులు బిగించాలని తన సహాయకులతో వచ్చాడు.

అప్పుడే అటువైపుగా కళాధరుడనే చెక్కతో కళాఖండాలు చేసే కళాకారుడు వచ్చి ఆ తీసేసిన చెక్క తలుపులు చూసి ఆశ్చర్యపోయాడు! ఎందుకంటే ఆ చెక్క తలుపుల మీద అతి కళాత్మకమైన పువ్వులు, లతలు దేవతల బొమ్మలు చెక్కబడి ఉన్నాయి. ఆ కళ నూట ఏభై ఏళ్ల నాటిది! అక్కడే నిలబడి ఉన్న వడ్రంగి సహాయకుడిని "అవి అమ్ముతారా?" అడిగితే, "అవి తీసేసిన తలుపులు చెద పట్టి పోతున్నాయి, అందుకే వేరే తలుపులు చేసి బిగిస్తున్నాము" చెప్పాడు అతను.

"మరి వీటిని నేను తీసుకోవచ్చా?"

"ఈ భవన యజమాని గిరిధర్ గారిని అడుగు" చెప్పాడు అతను.

అప్పుడే బయటికి వచ్చిన గిరిధరుడు కళాధరుడి మాటలు విని, "ఏం చేసుకుంటావు ఈ తలుపులు?"

"వీటిని తీసుకవెళ్లి చెదకొట్టిన భాగాన్ని తీసివేసి మిగతా తలుపులతో కళాఖండాలు చేయవచ్చు. ఎందుకంటే ఇది విలువైన చెక్క. ఈ తలుపుల మీద బొమ్మలు కళాఖండాలు" చెప్పాడు కళాధరుడు.

"సరే నీవు ఈ తలుపులతో కళాఖండాలు చేస్తే నాకు కనీసం ఓ మూడు కళాఖండాలు ఇవ్వు. నీకు ఉచితంగా

ఇస్తాను ఈ తలుపులు" చిరునవ్వుతో చెప్పాడు గిరిధరుడు.

"తప్పకుండా ఇస్తాను కేవలం మూడు కాదు ఇంకా ఎక్కువ ఇస్తాను" చెప్పి ఆ తలుపులు తీసుకవెళ్లి పదిహేను రోజుల్లో ఆ తలుపులతో అద్భుత కళాఖండాలు తయారు చేశాడు. తలుపులలో నుండి కొన్ని పాత బొమ్మలు చెక్కి బయటకు తీసి వాటికి రంగులు వేసి ఆకర్షణీయంగా తయారు చేశాడు.

అలా ఆ తలుపుల నుండి ఇరవై బొమ్మలు తయారు చేశాడు. అందులో పదింటిని తీసుక వెళ్లి గిరిధరుడుకి ఇచ్చాడు. కళాధరుడి కళాత్మక పనితనానికి జోహార్లు అర్పించాడు గిరిధరుడు. కొత్తగా పెడుతున్న తలుపులకు కళాధరుడినే చక్కని బొమ్మలు చెక్కమని చెప్పాడు.

కళాధరుడు గిరిధరుడు చెప్పినట్టు చేస్తే మరలా అద్భుత బొమ్మలతో కూడిన తలుపుల వలన గిరిధరుడి ఇల్లు కళకళలాడింది! గిరిధరుడు కళాధరుణ్ణి తన ఇంట్లో సన్మానించి బహుమతులు, ధనం ఇచ్చి అతని కళను మెచ్చుకుని భవిష్యత్తులో కళాధరుడి కళకు తన చేయూత ఎప్పుడూ ఉంటుందని చెప్పాడు.

"చూశారా పనికి రావని అనుకున్న తలుపులతో అద్భుత కళాఖండాలు సృష్టించాడు కళాధరుడు. దాని వలన అతనికి పేరు, ధనం రెండూ వచ్చాయి.

నేర్చుకున్న కళ, నేర్చుకున్న విద్యవలన రాణించడానికి అవి అవకాశాలు ఇస్తాయి. అందుకే నిరంతర శ్రమ, కొత్త విషయాలు నేర్చు కోవాలనే తపన మనిషిని పరిపూర్ణున్ని చేస్తాయి" అని ముగించారు విద్యాపతిగారు.

ఆయన మాటలు విద్యార్థులలో స్ఫూర్తి నింపాయి.

**(బాలచెలిమి జాతీయ పోటీ కథలు-2025, 'పెద్దలు రాసిన పిల్లల కథలు-1'లో న్యాయనిర్ణేతలు ఎంపిక చేసిన ఉత్తమ కథ)**

**- కాంచనపల్లి వేంకట కృష్ణారావు**
హైదరాబాద్
m: 93486 11445

# భద్రత, వేగం, సామర్థ్యానికి ప్రతీక - సీ 295




Airbus C295 అనేది ఆధునిక సైనిక రవాణా విమానం. దీనిని Airbus Defence and Space సంస్థ రూపొందించింది. ఈ విమానం ప్రధానంగా సైనిక దళాల రవాణా, యుద్ధ సామగ్రి తరలింపు, వైద్య సహాయక చర్యలు, ప్రకృతి విపత్తుల సమయంలో సేవలు అందించేందుకు ఉపయోగపడుతుంది. ప్రపంచంలోని అనేక దేశాలు తమ వైమానిక దళాల్లో ఈ విమానాన్ని వినియోగిస్తున్నాయి. సీ-295 విమానం మధ్యస్థ పరిమాణంలో ఉండి, చిన్న రన్‌వేలపై కూడా సులభంగా ల్యాండ్ అవుతుంది. అందువల్ల కొండ ప్రాంతాలు, సరిహద్దు ప్రాంతాలు మరియు దూర ప్రాంతాల్లో కూడా ఇది సమర్థవంతంగా పని చేస్తుంది. ఈ విమానంలో సుమారు 70 మంది సైనికులను లేదా భారీ పరిమాణంలో సరుకులను రవాణా చేయవచ్చు. రెండు టర్బోప్రాప్ ఇంజిన్లు దీనికి అధిక శక్తిని అందిస్తాయి. దీని వేగం గంటకు సుమారు 480 కిలోమీటర్లు. భారతదేశం కూడా Airbus C295 విమానాలను తన Indian Air Force కోసం కొనుగోలు చేసింది. పాత అవ్రో విమానాల స్థానంలో వీటిని ప్రవేశపెడుతున్నారు. ఈ విమానాల తయారీలో Airbus మరియు Tata Advanced Systems Limited కలిసి పని చేస్తున్నాయి. భారతదేశంలోనే ఈ విమానాల తయారీ జరగడం దేశీయ రక్షణ రంగానికి ఒక ముఖ్యమైన ముందడుగు. సీ-295 విమానం యుద్ధ సమయాల్లోనే కాకుండా ప్రకృతి విపత్తుల సమయంలో ఆహారం, మందులు, సహాయక సామగ్రిని వేగంగా చేరవేయడంలో కూడా కీలక పాత్ర పోషిస్తుంది. ఆధునిక సాంకేతికత, బలమైన నిర్మాణం, బహుముఖ వినియోగ సామర్థ్యం కారణంగా ఈ విమానం ప్రపంచ సైనిక రవాణా రంగంలో ప్రత్యేక స్థానం సంపాదించింది.

కథ

# అల్లరి పిల్లలు



రెడ్డిబాయి గ్రామంలో ఒక ప్రభుత్వ పాఠశాల ఉండేది. అది చాలా పెద్దగా ఉండేది. ఆ పాఠశాలలో చాలా పెద్ద చదువులు చదివిన ఉపాధ్యాయులు పాఠాలు చెప్పేవారు. పిల్లలు కూడా చాలా చురుకుగా ఉండేవారు. కానీ అల్లరి ఎక్కువగా చేసేవారు. అలా ఉండగా పరీక్షలు వచ్చాయి. ఆ పాఠశాలలో ఉపాధ్యాయురాలు రేపు తెలుగు పరీక్ష కదా! పిల్లలూ చదవండి! చదవండి! అని చెప్తుంటే పిల్లలు చదివినట్లు నటించారు తప్ప చదవలేదు. పైగా ఒకరికొకరు మిత్రురాళ్లతో నువ్వు ఒక జవాబు నేర్చుకో! నేను ఒక జవాబు నేర్చుకుంటాను. అని ఒప్పందం చేసుకున్నారు. రేపు మనం ఒకరికొకరు చూపించుకుంటూ రాద్దాం! అని పిల్లలు అనుకుంటారు. ఇంతలో సాయంత్రం గంట మోగడంతో ఇండ్లకు వెళ్లిపోయారు. అమృత అనే అమ్మాయి మాత్రం మిగతా వాళ్లతో కలిసి ఉంటూనే. బాగా చదివేది. ఇంటికి వెళ్లి ఒక్క నిమిషం కూడా సమయం వృధా చేయకుండా బాగా చదివింది. తెల్లవారి పరీక్షకు అన్ని ప్రశ్నలకు జవాబులు నేర్చుకొని వచ్చింది. కానీ తన తోటి మిత్రురాళ్ళు అందరం నేర్చుకుందామని చెప్పారు. కానీ వాళ్లు ఒక్క జవాబు కూడా నేర్చుకొని రాలేదు. అమృత నువ్వు నేర్చుకున్నావు కదా! నువ్వే మాకు చూపించాలి అని అడుగుతారు. సరేలే చూపిస్తాను అన్నది అమృత. తెలుగు టీచర్ ఇన్విజిలేటర్‌గా వచ్చింది. పిల్లలు మాట్లాడుకోకుండా, ఒకరిని ఒకరు చూడకుండా చాలా స్ట్రిక్టా పరిశీలించ సాగింది. అమృత అన్ని ప్రశ్నలకు జవాబులు నేర్చుకున్నందున ఆ పరీక్ష పేపర్లో ప్రశ్నలకు ఎవరి మీద ఆధారపడకుండా చానా సులువుగా జవాబులు రాసింది. కానీ తన స్నేహితురాళ్ళు ఏమీ నేర్చుకోకుండా అమృత మీద ఆధారపడ్డారు. టీచర్ ఒకరినొకరు ఎట్టి పరిస్థితుల్లో చూసి రాయకుండా కళ్లప్పగించి చూస్తుండడంతో అమృత తప్ప మిగతా వాళ్ళు రాయలేకపోయారు. ఎగ్జామ్ టైం అయిపోయిందని పేపర్స్ తీసుకొని పిల్లల్ని బయటికి పంపారు. బయటికి రాగానే అమృతని తన స్నేహితురాళ్ళు అందరూ కలిసి నువ్వు మాకు చూపిస్తాను అని మాట ఇచ్చి చూపియ్యలేదు. నీతో ఎవరం మాట్లాడం పో! అని అమృత పై కోపం పెంచుకొని వాళ్లెవరూ ఆమెతో మాట్లాడలేదు. కానీ అమృత మాత్రం వాళ్ళని పట్టించుకోకుండా చదువు బాగా చదువుతూ అన్ని పరీక్షలు బాగా రాసింది. తన మిత్రురాళ్ల కన్నా తనకి పరీక్షలో మార్కులు ఎక్కువ రావడం వల్ల క్లాస్ ఫస్ట్ తనే అయిందని వాళ్లకు ఇంకా కోపం వచ్చింది. మేము అమృత కన్నా చాలా బాగా చదివి వచ్చే పరీక్షల్లో మా తడాఖా చూపిస్తాం! అనుకున్నారు. ఒకరిని మించి మరొకరు పోటీ పడుతూ చదివారు. ఇంతలో వార్షిక పరీక్షలు వచ్చాయి. పోటీగా చదివి పరీక్షలు రాశారు. అందరికీ మంచి మార్కులు వచ్చాయి. ఇదంతా గమనించిన టీచర్ చూశారా! మీరు చదివితే మిమ్మల్ని మించిన వాళ్లు మరొకరు ఉండరు. ఈసారి అమృతతో పాటు అందరికీ మంచి మార్కులు వచ్చాయి. చదువు విషయంలో ఎప్పుడూ పొరపాటు చేయకూడదు అని చెప్పి, అందరినీ మెచ్చుకొని బహుమతులు ఇచ్చింది. పిల్లలు ఒకరి ముఖాలు మరొకరు చూసుకుని సంతోషంతో కలిసి పోయారు.

– సీమ హన్సిక
పదో తరగతి, జెడ్పిహెచ్ఎస్, గుండ్రాంపల్లి, నల్లగొండ జిల్లా.
m : 9959126682



# టైర్లతో సరదా ఆటలు

## పాత టైరు - పిల్లల ఆటలకు కొత్త ప్రపంచం!



### 1 టైర్లతో దారి

టైర్లను గుండ్రంగా గాని, ఒక వరుసలోగాని, వంకర టింకరగా గాని అమర్చి, ఒక టైరులో నుండి ఇంకో టైరులోకి పిల్లలను గెంతుతూ రమ్మని చెప్పాలి. ఆ టైర్ల మధ్య దూరాన్ని క్రమక్రమంగా పెంచి ఆట కొంచెం కష్టంగా ఉండేలా చేయవచ్చు.

### 2 టైర్లతో సొరంగం



రెండు లేక మూడు టైర్లను ఒకదాని వెనుక ఒకటి సొరంగం లాగ నేలమీద నిలబెట్టాలి. పిల్లలను వాటిలో నుండి ప్రాకుతూ రమ్మనవచ్చు. మెత్తటి నేలగాని, ఇసుక నేలగాని అయితే టైరు నిలబెట్టడం తేలిక. పిల్లలు కొన్ని టైర్లలో నుండి దూరి, మరికొన్ని టైర్ల మీదుగా దూకి - ఇలా రకరకాలుగా ఆడతారు.

### 3 వ్రేలాడే టైరు



టైరును ఒక చెట్టు కొమ్మకుగాని, లేక దూలానికి గాని పిల్లల ఎత్తుకు సరిపోయేలా వ్రేలాడ దీయాలి. బంతులను గాని, ఇతర వస్తువులను గాని ఆ టైరులోనుండి అవతలి వైపుకు పడేలా విసర మనండి. క్రమంగా పిల్లలకు, టైరుకు మధ్య ఉండే దూరం ఎక్కువ చేయవచ్చు.

### 4 టైరు సీట్లు



టైర్లను పిల్లలు కూర్చునేందుకు సీట్లుగా ఉపయోగించవచ్చు. "మ్యూజికల్ సీట్స్" ఆటలో కూడా ఇవి ఉపయోగపడ్తాయి. ఇంతే గాకుండా ఊయలకు, మెట్లలాగ ఎక్కటానికి వీలైన చట్రాలకు, నిర్మాణాత్మకమైన ఆటలకు కూడా టైర్లు ఉపయోగపడ్తాయి.

### పిల్లలు ఏమి నేర్చుకుంటారు?

- శారీరక దృఢత్వం పెంపొందించుకుంటారు.
- సమతుల్యత, సమన్వయం సాధిస్తారు.
- లక్ష్యాన్ని చేరుకునే నైపుణ్యాన్ని అభివృద్ధి చేసుకుంటారు.
- సృజనాత్మకత, సమస్య పరిష్కార సామర్థ్యాలను పెంచుకుంటారు.
- సమూహంగా ఆడటం, సహకరించడం నేర్చుకుంటారు.



ఊయలలు



ఎక్కే చట్రాలు



మ్యూజికల్ సీట్స్



నిర్మాణాత్మకమైన ఆటలు

**టైర్లతో ఆడే ప్రతి ఆట - ఆరోగ్యం, ఆనందం, ఆత్మవిశ్వాసానికి పునాది!**

– శ్రీమతి మీనాస్వామినాథన్

'పిల్లలకు ఆటలు–పాటలు' పుస్తకం నుండి

సీరియల్-14

# బంగారు మల్లి



(బాలలకోసం ఆధునిక సాహస నవల)

(గత సంచిక తరువాయి...)



స్పెషల్ టీం రంగంలోకి దిగింది. నాదర్‌గుల్, రావిర్యాల ప్రాంతాలలో తిరిగిన పులి పాదముద్రలు కొలిచారు. సెన్సార్ కెమేరాలలోని మెమోరీ కార్టులు తెప్పించారు. నాదర్‌గుల్‌లో పులి, రావిర్యాలలోని పులి ఫోటోలు పరిశీలించారు. ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్, డివిజనర్ ఫారెస్ట్ ఆఫీసర్ ఘటనా స్థలానికి చేరుకున్నారు.

పులి కదలికలపై సమాచారం తెలుసుకుంటున్నారు.

విలేకరులు డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్‌ను చుట్టు ముట్టారు.

"పులులు రెండు ఉన్నాయా? రెండు చోట్ల కనిపించింది ఒక పులా!?" ఒక విలేఖరి అడిగాడు.

"రెండూ వేరు వేరు!! రావిర్యాలలో కనిపించింది ఆడపులి! రాజేంద్రనగర్ మీదుగా నాదర్‌గుల్ చేరుకున్న పులి మగపులి!!"

"రెండు చోట్ల కనిపించిన పులులు నారింజ రంగు శరీరంలో నల్లని చారలు, తెల్లటి పొట్టలతో పాటు చెవులపై తెల్లటి మచ్చలు కలిగి ఉన్నాయి. అని రెండూ ఒకటి కాదని అంత కచ్చితంగా ఎలా చెపుతున్నారూ!?"

"మనిషి వేలిముద్ర వలె, ఏ రెండు పులుల శరీరంపై చారలు ఒకే విధంగా ఉండవు. ఇక్కడ కనిపిస్తున్న రెండు పులుల శరీరంపై చారలు వేరుగా ఉన్నాయి. ఇంకా రావిర్యాలలో కనిపించిన పులి పాదముద్రలు చిన్నగా ఉన్నాయి. సెన్సార్ కెమెరా మెమోరీ కార్డు ద్వారా ఫోటోలు పరిశీలించాం. దాంతో.. ఆ రెండు పులులు వేరువేరని తేలింది. పాదముద్రలు బట్టి రావిర్యాలలో కనిపించింది వయసులో ఉన్న ఆడపులి. బహుశా తన మిత్రుడు మగ పులిని వెతుక్కుంటూ ఆడ పులి వచ్చి ఉంటుంది" అన్నాడు డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్.

"పులులు ఎందుకు అడవి దాటుతున్నాయి!?"

"అడవిలో ఆహార కొరత, నీటి కొరత, ఆవాస నాశనం,మానవ - వన్యప్రాణి సంఘర్షణ, వాతావరణ మార్పులు, ఇంకా పులుల సంఖ్య పెరుగుతున్న క్రమంలో పులులు అడవి దాటి బయటకు జనారణ్యంలోకి వస్తున్నాయి అంతేకాదు తమ సామ్రాజ్య విస్తరణలో భాగంగా వాటికి తెలియకుండానే అడవి దాటి గ్రామాలకు వస్తున్నాయి. నిజానికి ఆడ, మగ పులులు కలిసి జీవించకున్నా, తమ

సంతాన ఉత్పత్తికోసం కొంత కాలం స్నేహంగా ఉంటాయి” అన్నాడు.

“ఐతే, సామ్రాజ్య విస్తరణ చేస్తుందని మనం ఎలా కనిపెట్టాలి?”

“పులి దాని ఆహార లభ్యతను బట్టి సామ్రాజ్యాన్ని నిర్మించుకుంటుంది. దాన్ని తన సామ్రాజ్యపు కోటగా భావించి ఇంకో పులికి (ఆడ లేదా మగ) తెలిసేలా తన యూరిన్(మూత్రం) ద్వారా చెట్లకు స్ప్రే చేసి టెరిటరీని కంట్రోల్‌లో ఉంచుకుంటుంది. ఒకవేళ వేరే పులి ఏదైనా తన సామ్రాజ్యంలోకి వస్తే ఆ పులితో భీకర పోరాటం చేస్తుంది.

ఆ యుద్ధంలో ఎవరు గెలిస్తే వారిదే ఆ సామ్రాజ్యం అన్నట్లుగా పులులు భావిస్తాయి.

“సరే! ఇప్పుడు అడవి దాటి నగర శివారుల్లోకి వచ్చిన మగ, ఆడ రెండు పులుల్ని ఎప్పటిలోగా పట్టుకుంటారు?”

“పులులు కనిపించిన ప్రాంతాల్ని ముట్టడి చేసి పులులు పారిపోకుండా చూస్తున్నాము. పులుల్ని భద్రంగా పట్టుకోవడానికి సరైన పరికరాలను తెప్పించాము. రేపు ఉదయం వరకు పట్టుకుంటాము” అన్నాడు అధికారి.

డ్రోన్లను ఉపయోగించి పులిని కనుక్కోవాలనుకున్నారు. మొత్తం మూడు డ్రోన్‌లను సిద్ధం చేశారు..

డ్రోన్‌లో కెమెరా, సెన్సర్లు, గ్లోబల్ పొజిషనింగ్ సిస్టమ్ (GPS) ఉంచారు.

వాటిని నాదర్‌గుల్, రావిర్యాలతో పాటు పక్కనే ఉన్న కొంగరకలాన్ ప్రాంతాలలో ఏర్పాటు చేశారు. అవి గాల్లో ఎగిరాయి. కెమెరా, సెన్సర్ల ద్వారా డేటాను సేకరిస్తున్నారు.

డ్రోన్ ద్వారా సేకరించిన డేటాను విశ్లేషించసాగారు. ఈ డేటా పులి ఉనికిని గుర్తించడంలో సహాయపడుతుంది. పులులను పట్టుకోవడానికి నిపుణులంతా సిద్ధంగా ఉన్నారు.

అన్ని ప్రముఖ టీవీ న్యూస్ ఛానల్స్ ప్రత్యక్ష ప్రసారం చేస్తున్నాయి. ప్రజలంతా టీవీలకు ముందు కూర్చొని ఆసక్తిగా తిలకిస్తున్నారు. (సశేషం...)

– పైడిమర్రి రామకృష్ణ
m : 92475 64699



# పదాల మేడ-2




| | | | | | |
|---|---|---|---|---|---|
| 1 | | 3 | | 7 | |
| | | 6 | 11 | | |
| 2 | 4 | | 8 | | 10 |
| | | 5 | | | |
| | | | | 12 | |
| 9 | | | | | |

**అడ్డం:**

1. ప్రతి రోజు ఇది చేస్తే ఆరోగ్యానికి మంచిది (3)
2. కొందరు ఇడ్లీని దీనితో కూడా తింటారు (2)
5. ఇంటి బయటి ప్రదేశం తిరగబడింది (3)
6. స్నేహం (3) 7. పర్యటన (2) 8. మానవుడు (3)
9. గతంలో టీవీ లో రంగులు ఇలాగే ఉండేవి (6)
12. వాళ్ళు రావడం లేదని చెప్పండి (2)



**నిలువు:**

1. ఏ భాషలోనైనా ఇది తప్పకుండా ఉంటుంది (4)
3. రైతు పంటను కాపాడటానికి ఉపయోగించే అడ్డా (2)
4. విషయాలు (4) 7. రాత్రి (3) 10. వ్యాహ్యాళి (3)
11. గమ్యం గజిబిజి అయ్యింది.. చివర్లో దీర్ఘం పోయింది (3)
12. ఆకులు పండితే కిందకు (2)

– మాదారపు వాణిశ్రీ
హన్మకొండ
m : 9247286668



కథ

# మారిన దొంగ



రామవరం అనే ఊరిలో సోము అనే పిల్లవాడు ఉండేవాడు. అతను తన తల్లిదండ్రులతో కలిసి తోట పనికి వెళ్లేవాడు పొద్దంతా పనిచేస్తే వారికి కొద్ది డబ్బులు మాత్రమే లభించేవి. చిన్నప్పటినుండి సోముకు ఏ పని చేయకుండానే బాగా డబ్బు సంపాదించాలని కోరిక ఉండేది.

ఒకరోజు సోము మేకలను తోలుకొని అడవికి వెళ్ళాడు. మధ్యాహ్నం చెట్టు కింద కూర్చొని తాను ధనవంతుడినైపోయినట్టు కలలు కంటూ నిద్రపోయాడు. లేచి చూసేసరికి చీకటి పడిపోయింది. మేకలన్నీ ఎక్కడికో వెళ్లిపోయాయి. ఇంటికి వెళితే వాళ్ల నాన్న తిడతాడనే భయంతో సోము ఆ ఊరు విడిచిపెట్టి మరో ఊరికి వెళ్ళిపోయాడు.

దారిలో రాత్రి సోముకు దొంగలు కనబడ్డారు. వారు సోము దగ్గర దోచుకోవడానికి ఏమీ లేకపోవడంతో కొట్టి వెళ్లిపోయారు. వారి దగ్గర డబ్బు నగలు చూసిన సోముకు దొంగతనం చేస్తే తొందరగా డబ్బు సంపాదించవచ్చునని అనుకున్నాడు. తెల్లవారే సరికి ఒక ఊరికి చేరుకొన్నాడు. ఆకలిగా ఉండటంతో ఒక పండ్ల తోటలోకి వెళ్లి దొంగతనం చేసి తిన్నాడు. కాపరులు కొట్టడానికి వస్తే అక్కడి నుండి పారిపోయాడు. అప్పటినుండి సోము దొంగతనాలు చేయడం మొదలుపెట్టాడు. పొద్దంతా విశ్రాంతి తీసుకొని రాత్రి దొంగతనం చేస్తూ డబ్బు సంపాదించడం సోముకు బాగా అలవాటయింది. ఇలా రోజులు గడుస్తూ ఉండగా ఒకరోజు గ్రామాధికారి రంగయ్య ఇంట్లో దొంగతనానికి వెళ్లి పట్టుబడ్డాడు. సోమును చెట్టుకు కట్టివేసి బాగా కొట్టారు అప్పుడు గ్రామాధికారికి సోము జరిగిన విషయమంతా చెప్పి క్షమించి వదిలివేయమని కోరుకున్నాడు. గ్రామస్తులంతా సోము దొంగ అని అతన్ని వదిలేయవద్దని రాజుగారికి అప్పగించాలని గ్రామపెద్ద రంగయ్యను కోరారు. కానీ రంగయ్య ఒప్పుకోలేదు. పరిస్థితుల వల్ల, సరైన దారి చూపేవారు లేకపోవడం వల్లనే సోము దొంగగా మారాడని భావించాడు. అందుకని సోమును దగ్గరికి తీసుకొని కష్టపడితే వచ్చే సంపాదన మంచి చేస్తుందని, ఇతరులను మోసం చేసి దొంగతనాల వల్ల వచ్చే సంపాదన మనకు కీడు చేస్తుందని సోముకు బుద్ధి చెప్పాడు. తరువాత కడుపునిండా తిండిపెట్టి సోమును తన తోటలోనే పని ఇప్పించాడు.

దొంగతనం వల్ల కలిగే బాధల గురించి తెలుసుకున్న సోము అప్పటి నుండి కష్టపడి పని చేస్తూ మంచి పేరు తెచ్చుకున్నాడు.

– ఆర్. విశ్వక్సేనా రెడ్డి
6వ తరగతి, మాస్టర్ మైండ్ స్కూల్, సిద్దిపేట.
మహేందర్ (టీచర్), m: 99595 25955

# పేరాశ పనికి రాదు



పూర్వం ఒక అడవిలో ఒక ముసలి పులి ఉండేది. జంతువుల వెంట వేగంగా పరిగెత్తలేక వేట మానేసింది. అడవిలో దొరికిన మాంసం తిని బ్రతుకుతున్నది. దొరకని రోజు ఆకలితో అలమటించేది. ఏ జంతువు దగ్గరికి వచ్చేది కాదు. ఆహారం దొరకక పులి బాగా నీరసపడిపోయింది. అప్పుడు దానికి ఒక ఉపాయం తట్టింది. గతంలో ఒక వర్తకుని వద్ద దొరికిన నగల మూటలోంచి ఒక బంగారు కడియాన్ని తీసుకుని అడవి సమీపంలోని చెరువు దగ్గరకు చేరింది. ఆ బంగారు కడియాన్ని చేతిలో పట్టుకుని చెరువు గట్టున కూర్చుంది. చెరువు గట్టు పక్కనే ఒక రహదారి వుంది. అటువైపు వచ్చే మనుషుల కోసం ఎదురు చూస్తుంది. అప్పుడు ఒక బాటసారి ఆ దారిలో వస్తూ కనిపించాడు. పులి అతనిని 'ఓ బాటసారి! ఇలా రా! ఈ బంగారు కడియాన్ని తీసుకో అంది. అప్పుడు ఆ బాటసారి పులిని చూసి పారిపోయాడు. అలాగే మరికొందరు వచ్చి పులిని చూసి దాని మాటలు పట్టించుకోకుండా పారిపోయారు. ఒకరిద్దరు ఆశపడి సమీపానికి వచ్చి క్రూర జంతువును నమ్మలేక వెళ్ళిపోయారు.

కొంచెం సేపటికి ఒక పూజారి తన గ్రామానికి పోతూ అటు వచ్చాడు. పులి అతనిని పిలిచి 'ఓ బాటసారీ! ఇలారా' ఈ బంగారు కడియాన్ని తీసుకో అంది. పులి చేతిలోని మెరిసే బంగారు కడియాన్ని చూసి ఆశపడ్డాడు. 'నీ దగ్గరకు వస్తే నన్ను చంపి తింటావుగా, నాకు వద్దులే' అన్నాడు.

అప్పుడు ఆ పులి 'ఓ బాటసారీ! నేను ముసలిదానిని. పళ్ళు ఊడిపోయాయి. గోళ్ళు కూడా లేవు ఒకప్పుడు వేటాడి అనేక జంతువులను, మనుషులను చంపి తిన్నాను. ఒక రోజు ఒక మునీశ్వరుడు "పులీ! నువ్వు అనేక తప్పులు, పాపాలు చేసావు. అందుకే ఈ కష్టాలు. ఇక నుంచి వేట మానేసి శాఖాహారం తీసుకో. పాపాలు తొలగి స్వర్గానికి పోతావు' అని చెప్పి ఈ కడియం యిచ్చాడు. ఉత్తముడికి దానం చేయమన్నాడు. రా... వచ్చి తీసుకో" అంది. అతని ఆశ భయాన్ని ఓడించింది. ధైర్యంగా పులి వద్దకు వచ్చాడు.

అప్పుడా పులి "సాంప్రదాయాలా తెలుసు కదా. వెళ్ళి ఆ చెరువులో స్నానం చేసి వచ్చి ఈ దానం తీసుకో" అన్నది. పూజారి చెరువులో దిగి, బురదలో కూరుకుపోతాడు. పులి నెమ్మదిగా వెళ్ళి అతన్ని చంపి హాయిగా తిన్నది.

**నీతి : పేరాశ ప్రాణాలకు చేటు అని పెద్దలు చెబుతుంటారు.**

సేకరణ: అమరావతి





### తెలంగాణ చారిత్రక పర్యాటకం


# ఆరాధన - ఆలయ సంస్కృతి

వైయుక్తికమైనటువంటి వికాసమే సంస్కృతి - మార్పు అనేది ప్రకృతి సహజ స్వభావము. సామాన్యముగా మనిషికి చదువుట, వ్రాయుట (లిపి) తెలిసినప్పటి నుండి చారిత్రకయుగమని, అంతకు పూర్వమున్న కాలమును చరిత్ర పూర్వయుగం అని అన్నారు. భారతదేశంలో సామాన్య పూర్వశకం 3000 సం॥ల క్రితమే విలసిల్లిన సింధూ నాగరికత నాటి ప్రజలకు చదవడం, వ్రాయడం తెలుసు. కాని సింధూ లిపిని ఇంతవరకు పూర్తి స్థాయిలో కనుగొనబడలేదు. పాతరాతి యుగము (సా.పూ. 35,000-10,000) మన దేశ ప్రథమ నివాసులు పాతరాతి యుగపు ఆదిమానవులు, వీరు అనాగరికులు, ప్రధాన వృత్తి ఆహార సేకరణ, కొండగుహలు, చెట్టు తొర్రలు వీరి నివాసాలు. మత భావము లేదు. గుహలలో ప్రకృతిలోని వస్తువులు, జంతువుల వర్ణచిత్రాలు వీరి ప్రకృతి కళారాధనకు నిదర్శనములు. సూక్ష్మరాతి యుగం లేక మధ్య శిలాయుగం (సా.పూ 10,000) ఈ సంధి కాలమునందు మానవునికి నేర్పు, ఆలోచన పెరిగింది. రాతి ముక్కలను ఎముకలకు గాని, కర్రలకు గాని కట్టి ఈటెలుగా, గొడ్డల్లుగా ఉపయోగించాడు. జంతువులను మచ్చిక చేసుకోవడం, తన చుట్టూ ఉన్న ప్రకృతి, మనుషులకు మరియు చుట్టూ ఉన్న జంతువులు జీవులకు అవల అతీంద్రయ శక్తి ఏదో ఉందని వీరి నమ్మకం. మరణించిన వారిని పాతిపెట్టే ఆచారం ఏర్పడింది. మరణానంతరము జీవితంపై విశ్వాసములు కలిగినవి. చిహ్నముల ఆధారంగా ఈ కాలంలో మతవిశ్వాసములు, ప్రకృతి దేవతారాధన ప్రారంభమైనట్లు చెప్పవచ్చును. నవీన శిలాయుగం (సా.పూ. 10,000-5,000) ఈ యుగంలో మానవుడు సంచార జీవనాన్ని వదిలి గృహములు నిర్మించుకొని, వ్యవసాయం, పశుపోషణ, నూలు, ఉన్నితో వస్త్రములు, లోహాలతో ఆభరణములు పనిముట్లు తయారు చేసుకొన్నాడు. ఈ కాలంలోనే పితృదేవతారాధన ప్రారంభమైంది. మృతులైన వారికి బండలతో సమాధులు, దేవతా ప్రీతి కొరకు జంతుబలులు నరబలులు ఇచ్చెడి ఆచారముండేది. ఆర్యుల రాకతోనే మన దేశ చరిత్ర ప్రారంభమైనదని విశ్వసించిన వారికి 1922లో నర్‌జాన్ మార్షల్ ఆధ్వర్యంలో పురావస్తు శాఖవారు పశ్చిమ పంజాబ్‌లోని హరప్పా వద్ద, సింధూరాష్ట్రంలో జరిపిన త్రవ్వకాల ఫలితంగా (సా.పూ. 3000-1700) ఒక గొప్ప విశిష్ఠ నాగరికత ఉన్నదని బయటపడింది. దీనితో మన చరిత్ర ఆర్యుల రాకతో గాక సింధూ ప్రజల నాగరికతతో ప్రారంభమైనదనే వికాసము కలిగింది. సింధూ త్రవ్వకములలో దేవాలయములు కన్పించలేదు కాని అందు బయటపడిన అనేక ముద్రలపై చెక్కిన బొమ్మలు, స్వస్తిక్ చిహ్నాలు, మట్టి పాత్రలపై చిత్రాలు, కంచు, రాతితో చేయబడిన విగ్రహములు నాటి ప్రజల కళాదృష్టికి, నైపుణ్యానికి నిదర్శనములు. వీరు స్త్రీ దేవతలకు ఎక్కువ ప్రాధాన్యతనిచ్చి పూజించారు. ఆదిశక్తి (Mother Goddess) వీరి ముఖ్య దేవత. వీరు పశుపతిని, లింగరూపమును, పశుపక్షాదులను నాగులను కొలిచేవారు. వేదకాలం (సా.పూ. 1750-500) ఇండో-ఆర్యుల మతం వీరు మధ్య ఆసియా నుండి భారతదేశానికి వచ్చారని ఆర్యుల చరిత్రకు ముఖ్య ఆధారం వైదిక వాఙ్మయం అని ఇది సా.పూ. 1500-500 సం॥ మధ్య విలసిల్లిందని చరిత్రకారుల అంచనా. వేద వాఙ్మయము అనగా ఋక్, యజు, సామ, అధర్వణ వేదములని నాలుగు కలవు. వీటిలో ప్రాచీనమైనది ఋగ్వేదము, తర్వాత మిగిలిన మూడు వేదములు, అరణ్యకములు, బ్రాహ్మణములు, శ్రౌత, గృహ్యసూత్రములు, ఉపనిషత్తులు, ఇతిహాసములు వ్రాయబడినవి. ఆర్యులు ప్రకృతి శక్తులను పురాణములు, పంచభూతములను దైవిక శక్తులుగా ఆరాధించిరి. వీరి ముఖ్యదేవతలు ఇంద్రుడు, అగ్ని, వరుణుడు, వాయువు, సూర్యుడు, చంద్రుడు వీరు పురుషదేవతలు. అధితి, పృథ్వీ అను స్త్రీ దేవతలు కూడా గలవు. వీరందరిలో ఎక్కువ ప్రాధాన్యము గల దేవుడు ఇంద్రుడు. మానవుల వలనే దేవతలకు కూడా ఆకలి, దప్పులు ఆగ్రహం, అనుగ్రహములు ఉండునని ఆర్యుల నమ్మకం. అందుచేత వారి తృప్తికొరకు యజ్ఞయాగాది క్రతువులు చేస్తూ వేదమంత్రాలను పఠించేవారు. వేదమంత్రాలు కథనాలు, కావ్యాలు మౌఖికంగానే ఒక తరం నుండి మరొక తరానికి వ్యాప్తి చెందాయి. పుట్టినది మొదలు మరణించేవరకు, మరణం తర్వాత చేసే పూజలు, క్రతువులు, కర్మకాండలు వివిధ కార్యకలాపాలు ఒక క్రమ పద్ధతిలో నాటి రాతియుగం నుండి నేటి ఆధునిక యుగం వరకు ఏదో ఒక రూపంలో ఆరాధనా పద్ధతిని కొనసాగింపును వాటిలోని వివిధ మార్పులను మనం గమనించవచ్చును.

- దేశరాజు శ్యాంసుందర్‌రావు - స్థపతి
m : 9010051177

# రాక్షసుడి గుహలో రాజకుమారి




రాక్షసుడు ఎత్తుకువచ్చిన రాజకుమారి - దారితప్పి తమ గుహలోకి వచ్చిన అందగాడితో పగలంతా ఆటలాడి, రాక్షసుడు తిరిగి వచ్చేవేళకి అతడిని బల్లిగా మార్చి గోడ మీద వదిలేదిట. రాక్షసుడు ఉదయం బయటకి పోగానే ఆ బల్లిని మళ్లీ మనిషిగా మార్చుకుని వినోదించేదిట. అటువంటి కామరూప విద్య ఆ అమ్మడుకి రాక్షసుడి సహచర్యం వల్ల అబ్బి ఉంటుంది. ఆమె ప్రయోగించిన మంత్రం ఏమిటో మనకి తెలియదుగాని, ఇంచుమించు ఇటువంటి మార్పులే జరిపించే గమత్తు ఒకటి ఉంది.

ఒక్క క్షణం క్రితం మామూలు ఇనప ముక్క. మంత్రం వేస్తే అది మరుక్షణంలో బలమైన అయస్కాంతంగా మారిపోతుంది! మరో మంత్రం వేస్తే కన్ను మూసి తెరిచే లోగా అది అయస్కాంత ధర్మాన్ని కోల్పోయి వట్టి ఇనప ముక్క అయిపోతుంది. ఈ విధంగా ఎప్పుడు కావాలని అనుకుంటే అప్పుడు - సెకనులో వెయ్యో వంతు వ్యవధిలో - మామూలు ఇనప ముక్కను అయస్కాంతం గానూ, మళ్లీ దానిని వట్టి ఇనప ముక్కగానూ మార్చివేసే గారడీ ఇది.

దీనికి కావలసిన వస్తువులు: పెద్ద ఇనప మేకు లేదా ఇనప బోల్టు. ఇన్సులేట్ చేసిన మూడు నాలుగు మీటర్ల రాగితీగ, జిగురు టేపు, బేటరీలు, స్విచ్చి, ఇనప రజను.

ఎనామెల్ పూసిన (ఇన్సులేట్ చేసిన) రాగితీగను ఇనప బోల్టుమీద ఒక చివర మొదలుపెట్టి చక్కగా దగ్గర దగ్గరగా చుట్టుకుంటూ వెళ్లు. ఈ చుట్ల సంఖ్య పెరిగికొద్దీ దాని అయస్కాంత శక్తి పెరుగుతుంది. కాబట్టి ఒక వరస చుట్లు పూర్తి అయాక వాటి మీదనే మరో వరస చుట్లు చుట్టవచ్చు. చుట్లు ఎల్లప్పుడూ ఒకే వరసలో చుట్టుకుంటూ వెళ్లడం చాలా ముఖ్యం. ఒక వరస చుట్లు ఒక దిశలోనూ, రెండో వరస దానికి వ్యతిరేక దిశలోనూ చుట్టకూడదు. ఒక వరస చుట్లు పూర్తి అయాక ఆ చుట్లు విడిపోకుండా బోల్టు చివర జిగురు టేపు అతికించ వచ్చు. ఈ విధంగా రెండు మూడు వరసలు చుడితే చాలు మనం చేయబోయే గమత్తులన్నింటికీ పనికి వస్తుంది.

చుట్టిన రాగి తీగ తాలూకు రెండు కొసలను ఒక స్విచ్చి ద్వారా బేటరీ ధన, రుణ ధ్రువాలకు కలపాలి. 6 వోల్టుల బేటరీ (అంటే నాలుగు సెల్సు) ఉంటే చాలు.

స్విచ్చి తీసేసి ఉన్నంత సేపూ ఇనప బోల్టు వట్టి ఇనప ముక్కగానే ఉంటుంది. స్విచ్చి వేసీ వెయ్యగానే 'విద్యుత్ వలయం' (Circuit) పూర్తి అయి రాగి తీగలో విద్యుత్తు ప్రవహిస్తుంది; ఇనప బోల్టు బలమైన అయస్కాంతంగా మారిపోయి, ఇనప రజనుని ఆకర్షిస్తుంది.

స్విచ్చి తీసెయ్యగానే వలయం తెగిపోయి, విద్యుత్ ప్రవాహం ఆగిపోతుంది; వెంటనే అయస్కాంత శక్తి కోల్పోయి, బోల్టు మామూలు ఇనప ముక్కగా మారిపోతుంది. ఇంతకు ముందు అతుక్కుని ఉన్న రజను జారి కింద పడిపోతుంది.

ఇతరులకు కనిపించనిచోట, నీ కాలి బొటనవేలికి కింద స్విచ్చిని దాచి ఉంచి, దానిని వేస్తూ తీస్తూ ఈ గారడీని ఎన్నిసార్లు అయినా చెయ్యవచ్చు.

- డాక్టర్ మహీధర నళినీ మోహన్

'ప్రతి ఇంటా ప్రయోగశాల' నుండి

లఘు నాటిక




# వాన వచ్చేసిందోచ్!

**పాత్రలు – పాత్రధారులు: జగదీష్ – తండ్రి, మణి – తల్లి, రేవంత్ – పెద్ద కొడుకు, సుమంత్ – చిన్న కొడుకు, రాములు – పొరుగింటి వ్యక్తి (హాస్య పాత్ర)**

(జగదీష్ చేతిలో ఫ్యాన్ పట్టుకుని ఊపుకుంటుంటాడు, మణి చెమట తుడుచుకుంటూ ఉంటుంది)

జగదీష్: అయ్యో మణీ! ఈ ఎండలు చూస్తుంటే సూర్యుడు తన ఇంట్లోని హీటర్ బయట పెట్టేశాడేమో!

మణి: హీటర్ కాదు, మొత్తం ఫ్యాక్టరీనే బయట పెట్టినట్టుంది. వంటగదిలో నేను వంట చేస్తున్నానో, వంటే నన్ను చేస్తున్నదో అర్థం కావడం లేదు.

రేవంత్: (రేవంత్ మొబైల్ చూస్తూ వస్తాడు.) అమ్మా, నాన్నా! వాతావరణ శాఖ చెబుతోంది. ఈరోజు భారీ వర్షాలు పడతాయట.

జగదీష్: ఆ శాఖ చెప్పిన మాటలు నమ్మి నేను గత సంవత్సరం గొడుగు కొన్నాను. ఇప్పటికీ కొత్తగానే ఉంది!

మణి: అవునండి! దానికి దుమ్ము తుడవడమే నా పని. (అందరూ నవ్వుతారు.)

## దృశ్యం – 2

(ఉరుములు వినిపిస్తాయి. మెరుపుల శబ్దం.)

రేవంత్: నాన్నా! ప్రకృతి మీ కామెడీని సీరియస్‌గా తీసుకున్నట్టుంది.

జగదీష్: అయ్యో! నిజంగానే మబ్బులు కమ్ముకున్నాయి. వాన మొదలైంది

మణి: వర్షం పడితే బాగుంటుంది అని ఇలా అనుకున్నామో లేదో ఎలా జోరుగా పడుతుందో పోనీలే బోరు బావిలో నీళ్లు కూడా తగ్గిపోయాయి. నీళ్ళన్నా నిండుతాయి.

రేవంత్: యాహూ! వర్షం!

మణి: భగవంతుడా ఈ సంవత్సరం వానలు బాగా కురవాలి పంటలు బాగా పండాలి

జగదీష్: ఇంతకీ సుమంత్ ఏడి?

రేవంత్: బడి వదలగానే నేను వచ్చేశాను. వీడు ఎక్కడ పెత్తనాలు చేస్తున్నాడో (సుమంత్ బయట నుంచి పూర్తిగా తడిసి వస్తాడు.)

సుమంత్: అమ్మా... నాన్నా... (ఒక పోజ్ ఇస్తాడు)

సుమంత్: వాన వచ్చేసిందోచ్! (డాన్స్ చేస్తాడు )

మణి: అయ్యో! ఈ పిల్లాడిని చూడండి. నడిచి వచ్చాడో, ఈదుకుంటూ వచ్చాడో!

జగదీష్: నీ బట్టల నుంచి కారుతున్న నీళ్లతో మన ఇంటి ట్యాంక్ నిండిపోతుంది.

సుమంత్: నాన్నా! వానలో ఆడుకోవడం ఎంత సరదాగా ఉందో తెలుసా?

రేవంత్: రేపు జలుబు వస్తే అదే సరదా హాస్పిటల్ వరకు వెళ్తుంది.

సుమంత్: అన్నయ్యా! ఆనందానికి చిన్న చిన్న రిస్కులు ఉంటాయి.

## దృశ్యం – 3

రాములు: (రాములు గొడుగు పట్టుకుని వస్తాడు.) జగదీష్ గారూ! మీ కొడుకు వానలో చేసిన పనులు చూస్తే నవ్వాలో ఏడవాలో అర్థం కాలేదు.

జగదీష్: ఏం చేశాడు?

రాములు: రోడ్డుపై నిలబడి "వానా వానా వందనం " అంటూ డ్యాన్స్ చేశాడు.

సుమంత్: వాన వచ్చిందంటే ఆనందపడాలి కదా! అన్నట్టు ఎన్నాళ్లకు గుర్తొచ్చిందే వాన
ఈ పాటకి కూడా డాన్స్ చేసా అది చెప్పలేదేంటి అంకుల్?

రాములు: ఆనందం ఓకే. కానీ ట్రాఫిక్ పోలీస్‌లా చేతులు ఊపుతూ వర్షానికి డైరెక్షన్ ఇవ్వడం ఏంటి? (అందరూ నవ్వుతారు.)

మణి: ముందు బట్టలు మార్చుకు రా (సుమంత్ లోపలికి వెళ్తాడు)

జగదీష్: రాములు గారు రండి కూర్చోండి. వానలో గొడుగు వేసుకుని మరీ వచ్చారు.

రాములు: మన అపార్ట్‌మెంట్లలో రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ పెట్టుకోలేదు మీరే ప్రెసిడెంట్ గుర్తు చేద్దామని...

రేవంత్: రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ అంటే?

జగదీష్: అది చెప్పాలంటే నా ప్రశ్నకి సమాధానం చెప్పు ఇంతకీ వాన ఎందుకు ముఖ్యమో చెప్పు?

సుమంత్: (బట్టలు మార్చుకుని టవల్‌తో తల తుడుచుకుంటూ వస్తాడు) వాన పడితే... బురదలో కాగితపు పడవలు వదలొచ్చు!

రేవంత్: అది నీకు ముఖ్యమైన విషయం. దేశానికి కాదు.

సుమంత్: అయితే చెట్లు పెరుగుతాయి.

సుమంత్: పచ్చదనం పెరుగుతుంది.

జగదీష్: సరే. ఇంకా

సుమంత్: స్కూల్‌కు సెలవు కూడా రావచ్చు! అమ్మా పకోడీ చెయ్ పకోడీ తినొచ్చు

జగదీష్: అవన్నీ కాదు. వానలు వచ్చినప్పుడు ఆ వర్షపు నీరు వృథా కాకుండా ఇంకుడు గుంట ఏర్పాటు చేసి నీటిని కాపాడుకోవడం.

రాములు: మనం వాన నీటిని వృథా చేస్తున్నాం నీరు కాపాడుకుంటే నీటి సమస్య ఉండదు

మణి: అవును. వర్షపు నీటిని నిల్వ చేసుకోవాలి

రేవంత్: నాన్నా అదెలాగో మాకు చూపిస్తారా? మా బడిలో కూడా నీరు వృథా కాకుండా మా టీచర్‌కి చెప్పి చేస్తాం.

జగదీష్: తప్పకుండా నీరు లేక రైతులు ఎంత బాధపడుతున్నారో

మణి: అవునండి వాన పడితేనే పంట పండుతుంది. పంట పండితేనే అన్నం మన ఇంటికి వస్తుంది.

రాములు: అవును చెల్లెమ్మా రైతు జీవితానికి వర్షం ఎంత ముఖ్యమో ఇప్పుడు అర్థమవుతోంది.

రేవంత్: రైన్ వాటర్ హార్వెస్టింగ్ చేయడం వల్ల అందరికీ ఉపయోగం.

జగదీష్: నీరు బయటకు పారకుండా మన వున్న చోటే భూమిలోకి ఇంకిపోయేలా చేయడం. వాన తగ్గాక మనం మన అపార్ట్‌మెంట్స్‌కి చేద్దాం మీరు మీ స్కూల్‌లో చేయండి.

జగదీష్: అంతే కాదు చెట్లు నాటాలి.

రాములు: ప్రకృతిని కాపాడాలి.

సుమంత్: మరి వానలో ఆడుకోవచ్చా?

అందరూ: జాగ్రత్తగా ఆడుకోవచ్చు!

జగదీష్: సుమంత్! ఇకనుంచి వానలో తడవాలంటే ముందుగా అనుమతి తీసుకోవాలి.

సుమంత్: సరే నాన్నా!

మణి: తడిచొచ్చాక వేడి పాలు తాగాలి.

సుమంత్: సరే అమ్మా!

రేవంత్: జలుబు రాకుండా జాగ్రత్త పడాలి

సుమంత్: సరే అన్నయ్యా!

రాములు: మరి వానకు డైరెక్షన్లు ఇవ్వకూడదు.

సుమంత్: అదెలా కుదురుతుంది?

అందరూ: ఎందుకు?


సుమంత్: ఈరోజు నేను పిలిచాను కాబట్టే వాన వచ్చింది! (అందరూ నవ్వుతారు.)

అందరూ కలిసి: "వాన వచ్చేసిందోచ్!"
"నీటిని ఆదా చేద్దాం!"
"చెట్లు నాటుదాం!"
"ప్రకృతిని కాపాడుదాం!"

(ముగింపు గీతం)(అందరూ): వాన చినుకే జీవన గీతం
వాన చినుకే ప్రకృతి వరం
నీటిని కాపాడుదాం పచ్చని భూమిని అందరం కాపాడుదాం!

– డా. సమ్మెట విజయ
m: 99898 20215

# భారతీయ మహిళా శాస్త్రవేత్తలు




మీకు ఇష్టమైన ఇద్దరు భారతీయ శాస్త్రవేత్తల పేర్లు చెప్పండి లేదా నలుగురు ప్రపంచ శాస్త్రవేత్తల పేర్లు ఏమిటంటారు? అని ఒక ప్రశ్న అడిగితే ఎవరైనా పెద్ద ఇబ్బంది లేకుండా జవాబు చెబుతారని భావిస్తాం కదా! అలా కాకుండా ఇలా పేర్లు పేర్కొనేటప్పుడు ఇద్దరిలో ఒకరు లేదా నలుగురిలో ఇద్దరు మహిళ శాస్త్రవేత్తలై ఉండాలని నిబంధన పెట్టినప్పుడు జవాబులు ఎలా ఉంటాయి? కొంచెం ఇబ్బంది కదా! మొత్తం ప్రపంచంలో అయినా, భారతదేశంలో అయినా శాస్త్రసాంకేతిక రంగాలలో మహిళల పేర్లు పెద్దగా వినపడవు, కనపడవు. దీనిని మీరు పరీక్షించుకోవాలంటే నోబెల్ బహుమతి పొందిన మహిళా శాస్త్రవేత్తలు లేదా మనదేశంలో అయితే పద్మశ్రీ వంటి పురస్కారాలు పొందిన మహిళా శాస్త్రవేత్తలు ఎందరో ఒకసారి పరిశీలించండి. STEM గా పిలవబడే సైన్సు, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మ్యాథమెటిక్స్ విభాగాలలో మహిళలు తక్కువనే అభిప్రాయం భారతదేశంతో పాటు ప్రపంచ వ్యాప్తంగా ఉంది. ఇటువంటి నేపథ్యంలో 2020 సంవత్సరం 'నేషనల్ సైన్స్ డే'కి 'విజ్ఞాన శాస్త్ర రంగాలలో మహిళలు' అనే అంశం ఇతివృత్తమైంది. వివక్షను, పరిమితులను అధిగమించడానికి పరిశోధనా రంగంలో మహిళలకు ప్రత్యేక అవకాశాలు కల్పించడానికి ఈ చర్య తీసుకున్నారు. శాస్త్ర సాంకేతిక రంగంలో మరిన్ని పరిశోధనా అవకాశాలు కల్పించి మరింత మహిళా సాధికారత సాధించడానికి కేంద్ర ప్రభుత్వపు శాస్త్ర సాంకేతిక మంత్రిత్వ శాఖ, మహిళల పిల్లల సంక్షేమ మంత్రిత్వ శాఖ, యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ సంయుక్తంగా ఈ ప్రయత్నాన్ని చేపట్టాయి. మహిళా శాస్త్రవేత్తల ప్రతిభను గౌరవిస్తూ, మరింత మందికి స్ఫూర్తిని, ఉత్సాహాన్ని కలిగిస్తూ సైన్సు, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మ్యాథమెటిక్స్ విభాగాలలో 11 అధ్యయన పీఠాలను ఏర్పరిచారు. వివిధ విశ్వవిద్యాలయాలు పరిశోధనా సంస్థలలో ప్రత్యేక నిధులతో ఏర్పాటు చేసిన ఈ అధ్యయన పీఠాలకు మహిళ శాస్త్రవేత్తలే సారథ్యం వహిస్తున్నారు. సామాజికమైన కట్టుబాట్లు, అర్థం లేని అవరోధాలు అధిగమించి విజయం సాధించిన 11మంది మహిళా శాస్త్రవేత్తలు పేరున ఈ పీఠాలు ఆయా విభాగాలలో ఉన్నాయి. ఈ 11 మంది ఆధునిక భారతీయ మహిళా శాస్త్రవేత్తల గురించి క్లుప్తంగా ఒకసారి తెలుసుకుందాం.

## వ్యవసాయం, సైటో జెనిటిక్స్ - అర్చన శర్మ (1932-2008):

మరాఠీ ప్రాంతం పూణే నగరంలో జన్మించిన అర్చన శర్మ జన్యు శాస్త్రవేత్తగా కన్ను శాస్త్రవేత్తగా ప్రసిద్ధి చెంది క్రోమోజోముల నిర్మాణం వృక్షజాతి ఉత్పత్తి మ్యూటు జనసిస్ వంటి అంశాలలో గణనీయమైన కృషి చేశారు. కలకత్తా విశ్వవిద్యాలయంలో చిరకాలం పనిచేసిన వీరు భర్తతో కలిసి అధునాతన పరిశోధనలను మిగతా ప్రపంచానికి తెలియ జేయడానికి 'ది న్యూక్లియస్' అనే అంతర్జాతీయ జర్నల్‌ను ప్రచురించారు.

## వృక్షశాస్త్రం / బయోటెక్నాలజీ - డా జానకి అమ్మాళ్ (1897-1984):

సైటాలజీ, జోనెటిక్స్, ఫైటో బయాలజీ, ఎథ్నో బాటని, ఔషధ మొక్కలు క్రోమోజోముల ప్రవర్తన ఇలా పలు రకాలుగా కృషిచేసిన శాస్త్రవేత్త జానకి అమ్మాళ్. కేరళలో జన్మించిన వీరు కోయంబత్తూర్ లోని షుగర్ కేన్ బ్రీడింగ్ స్టేషన్ లో పరిశోధనలు

చేశారు. గాంధీజీని అభిమానించిన జానకి అమ్మాళ్ చివరి వరకు ఎటువంటి ఆర్భాటాలకు పోకుండా, ప్రచారానికి అర్రులు చాచకుండా సాగిన గొప్ప వ్యక్తి.

**ఆర్గానిక్ కెమిస్ట్రీ / ఇమ్యూనాలజీ – డా. దర్శన్ రంగనాథ్ (1941–2001):**

న్యూఢిల్లీలో జన్మించిన దర్శన్ సుప్ర మాలిక్యులర్ కెమిస్ట్రీ, మాలిక్యులర్ డిజైన్, జీవ ప్రక్రియల కెమికల్ సిమిలేషన్, హైబ్రిడ్ పెప్టైడ్లు ఇంకా నానో ట్యూబులకు సంబంధించిన సంశ్లేషణలు.. ఇలా అంశాలలో మన దేశం గర్వపడేలా పరిశోధనలు చేశారు. భర్త ఉద్యోగం కారణంగా స్థిరమైన ఉద్యోగం లభించకపోయినా కాన్పూర్, త్రివేండ్రం, హైదరాబాద్ వంటి చోట్ల ఉన్న పరిమితులతో గొప్ప ఫలితాలు సాధించిన ధీర.

**ఆర్గానిక్ కెమిస్ట్రీ ఫైటో మెడిసిన్ – డా. అసిమా చటర్జీ (1917–2006):**

భారతీయ విశ్వవిద్యాలయాల నుంచి డాక్టర్ ఆఫ్ సైన్స్ పట్టా పొందిన తొలి మహిళ అసిమా చటర్జీ. ఆల్కలాయిడ్స్, కామెరిన్స్, టర్పనాయిడ్స్ వంటి వాటికి సంబంధించి విశేషమైన కృషి చేసిన అసిమ చటర్జీ పరిశోధక విద్యార్థిగా మహా శాస్త్రవేత్తలు ప్రఫుల్ల చంద్ర రే, సతేంద్ర నాథ్ బోస్ వంటి వారితో కలిసి శ్రమించడం విశేషం. ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ నిర్వహణలో చాలా కీలక స్థాయిలలో కూడా వీరు కృషి చేశారు.

**వైద్యశాస్త్రం – డా కాదంబిని గంగూలీ (1861–1923):**

పాశ్చాత్య వైద్య శాస్త్రాన్ని అభ్యసించిన భారతీయ మహిళల్లో ఆనంది బాయి జోషి, కాదంబిని గంగూలి ప్రథములు. మన దేశంలో ప్రాక్టీస్ చేసిన తొలి మహిళ డాక్టరు ఈమె. సామాజిక వివక్షను ఎదుర్కొంటూ వైద్యాన్ని చదువుకున్న ఈమె ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ సమావేశాలలో మాట్లాడిన తొలి భారతీయ మహిళ.

**యాంత్రోపాలజీ – డా. ఐరావతి కార్వే (1905–1970):**

ఐరావతి అంటే బర్మా లోని ఒక నది పేరు. సోషియాలజీ, యంత్రపాలజీ, యాంత్రో పెమెట్రీ, సెరాలజీ, ఇండాలజీ, పాలియోంటాలజీ వంటి విభిన్న శాస్త్ర శాఖలలోనే కాకుండా జానపద గీతాలు సేకరించడం, స్త్రీవాద కవిత్వాన్ని అనువదించడం వంటి పలు పనులను సునాయాసంగా చేసిన విలక్షణమైన వ్యక్తి ఈమె. ప్రఖ్యాతిగాంచిన మహర్షి కార్వే రెండో కుమారుడు దినకర్‌ను వివాహమాడిన వీరు తన రచన 'యుగాంత'కు సాహిత్య అకాడమీ అవార్డు కూడా పొందారు.

**వాతావరణ శాస్త్రం – డా. అన్నమణి (1918–2001):**

కేరళలో జన్మించిన వీరు సి.వి. రామన్ వద్ద పరిశోధనలు ప్రారంభించారు. వాతావరణ విజ్ఞానానికి సంబంధించి ప్రాథమిక స్థాయిలో ఉన్నప్పుడు పరిశోధన ప్రారంభించిన వీరు సుమారు 100 పరికరాలకు సంబంధించిన డ్రాయింగ్లు టెక్నికల్ మాన్యువల్స్ తయారు చేశారు. ఓజోన్ వాయువును కొలవడానికి 'ఓజోన్ సోండ్స్' ను కూడా రూపొందించారు. జీవితాంతం గాంధీజీ మీద గురివున్న తొలితరం ఫెమినిస్టులలో అన్నమణి ఒకరు.

**ఇంజనీరింగ్ – డా. రాజేశ్వరి చటర్జీ (1922–2010):**

రాడార్ టెక్నాలజీ, డిఫెన్స్ సైన్స్, మైక్రోవేవ్ ఇంజనీరింగ్ వంటి అంశాలలో నిష్ణాతులైన రాజేశ్వరి చటర్జీ మైసూరులో జన్మించారు. బెంగళూరులోని ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ లో లెక్చరర్ గా పనిచేసిన వీరు ఎయిర్ క్రాఫ్ట్, స్పేస్ క్రాఫ్ట్ సంబంధించిన యాంటెన్నాలకు సంబంధించిన పరిశోధనకు పేరుగాంచారు.

**గణిత శాస్త్రం – డా. రామన్ పరిమళ (1948):**

ఆల్జీబ్రా సంబంధించి విశేష పరిశోధన చేసిన రామన్ పరిమళ టాటా ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్‌లో పనిచేసే శాస్త్రవేత్త. ఈమె తమిళనాడుకు సంబంధించిన వ్యక్తి.

**భౌతిక శాస్త్రం – డా. బిభా చౌదరి (1913–1991):**

పరమాణు కేంద్రకంలో ఉండే మెసాన్ (Meson) ద్రవ్యరాశిని తొలిసారి లెక్కించిన శాస్త్రవేత్త బిభా చౌదరి. పశ్చిమ బెంగాల్లో జన్మించిన విభా దేవేంద్రమోహన్ బోస్ దగ్గర పరిశోధన చేసిన వీరు హోమీ జహంగీర్ భాభా, విక్రమ్ సారాభాయ్, ఎం జి కె మీనన్ వంటివార్లతో కలిసి పని చేశారు. నక్షత్ర మండలంలోని తెల్లని పచ్చ నక్షత్రానికి 'బిభ' అని పేరు పెట్టడం మనదేశానికి ఎంతో గర్వకారణం.

**జీవవైద్య పరిశోధన – కమలా రణదీవే (1917–2001):**

క్యాన్సర్, కుష్టు వ్యాధులకు సంబంధించి చాలా విలువైన పరిశోధనలు చేసి రాణించిన శాస్త్రవేత్త కమలా రణదీవే. కుష్టు వ్యాధికి వ్యాక్సిన్ ఈమె కృషి కారణంగానే వచ్చింది. బొంబాయి విశ్వవిద్యాలయంలో పనిచేసిన కమల కృషి కారణంగానే క్యార్సినో జెనిసిస్, సెల్ బయాలజీ, ఇమ్యునాలజీ, టిష్యూ కల్చర్ వంటి విభాగాలు మన దేశంలో బాగా వృద్ధి చెందాయి.


– డా. నాగసూరి వేణుగోపాల్

ఆకాశవాణి విశ్రాంత సంచాలకులు,
ప్రముఖ సైన్స్ రచయిత
m : 9440732 392








# టేకు చెట్టు


హాయ్ పిల్లలు.. బడిబాట మొదలైంది కదా! రోజూ పాఠశాలకు వస్తున్నారు కదూ.. బాల చెలిమి పుస్తకంలోని అన్ని అంశాలు బాగా చదువుతున్నారా? మీరు కూడా కొత్త కొత్త విషయాలు రాసి పంపండి. అయితే ఈనెల మన "బాల చెలిమి" సంచికలో మనం చెట్టు – చేమ శీర్షికన 'టేకు' చెట్టు గురించి ఎన్నో విశేషాలు తెలుసుకుందాం.

ప్రపంచంలోనే అత్యంత విలువైన, గట్టి కలపనిచ్చే చెట్లలో టేకు చెట్టు అతి ముఖ్యమైనది. దీనిని "కలప వృక్షాల రారాజు" (The king of wood) అని పిలుస్తారు. భారతదేశంలో ఈ చెట్టును పారిజాత అని కూడా కొన్నిచోట్ల పిలుస్తారు. టేకు చెట్టు శాస్త్రీయ నామం "టెక్టోనా గ్రాండీస్" (Tectona gradis). ఇది 'లామియేసి' కుటుంబానికి చెందినది. టేకు అనేది సహజంగానే అత్యంత మన్నిక గల వృక్షం. దీనిలో ఉండే సహజ నూనెలు మరియు అధిక సాంద్రత వల్ల చెదలు, కీటకాలు మరియు వాతావరణ మార్పుల నుండి దృఢంగా ఉండి చాలాకాలం కలప మన్నిక గలిగి ఉంటుంది. ఇది ఉష్ణ మండలానికి చెందిన గట్టి తనం కలిగిన చెట్టు. ఇది పుష్పించే మొక్కల కుటుంబానికి చెందింది. టేకులో బర్మీస్ టేకు, సెంట్రల్ ప్రావిన్స్ టేకు, నాగ్పూర్ టేకు అని రక రకాలుగా ఉన్నాయి.

టేకు చెట్లు 150 అడుగుల ఎత్తు (46 మీటర్లు) వరకు పెరిగి సుమారు వంద సంవత్సరాలు బ్రతుకుతాయి. నాటిన 10-15 సంవత్సరాల తర్వాత టేకు చెట్టు కలప చేతికి వచ్చి ఉపయోగ పడుతుంది. ఈ చెట్టు చిన్న చిన్న కొమ్మలతో నిటారుగా పెరుగుతుంది. కొమ్మల చివరన గుత్తులు గుత్తులుగా టేకు పూలు కాయలతో కాస్తాయి. దీని ఆకులు మోదుగు చెట్టు ఆకులను పోలి వెడల్పుగా ఉంటాయి. ఇవి మొదట లేత ఎరుపు రంగులో ఉండి ముదిరినకొద్దీ ఆకుపచ్చ రంగులోనూ, ఎండిన తర్వాత గోధుమ రంగులోను దళసరిగా కనిపిస్తాయి. టేకు చెట్ల ఆకులలో ఆయుర్వేద పరంగా అద్భుతమైన ఔషధ గుణాలు కలిగి ఉంటాయి. ఇవి సాధారణంగా చర్మవ్యాధులను నయం చేయడంలో కీలక పాత్ర పోషిస్తాయి. ఈ ఆకుల రసాన్ని గాయం అయిన చోట రాస్తే త్వరగా మానుతాయి. దురద, ఎగ్జిమా వంటి సమస్యలను కూడా దీని కషాయంతో ఉపశమనం కలిగించవచ్చు. జ్వరం, గొంతు నొప్పి కూడా తగ్గుతుంది. ఆకులలో ఉండే పోషకాలు రక్తంలోని హిమోగ్లోబిన్ శాతాన్ని పెంచుతాయి. ఇది రక్తాన్ని శుద్ధి చేయడంలో కూడా తోడ్పడుతుంది. టేకును హిందీలో 'సాగ్వాన్' అని పిలుస్తారు. దేశీయంగా టేకు చెట్లు ఆసియాకు చెందినవి అయినప్పటికీ, లాటిన్ అమెరికా, ఆఫ్రికా, మయన్మార్ (బర్మా) థాయిలాండ్, ఇండోనేషియా వంటి ఉష్ణ మండల ప్రాంతాలలో పెద్ద ఎత్తున అడవి ప్రాంతాలలో బాగా పెరుగుతాయి. రైతులకు సిరులు కురిపించే టేకు చెట్లు తక్కువ పెట్టుబడి కలిగి లక్షలలో సంపాదన ఉంటుంది. సరిగ్గా వర్షాలు లేని మెట్ట, గుట్టల ప్రాంతాలలో, వ్యవసాయ గెట్లపొంటి, ఖాళీ ప్రదేశాలలో ఈ టేకు మొక్కలు బాగా నాటుతారు. టేకు కలప (టింబర్) దీర్ఘకాలం దృఢమైన గట్టిదనం ఉన్నందున కబోర్డ్స్, డైనింగ్ టేబుల్స్, కుర్చీలు, సోఫా సెట్లు, ఇంటి దర్వాజలు, కిటికీలు, తలుపులు, మొదలైన ఫర్నిచర్ తయారు చేస్తారు. టేకుతో తయారు చేసిన వస్తువులు ఎంతో నాజుకుగా ఉండి దీర్ఘకాలం మన్నిక గలిగి ఉంటాయి. ఇది చాలా ఖరీదైన కలప (కర్ర). అందుకే చాలా మంది ప్రతి ఇంటికి కనీసం ఒక దర్వాజ, కిటికీ అయినా టేకు వుడ్‌తో పెట్టడం సోషల్ స్టేటస్‌గా భావిస్తారు. ఆర్థికంగా డబ్బు ఉన్నవారు ఇంట్లో మొత్తం ఫర్నిచర్ టేక్‌తో తయారు చేసినవే వాడుతారు. ఇటీవల కాలంలో రైతులు కూడా తమ తమ వ్యవసాయ భూములలో టేకు చెట్లను ఎక్కువగా నాటి సాగు చేస్తున్నారు. ఇది దీర్ఘకాలికమైన ప్రయోజనం అయినప్పటికీ, ఎంతో శ్రద్ధతో వ్యక్తులు ఇంటి ఆవరణలలో, పాఠశాల ప్రదేశాలలో, ఎక్కడ బడితే అక్కడే టేకు చెట్లను నాటి పెంచుతున్నారు. ఒక్కో టేకు చెట్టుతో 60 -70 వేల రూపాయల విలువ కలిగిన దర్వాజ, తలుపులు తయారవుతాయి. ఇప్పుడు మనం టేకు చెట్ల వల్ల కలిగే ప్రయోజనాలు చదివి తెలుసుకున్నాం కదా బాలలూ..! భూమి ప్రమాద ఘంటికలు మోగిస్తుంది. ప్రకృతి విలపిస్తోంది. వెంటనే మనం కూడా మన పుట్టినరోజు సందర్భంగా ఒక్క టేకు మొక్కను నాటుదాం. పచ్చదనంతో పర్యావరణాన్ని కాపాడుదాం.

– కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి
m : 9441561655


HOPE
ఆశ
ఒక ఇంధనం...
విన్న కథకు అనుసృజన :
జుగాష్విలి
బొమ్మలు:
గోపి : తాతయ్యా! తాతయ్యా! మా ఫ్రెండ్ రవి నిన్న HOPE గురించి ఒక కథ చెప్పాడు. కథంటే పెద్ద కథేం కాదు. చాలా చిన్న కథ. ఎంత బావుందో... నువ్వు వింటావా.
తాతయ్య : ఎందుకు వినను! కథలంటే నాకు యిష్టమని తెలుసుగా!
గోపి : అనగనగా ఒక రాజు. తన సైన్యంలో యిద్దరు నమ్మిన బంట్లున్నారు.
తాతయ్య : సైన్యమంతా నమ్మినబంట్లుగానే వుంటారు కదరా గోపీ. అంత విశ్వాసం లేకపోతే రాజ్యాన్ని ఎలా రక్షిస్తారు?
గోపి : నిజమే. వందల, వేల సైన్యంలో రాజుకి నమ్మకస్తులుగా, సన్నిహితులుగా కొందరుంటారు. నీకు యింతమంది మనవళ్ళుండగా నా మీదే నీకింత ప్రేమ ఎందుకు? అలాగన్న మాట.
తాతయ్య : అహహ... కథ చెప్పు.
గోపి : ఒకసారి పక్క రాజ్యపు రాజు వస్తాడు. ఆ సందర్భంలో ఈ యిద్దరి వల్ల ఏదో తప్పు జరిగింది.
తాతయ్య : అలాగా... ఏం తప్పు చేసారు!
గోపి : కథలో ఆ తప్పు ఏమిటనే దానికి ప్రాధాన్యత లేదులే... రాజుకి మాత్రం చాలా కోపం వస్తుంది. వాళ్ళిద్దరికీ మరణ శిక్ష విధిస్తాడు.
తాతయ్య : అయ్యో!


గోపి : ఆ సైనికులు 'తామింత కాలం నమ్మకంతో పని చేసాం. ఈ తప్పు ఎలా జరిగిందో మాకూ తెలియదు. మమ్మల్ని క్షమించండి. ఇక ముందు ఎలాంటి తప్పు జరగదు' అని వేడుకున్నారు.
తాతయ్య : వీళ్లంటే ప్రేమ కదా! క్షమించాడా?
గోపి : లేదు. 'ఇది క్షమించరాని తప్పు. నా పరువు, ప్రతిష్టలు పోయాయి. మీకు మరణ శిక్ష తప్పదు. వెంటనే ఈ యిద్దరినీ ఉరి తీయండి' అని రాజు ఆజ్ఞాపించాడు. ఆ ఇద్దరిలో ఒక సైనికుడు తెలివైనవాడు. 'రాజా! నాదో చిన్న విన్నపం. ఒక్క సంవత్సరం నాకు అవకాశం యివ్వండి. మీ గుర్రాన్ని ఎగిరే గుర్రంగా మారుస్తాను. మీరు ఆ గుర్రమెక్కి ఆకాశంలో ఎగరడాన్ని ఊహించుకోండి, ఎంత అందంగా, ఆనందంగా వుంటుందో' అన్నాడు.
తాతయ్య : తెలివైనవాడే...
గోపి : రాజు రెక్కల గుర్రమెక్కి విహరించినట్లుగా, యుద్ధంలో చాకచక్యంతో గెలిచినట్లు ఊహించుకుని ఆనందంలో మునిగిపోయి 'అలాగే! ఈ సైనికుడికి సంవత్సరం అవకాశం యిద్దాం. ఈ రెండు సైనికున్ని వెంటనే ఉరి తీయండని ఆజ్ఞాపించాడు. వారిద్దరినీ కారాగారం వైపు తీసుకొస్తుండగా రెండో సైనికుడు 'నీకు మతిపోయిందా' సంవత్సరం గడువులో ఎగిరే గుర్రాన్ని ఎలా తయారు చేస్తావు. ఆ తర్వాత నీ పరిస్థితి ఊహించా' అన్నాడు.
గోపి : ఆ సైనికుడు చిరునవ్వుతో 'నేను అడిగింది గడువు కాదు. ఒక్క సంవత్సరం అవకాశం. సంవత్సరంలో ఏదైనా జరగొచ్చు. రాజు చనిపోవచ్చు. నా మరణశిక్ష ఆగిపోవచ్చు. ఒక వేళ నేను చనిపోవచ్చు. అప్పుడు అది మరణ శిక్ష కాదు. సహజ మరణమవుతుంది. గుర్రం చనిపోతే పేచీయే లేదు. ఒకవేళ నేను రెక్కల గుర్రాన్ని తయారు చేయొచ్చు. చూడు. ఎన్ని జరిగే అవకాశాలున్నాయో' అన్నాడు.
తాతయ్య : అదీ HOPE అంటే...
తాతయ్య : సృష్టిని నడిపించే ఇంధనం ఆశ. ఎలాంటి సందర్భంలోనైనా, ఎలాంటి పరిస్థితులలోనైనా ఆశను పోగొట్టుకోకూడదు. ఆశ మన చేత దేన్నైనా సాధించేందుకు ప్రయత్నాలు చేయిస్తుంది. గెలిచినా, ఓడినా ఆ ప్రయత్న సమయాన్ని ఒక మహత్తర అనుభవంగా, ఆనందంగా మారుస్తుంది. అదే ఈ కథ మనకు యిచ్చే HOPE.
గోపి : కథ గురించి చెప్పు తాతయ్య.



# ఫిఫా ప్రపంచ కప్ 2026
# ఫుట్‌బాల్ పండుగ

FIFA World Cup 2026 ప్రపంచంలోనే అత్యంత ప్రజాదరణ పొందిన క్రీడా టోర్నమెంట్. 2026 ప్రపంచ కప్ జూన్ 11 నుండి జూలై 19 వరకు నిర్వహించబడుతోంది. ఈసారి టోర్నమెంట్‌కు United States, Canada మరియు Mexico సంయుక్తంగా ఆతిథ్యం ఇస్తున్నాయి. ఫుట్‌బాల్ చరిత్రలో తొలిసారిగా 48 దేశాల జట్లు పాల్గొనడం ఈ టోర్నమెంట్ ప్రత్యేకత. ప్రపంచ కప్ పోటీలు మొత్తం 104 మ్యాచ్‌లతో జరుగుతున్నాయి. మొదటిగా జట్లను 12 గ్రూపులుగా విభజించారు. ప్రతి గ్రూపులో నాలుగు జట్లు ఉంటాయి. గ్రూప్ దశలో ప్రతి జట్టు మూడు మ్యాచ్‌లు ఆడుతుంది. గ్రూప్‌లో తొలి రెండు స్థానాలు సాధించిన జట్లు, అలాగే అత్యుత్తమ మూడో స్థానంలో నిలిచిన కొన్ని జట్లు నాకౌట్ దశకు అర్హత పొందుతాయి.

**టోర్నమెంట్ షెడ్యూల్ :** గ్రూప్ దశ: జూన్ 11 – జూన్ 27, 2026 ఈ దశలో అన్ని జట్లు తమ గ్రూప్ ప్రత్యర్థులతో పోటీపడతాయి.

**రౌండ్ ఆఫ్ 32: జూన్ 28 – జూలై 3 :** గ్రూప్ దశలో అర్హత సాధించిన 32 జట్లు ఈ దశలో తలపడతాయి.

**రౌండ్ ఆఫ్ 16: జూలై 4 – జూలై 7 :** ఉత్తమ 16 జట్లు క్వార్టర్ ఫైనల్స్‌కు చేరేందుకు పోటీపడతాయి.

**క్వార్టర్ ఫైనల్స్: జూలై 9 – జూలై 11 :** ఎనిమిది బలమైన జట్లు సెమీఫైనల్స్‌లో స్థానం కోసం పోరాడతాయి.

**సెమీఫైనల్స్: జూలై 14 – జూలై 15 :** ఫైనల్‌కు చేరే రెండు జట్లను నిర్ణయించే కీలక మ్యాచ్‌లు.

**ఫైనల్: జూలై 19, 2026 :** ప్రపంచ కప్ విజేతను నిర్ణయించే తుది పోరు.

ఈ టోర్నమెంట్‌లో బ్రెజిల్, అర్జెంటీనా, ఫ్రాన్స్, ఇంగ్లాండ్, జర్మనీ, స్పెయిన్, పోర్చుగల్, నెదర్లాండ్స్ వంటి ప్రముఖ జట్లు అభిమానుల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. కొత్తగా అర్హత సాధించిన దేశాలు కూడా తమ ప్రతిభను చాటుకునేందుకు సిద్ధమయ్యాయి.


ప్రపంచ కప్ మ్యాచ్‌లు అత్యాధునిక స్టేడియాల్లో నిర్వహించబడుతున్నాయి. లక్షలాది మంది ప్రేక్షకులు ప్రత్యక్షంగా వీక్షిస్తుండగా, కోట్లాది మంది టెలివిజన్ మరియు డిజిటల్ వేదికల ద్వారా మ్యాచ్‌లను ఆస్వాదిస్తున్నారు. వీడియో అసిస్టెంట్ రిఫరీ (VAR), గోల్ లైన్ టెక్నాలజీ వంటి ఆధునిక సాంకేతికతలు మ్యాచ్‌ల నిర్వహణలో కీలక పాత్ర పోషిస్తున్నాయి.

ఫుట్‌బాల్ అభిమానులకు ఫిఫా ప్రపంచ కప్ 2026 ఒక క్రీడా మహోత్సవం. ప్రపంచంలోని అత్యుత్తమ జట్లు, ప్రతిభావంతులైన ఆటగాళ్లు, ఉత్కంఠభరితమైన మ్యాచ్‌లు ఈ టోర్నమెంట్‌ను మరింత ప్రత్యేకంగా నిలబెడుతున్నాయి. క్రీడా స్ఫూర్తి, జాతీయ గౌరవం, ప్రపంచ ఐక్యతకు ప్రతీకగా ఈ ప్రపంచ కప్ చరిత్రలో చిరస్మరణీయంగా నిలిచిపోతుంది.

– బాలచెలిమి డెస్క్

కథ

# సరైన మార్గం



ఒక ఊరు ఉండేది. ఆ ఊరు పేరు రామగూడెం. ఆ ఊరిలో సాయి మరియు ప్రణయ్ అని ఇద్దరు స్నేహితులు ఉండేవారు. వారు ఇద్దరు చిన్నప్పటి నుండి స్నేహితులు. ఇద్దరు ఎప్పుడు కలిసిమెలిసి ఉండేవారు. ఇద్దరూ కూడా వ్యవసాయం చేయసాగారు. సాయి చాలా మంచివాడు. ఎప్పుడు ఎవరి చెడు కోరుకునేవాడు కాదు. తన భార్య మానసతో సంతోషంగా ఉన్న దానిలోనే సర్దుకొని జీవించేవాడు. ప్రణయ్‌కి కొద్దిగా అత్యాశ ఉండేది. ఏ పని చేయకపోయినా కూడా డబ్బు సంపాదించాలి అనే కోరిక తనని సోమరి పోతుగా మార్చింది. ప్రణయ్ భార్య వెన్నెల ఎంతో కష్టపడి కూలీ పనులకి వెళ్ళేది.

సాయి, ప్రణయ్‌లు ఇద్దరు కలిసి మామిడి తోట వెయ్యాలి అని ఎప్పటినుండో అనుకునేవారు. ప్రణయ్ పొలం ఖాళీగా ఉండటంతో ఇద్దరు కలిసి ప్రణయ్ పొలంలో తోట వేశారు. సాయి, ప్రణయ్‌తో "మనం ఇద్దరం పంట వేయగా మంచిగా పండించి, సరైన ధరకి అమ్మితే మంచి లాభం వస్తుంది. ఇద్దరి జీవితాలు ఎంతో కొంత మెరుగుపడతాయి. కొన్ని రోజులు కష్ట పడదాం" అంటూ మంచి మాటలతో పని చేసేలా చేశాడు. ఇద్దరు కూడా చాలా కష్టపడ్డారు. రోజూ పొలానికి వెళ్ళి అన్ని పనులూ చేసేవారు. ప్రణయ్ అంతగా పని చేయకపోయినా కూడా సాయి తనని ఏమనకుండా, తన పని కూడా తానే కల్పించుకొని చేసేవాడు.

పంట పండించడానికి ప్రణయ్ రసాయన ఎరువులను ఉపయోగించే వాడు. సాయి "రసాయన ఎరువులతో పంట దిగుబడి బాగా వచ్చిన, భూమి సారం తగ్గుతుంది. సహజ ఎరువులనే వాడుదాం" అని ఎంత చెప్పినా ప్రణయ్ వినలేదు. "మనకి డబ్బులు ఎక్కువ రావాలి, పంట ఎక్కువ పండాలి, దానికి ఈ రసాయన ఎరువులే అందరు ఉపయోగిస్తారు. మనం కూడా ఇవే వాడుదాం. అయినా ఇద్దరం కలిసి పంట వేస్తున్నాం కదా, నేను చెప్పిన మాటలు కూడా విను"అంటూ ప్రణయ్ సాయితో అన్నాడు. సాయి ఏం చేయలేక "నీ ఇష్టం" అని ఊరుకున్నాడు. అలా కొంత కాలం గడిచాక పంట కోత దశకి వచ్చింది. ఇద్దరు కూడా "ఇంకొన్ని రోజులే అంతే, కష్టానికి ఫలితం దక్కుతుంది" అనుకుంటూ ఆనంద పడ్డారు. కాని చివరి క్షణంలో సాయికి ఆరోగ్యం బాగాలేక మంచాన పడ్డాడు. దానితో ప్రణయ్ అన్ని పనులు నేనే చేస్తానని నిర్ణయించుకున్నాడు. రసాయన ఎరువులు వాడటం వల్ల మామిడి కాత అంతగా కాయలేదు. "ఎంత అయితే అంత లాభం" అనుకుంటూ ముందుకు సాగారు. పంట తెంపే సమయం రానే వచ్చింది. సాయి ప్రణయ్‌తో "పంట తెంపించు" అని చెప్పాడు. సాయి మరి మరి చెప్పాడు పంట తొందరగా అమ్మేసేయి అని. అయినా కూడా ప్రణయ్ సాయి మాటలను లెక్క చేయలేదు. ఆ

ఇంకా సమయం ఉందిగా అంటూ పంట వైపు వెళ్ళడమే మానేసాడు. ఒక రోజు అనుకోకుండా చాలా వర్షం కురిసింది. ఆ రోజంతా పిడుగు రాళ్లతో పెద్ద ఎత్తున వర్షం పడింది. సాయి ఇలా అవుతుందనే పంట అమ్మేసేయి అని చెప్పాడు. కానీ ప్రణయ్ వినలేదు. చివరికి మామిడికాయలు అన్ని గాలి వాన వల్ల నేలపాలై పోయాయి.

సాయి ప్రణయ్‌ని "నువ్వు చూసుకోవచ్చుగా, ఎందుకు ఇలా చేశావు. పండిన పంట చేతికి రాకుండా పోయింది. అంతా నీవల్లే" అంటూ కోప్పడ్డాడు. ప్రణయ్ పంట పోయిందన్న బాధలో మళ్ళీ సాయిని కోపగించాడు. ఇలా కోపగిస్తుండగా కొందరు ఊరు ప్రజలు అక్కడికి వచ్చారు. "ఏంటి అలా కోపగిస్తున్నాడు. ఇంట్లో వాడు మంచాన పడితే నువ్వేగా మొత్తం పని చేసావు. మళ్ళీ ఆ పొలం కూడా నీదే. నిన్ను ఎందుకు కోప్పడ్డాడు. నువ్వు ఏమనలేవా ఏంటి" అంటూ ఏవేవో మాట్లాడసాగారు.


ఈ సంఘటన తర్వాత సాయి మరియు ప్రణయ్‌ల మధ్య రోజు రోజుకి మాటలు కూడా దూరమయ్యాయి. ఒకరి దగ్గరికి ఒకరు వెళ్లడం తగ్గింది. అలా అలా రోజులు గడిచిపోయాయి. మళ్ళీ మరొక ఏడాది పంట చివరి దశలో ఉంది. ఈసారి సాయి ఒక్కడే తనకు నచ్చిన విధంగా సహజ ఎరువులు ఉపయోగిస్తూ పంట పండించాడు. సరైన సమయంలో మామిడికాయలు కోయడం జరిగింది.. మామిడి కాయలు, పండ్లు చాలా రుచిగా, ఆరోగ్యంగా ఉండడంతో లాభం కూడా ఎక్కువగా వచ్చింది. తను నమ్మిన విధానంలో పండించడంలో లాభం కూడా తను అనుకున్న దాని కంటే ఎక్కువగా వచ్చింది. పండించిన పంటలో వచ్చిన ఫలితం చూసి సాయి మరియు మానసలు చాలా ఆనందించారు.

సాయికి వచ్చిన డబ్బులో సగం తను ఉంచుకొని మిగతా సగం ప్రణయ్‌కి ఇవ్వడానికి వెళ్ళాడు. ప్రణయ్ సాయి ఉదారతకు ఏడ్చుకుంటూ 'నన్ను క్షమించు, తప్పు నాదే లేదంటే మనకి మొదటి ఏడాది కూడా లాభం వచ్చేది. నా వల్లే అంతా ఇలా అయ్యింది. నా భార్య నన్ను నిలదీసేవరకు నాకు అర్థం కాలేదు. ఇంకా ఎప్పుడు ఇలా చెయ్యను' అన్నాడు. సాయి ప్రణయ్‌ని దగ్గరకు తీసుకొని 'పర్లేదు, ఇప్పటికైనా కళ్ళు తెరిచావు. సంతోషం' అని చెప్పి నీ శ్రమకు తగ్గ ఫలితం అంటూ ఆ డబ్బులు ఇచ్చేసాడు. ప్రణయ్ సాయిని అపార్థం చేసుకున్నందుకు చాలా బాధ పడ్డాడు. తను కూడా సాయిలా మారి చేతనైనంత సహాయం చేస్తానని నిర్ణయించుకున్నాడు. మళ్ళీ ఇద్దరూ మునుపటి లాగా కలిసి ఉంటూ మామిడి తోట ద్వారా మరింత లాభాలు పొంది సుఖ సంతోషాలతో జీవించారు.

**నీతి : ప్రతి గాయం ఒక పాఠం - ప్రతి కష్టం ఒక మెట్టు.**


**- గీస శ్రీజ**
B. Tech 2nd year, ఆదిలాబాద్
m : 7893788908


## వేమన పద్యం



ఉప్పులేని కూర హీనంబురుచులకు
పప్పులేని తిండి ఫలము లేదు
యప్పులేని వాడె యధిక సంపన్నుండు
విశ్వదాభిరామ వినురవేమ!


తాత్పర్యం : ఉప్పులేని కూర రుచిగా ఉండదు.
పప్పులేని భోజనము బలవర్ధకము కాదు.
అప్పులేని వాడే ధనవంతుడు.

కథ



# బుజ్జి పిచుక

## మాక్సిం గోర్కి



అనగనగా ఒక బుజ్జి పిచుక ఉండేది. దాని పేరు పూడిక్.

దాని వెచ్చటి గూడు, స్నానాలగది కిటికిలో ఉంది. పూడిక్కి ఇంకా ఎగరటం రాదు. అది తన బుజ్జి రెక్కలను టప టపమని విదల్చగలదు. తన చిన్ని తలను గూడు బయటకి పెట్టి ప్రపంచాన్ని ఆసక్తిగా గమనిస్తుంటుంది. దానికి ఓపిక తక్కువ. అది గడుగ్గాయి.

"ట్వీట్, ట్వీట్, ఏం చేస్తున్నావ్?" తల్లి పిచుక పూడిక్ని అడిగింది.

"క్రింద చాలా చీకటిగా ఉందమ్మా" సమాధాన మిచ్చింది పూడిక్.

తండ్రి పిచుక కొన్ని పురుగులను ఆహారంగా తెచ్చింది. వాటిని తినేశాక పూడిక్, మళ్ళీ తల బయటపెట్టి చూసింది.

"జాగ్రత్త చిన్నారి పడిపోతావ్" తల్లి హెచ్చరించింది.

"నేను పడనుగా" అంది పూడిక్ గడుసుగా.

"క్రింద పిల్లి ఉంటే అది నీ పని పడుతుంది" తండ్రి పిచుక హెచ్చరించి, వేటకు వెళ్ళిపోయింది.

అలా కొన్ని రోజులు గడిచాయి. ఒకరోజు గట్టిగా గాలి వీచింది.

"ట్వీట్! ట్వీ.....ట్! ఏంటిది అమ్మా?" అడిగింది బుజ్జి పూడిక్.

"అది గాలి, ఎక్కువగా వీస్తే మన గూడు గాలికి ఎగిరి, క్రింద పడిపోతుంది. అప్పుడు నువ్వు పిల్లి నోట్లో పడతావు" అన్నది తల్లి పిచుక.

"అమ్మా! చెట్లను ఊగొద్దని చెప్పు, అప్పుడు గాలి ఆగిపోతుంది'' అంది పూడిక్. పూడిక్కి విషయం అర్థమయ్యేలా చెప్పటానికి అమ్మ ప్రయత్నించింది. కాని పూడిక్ నమ్మలేదు.

ఒక మనిషి స్నానాలగది నుండి నడిచి వెళ్తున్నాడు. పూడిక్ అతడిని చూసి ఇలా అంది.

"గండుపిల్లి ఆ మనిషి రెక్కలను తినేసినట్లుంది. కేవలం అతనికి ఎముకలే మిగిలాయి."

"అతడు మనిషి, మనుషులకు రెక్కలుండవు" అంది అమ్మ.

"ఎందుకు?" అడిగింది పూడిక్.

"మనుషులకు రెండు కాళ్ళు వుంటాయి. వాటితో నడుస్తారు"

"ఎందుకు?" రెట్టించి మళ్లీ అడిగింది బుజ్జి పూడిక్.

"ఎందుకంటే మనుషులకు రెక్కలుంటే, వాళ్ళు మనల్ని వేటాడుతారు. నేను, నాన్న పురుగుల్ని వేటాడినట్లు." అంది

అమ్మ.

"నేను నమ్మను, అందరికీ రెక్కలు ఉండే ఉంటాయి" అంది బుజ్జి పూడిక్ మొండిగా. అమ్మ మాటలు నమ్మకుంటే, ఇబ్బందుల్లో పడుతుంది అన్న విషయం పూడిక్కు తెలియదు. అది బుజ్జి పిచుక గదా!

పూడిక్ గూడు అంచులో కూర్చొని ఇలా పాట పాడింది..

"రెక్కల్లేని మనుషుల్లారా!
మీ కాళ్ళెందుకు పనికొస్తాయి?
మీరు పెద్దవాళ్ళు కావచ్చు,
పొడుగువాళ్ళు కావచ్చు,
కాని ఏం లాభం?
మీరు గాల్లోకి ఎగరలేరు
నన్ను చూడండి, చాలా బుజ్జిదాన్ని
కాని నేను ఎగరగలను.... పురుగులను తినగలను
నేనే గొప్ప... నేనే గొప్ప...!!

అలా పాడుతూ... పాడుతూ... అది గూడు నుండి జారి క్రింద పడింది. అది చూసి తల్లి పిచుక, దాన్ని వెంబడించింది. కానీ అప్పటికే పచ్చటి కళ్ళతో ఉన్న గండుపిల్లి, పూడిక్ వైపు గుర్రుగా చూసింది. పూడిక్ భయంతో గజగజ వణికింది. తన బుజ్జి రెక్కలను చాపి ఇలా అంది.

"మిమ్మల్ని చూడటం చాలా సంతోషంగా ఉంది, పిల్లి గారు!".

వెంటనే తల్లి, పూడిక్ని ప్రక్కకు నెట్టింది. ధైర్యంగా తన ముక్కును తెరిచి పిల్లి కళ్ళలోకి సూటిగా చూసింది. తన రెక్కలను విదిలించి, ముక్కుతో పొడుస్తూ తల్లి పిచుక, పిల్లితో భీకరంగా పోరాడింది.

కదలకుండా నిల్చున్న బుల్లి పిచుకను చూసి "పూడిక్! త్వరగా ఎగురు" అంది తల్లి.

భయంతో పూడిక్, ఒక్కసారిగా తన బుజ్జి రెక్కలను గాల్లో విదిలించి ఒక్క గెంతు గెంతింది. గాల్లోకి ఎగిరింది. క్షేమంగా గూటిని చేరింది. పిల్లితో పోరాటంలో తోకను పోగొట్టుకున్న తల్లి కూడా, గూడును చేరింది. బుజ్జి పూడిక్ తలపై తల్లి ముద్దుపెట్టుకుంది.

"అన్నీ ఒక్కరోజులో నేర్చుకోలేవు నా చిన్నారి పూడిక్" అంది తల్లి. క్రింద పిల్లి ఆహారం కోల్పోయిన బాధతో గూడు వంక చూస్తుంది. ఇదండీ బుజ్జి పిచుక పూడిక్ కథ! పిల్లలూ! పెద్దల మాట వినాలి మరి!

స్వేచ్ఛానువాదం : **అనిల్ బత్తుల**
m : 81792 73971

ఇంగ్లీష్ : ది లిటిల్ స్పారో
రచయిత : మాక్సిం గోర్కి
ఇంగ్లీష్ అనువాదం : రాబర్ట్ డాగ్లిష్

## సామెతలు

- అందానికి పెట్టిన సొమ్ము ఆపదకు అడ్డం వస్తుంది.
- ఆకలి అయినవాడు ధర చెడగొడతాడు.
- ఇంటి పేరు క్షీరసాగరం వారు, ఇంట్లో మజ్జిగ చుక్కకు గతి లేదు.
- ఉద్యోగికి ఒక ఊరని లేదు, ముష్టివానికి ఒక యిల్లని లేదు.
- ఎరువు సొమ్ము బరువు చేటు.
- ఒకటి పాటు, పది పది సాపాటు.
- కళ్లు మూయించవచ్చుగాని కలలు కనేటట్లు చేయగలమా?
- గంగలో మునిగినా కాకి హంస అవుతుందా?
- ఘటియ తీరుబాటు లేదు, దమ్మిడీ ఆదాయం లేదు.

– బాలచెలిమి డెస్క్

## ముఖచిత్రం గురించి...



పచ్చని ప్రకృతి ఒడిలో ఆప్యాయంగా నవ్వుకుంటున్న ఇద్దరు చిన్నారుల ఈ ముఖచిత్రం స్నేహం, ప్రేమ, అమాయకత్వానికి ప్రతీక. వర్ణ, భాషా భేదాలకు అతీతంగా పిల్లల ప్రపంచం ఆనందం, ఐక్యత, మానవత్వంతో నిండి ఉంటుందని ఇది తెలియజేస్తుంది. ప్రకృతితో మమేకమైన బాల్యం అందం, స్వేచ్ఛ, నిర్మలమైన జీవన విలువలను ఈ చిత్రం ప్రతిబింబిస్తోంది.

**పదాల మేడ సమాధానాలు (పేజి 16):**

**అడ్డం :** 1) వ్యాయామం 2) రసం 5) ప్రాంగణం 6) చెలిమి 7) యాత్ర 8) మనిషి 9) నలుపు తెలుపు 12) రారు

**నిలువు :** 1) వ్యాకరణం 3) మంచె 4) సంగతులు 7) రాత్రి 10) షికారు 11) మజిలి 12) రాలు

కథ

# చిట్టి గువ్వల కోసం ఆకాశ్ చేసిన అద్భుతం




పక్షుల ప్రాముఖ్యతను మరియు వాటిని మనం ఎలా కాపాడుకోవాలో వివరిస్తూ, రాసిన కథ.

నా పేరు ఆకాశ్. నాకు ఉదయాన్నే కిటికీ దగ్గర కూర్చుని పక్షుల కిలకిల రావాలు వినడం అంటే చాలా ఇష్టం. కానీ ఈ మధ్య మా వీధిలో ఆ శబ్దాలు తగ్గిపోయాయి. అంతా మోటార్ బైకుల చప్పుళ్లు, కారు హారన్లే వినిపిస్తున్నాయి. ఒకరోజు మధ్యాహ్నం ఎండ చాలా తీవ్రంగా ఉంది. నేను పెరట్లో ఆడుకుంటుంటే, ఒక చిన్న పిచ్చుక ఎగిరి వచ్చి నీరసంగా నేల మీద పడిపోయింది. దాని నోరు ఎండిపోయి, రెక్కలు వణుకుతున్నాయి. నేను కంగారుగా లోపలికి వెళ్లి గ్లాసుతో నీళ్లు తెచ్చి దాని నోటి దగ్గర పెట్టాను. ఆ పిచుక మెల్లగా నీళ్లు తాగి, కొంచెం సేపటికి తేరుకుని ఎగిరిపోయింది. అప్పుడు నాకు అర్థమైంది మనం పెద్ద పెద్ద బిల్డింగులు కట్టుకుంటున్నాము, చెట్లను నరికేస్తున్నాము. కానీ పాపం, పక్షులు ఎక్కడ నివసించాలి? వాటికి దాహం వేస్తే నీళ్లు ఎక్కడ దొరుకుతాయి? అనిపించి నా మనసు విలవిలలాడింది.

మరుసటి రోజు నేను మా స్నేహితులందరినీ పిలిచాను. "చూడండి, ఎండలు ఎక్కువయ్యాయి. మనలాగే పక్షులకు కూడా దాహం వేస్తుంది కదా! మనం వాటి కోసం ఏదైనా చేద్దాం" అన్నాను. మేము మా ఇంట్లో ఉన్న పాత మట్టి పాత్రలను, చిన్న చిన్న ప్లాస్టిక్ డబ్బాలను సేకరించాము. వాటిని శుభ్రం చేసి, మా ఇంటి డాబా పైన, బాల్కనీల్లో, పార్కులోని చెట్ల కింద పెట్టాము. ప్రతిరోజూ ఉదయాన్నే ఆ పాత్రల్లో స్వచ్ఛమైన నీటిని నింపడం మొదలుపెట్టాము. కేవలం నీళ్లే కాదు, ఇంట్లో మిగిలిన బియ్యం, జొన్నలు వంటి గింజలను కూడా ఒక పళ్ళెంలో పెట్టేవాళ్లం. మొదట ఒక్క పక్షి కూడా రాలేదు. కానీ మూడు రోజుల తర్వాత, అద్భుతం జరిగింది! ఒక కాకి వచ్చి నీళ్లు తాగి వెళ్ళింది. ఆ తర్వాత రెండు పిచ్చుకలు, ఒక రామచిలుక, మరికొన్ని పావురాలు రావడం మొదలుపెట్టాయి. ఆ పక్షులు నీళ్లలో స్నానం చేస్తూ, గింజలు తింటూ సందడి చేస్తుంటే చూడటానికి రెండు కళ్లు సరిపోలేదు.

మా ప్రయత్నం చూసి మా కాలనీలోని పెద్దలు కూడా ముచ్చటపడ్డారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటి ముందు పక్షుల కోసం నీళ్ల కుండీలు పెట్టడం మొదలుపెట్టారు. అంతకుముందు పక్షులను చూస్తే రాళ్లతో కొట్టే కొందరు పిల్లలు కూడా ఇప్పుడు వాటికి గింజలు వేస్తున్నారు. ఒకరోజు నేను పార్కులో కూర్చుని ఉండగా, ఆకాశంలో వందల కొద్దీ పక్షులు ఎగురుతూ కనిపించాయి. అవి మా ఊరి మీద వాలుతుంటే, మా ఊరు మళ్ళీ పాత రోజుల్లో లాగా పక్షుల కిలకిల రావాలతో కళకళలాడిపోయింది. పక్షులు ఉంటేనే కదా ప్రకృతి అందంగా ఉండేది! అవి లేకపోతే ఆకాశం ఎంత వెలితిగా ఉంటుందో కదా! అంతేకాదు, పక్షులు మనకు తెలియకుండానే ఎన్నో మంచి పనులు చేస్తాయి. అవి పండ్లు తిని విత్తనాలను వేరే చోట్ల వేయడం వల్ల కొత్త చెట్లు మొలుస్తాయి. పురుగులను తినడం ద్వారా పంటలను కాపాడతాయి.

మనం మన కోసం ఇళ్లు కట్టుకున్నాం, కానీ ప్రకృతిలో భాగమైన పక్షులకు మనం ఆశ్రయం ఇవ్వాలి. మన ఇంట్లో మిగిలిన కొంచెం నీరు, కొన్ని గింజలు ఒక పక్షి ప్రాణాన్ని కాపాడగలవు. పక్షులు ఆకాశంలో స్వేచ్ఛగా ఎగురుతుంటేనే మనకు నిజమైన సంతోషం.

**నీతి:** నోరు లేని జీవులపై జాలి చూపడం మనిషి కనీస ధర్మం. పక్షులను రక్షిద్దాం - ప్రకృతిని కాపాడుకుందాం.

– అల్లం లాస్య
9వ తరగతి
గైడ్ టీచర్: బొడ్డు భరద్వాజ, ఎస్.ఎ.–తెలుగు,
అంబం, ఎడపల్లి, నిజామాబాద్. m : 9440888870

# శివాజీ ఔదార్యం




ఛత్రపతి శివాజీ హిందూ సామ్రాజ్య నిర్మాణం కోసం యుద్ధాలు చేశాడు. మొగలాయిలతో, బీజపూరు సుల్తానులతో పోరాడాడు. మాతృభూమి స్వాతంత్ర్యం కోసం శ్రమించాడు. తన పాలనలోనే కాక విదేశీ రాజుల ఏలుబడిలోని హిందువుల కష్ట సుఖాలు కూడా తీర్చేవాడు. మారువేషంలో వెళ్ళి తెలుసుకుంటు ఉండేవాడు.

ఒకసారి శివాజీ తన మంత్రితో కలసి మారువేషంలో ఒరిస్సాకు వెళ్ళాడు. అది చలికాలం. శివాజీ జ్వరంతో ఉన్నాడు. ఆ రోజు తలదాచుకోవడానికి ఒక శివాలయం చేరాడు. ఆ ఆలయం పూజారి తన కుమారుడి జబ్బుకి మందు లేదని దేవుడికి మొరపెట్టు కుంటున్నాడు. ఏడుస్తున్నాడు. శివాజీ, మంత్రి మాట్లాడుకునే మాటల వల్ల వారెవరో పూజారికి తెలిసి పోయింది.

శివాజీని పట్టి ఇచ్చిన వారికి వేయి దీనారాలు అప్పటికే పాలకులు ప్రకటించి ఉన్నారు. 'శివాజీని పట్టి ఇచ్చి కొడుకు ప్రాణాలు కాపాడుకుందాం' అనుకున్నాడు పూజారి. వెంటనే ఇంటికి వెళ్ళాడు. ఈ విషయం ఇంట్లో చెప్పాడు. సుబేదారుకు ఫిర్యాదు చేయడానికి వెళ్ళాడు పూజారి. ఆ ఇంటి కోడలు ఆ విషయం విన్నది. ఆలయం వైపు పరుగు తీసింది. ఆలయ పూజారి ఆలోచనను శివాజీ చెవిన వేసింది. అక్కడి నుంచి తప్పించుకోమని వేడుకుంది. తిరిగి వచ్చేసింది. సుబేదారును వెంట బెట్టుకు వచ్చిన పూజారికి నిరాశ మిగిలింది. శివాజీ దొరకలేదు. సుబేదారు భటులు అబద్ధం చెప్పాడని పూజారిని చితక బాది వెళ్ళారు. తనకు మరణం తప్ప మరో దారి లేదని పూజారి శివలింగానికి తల 'బాదుకున్నాడు. అప్పుడతనికి శివలింగం మీద ఉన్న శివాజీ నగలు కనిపించాయి.

తాను విదేశీ పాలకులకు శివాజీని పట్టి ఇద్దామని అనుకున్నాడు. కాని శివాజీ తన కొడుకు ప్రాణాలు కాపాడటానికి నగలు అక్కడ వదిలి వెళ్ళాడు. పశ్చాత్తాపంతో పూజారి ఇంటికి చేరాడు. ఇంటి కోడలు మాత్రం తన భర్త ప్రాణాలు ఫణంగా పెట్టి అయినా శివాజీని కాపాడాలని, అనుకుంది. ఇందులో శివాజీ ఔదార్యం, గొప్పదనం వెల్లడయ్యాయి.





మహానుభావుల గొప్పదనం
వారి పరాక్రమంలోనే కాదు,
వారి కరుణ, క్షమ,
ఔదార్యాలలోను ప్రతిఫలిస్తుంది.

– 'బాల కథా సౌరభం' నుండి...

చరిత్ర పాఠాలు-17


# అమ్రాబాద్ అడవుల నుంచి ఎదిగిన విష్ణుకుండులు


శాతవాహనుల తరువాత దక్కను ప్రాంతాన్ని పాలించిన రెండో గొప్ప వంశం విష్ణుకుండులది. క్రీ. శ. 4 నుంచి 6 శతాబ్దాల మధ్య కృష్ణా నది నుంచి నర్మదా నది వరకు విశాల భూభాగాన్ని పరిపాలించిన వీరి జన్మభూమి గుంటూరు జిల్లాలోని వినుకొండ అని పలువురు చరిత్రకారులు వాదించారు. కానీ నాగర్కర్నూల్ జిల్లాలోని అమ్రాబాదు మండలంలో ఉన్న మునులూరు (నేటి మన్ననూరు) ప్రాంతంలో ఉన్న పలు ఆధారాలను బట్టి విష్ణుకుండులు ఈ ప్రాంతం నుంచే ఎదిగారని చెప్పవచ్చు. ఇక్కడి కోట ప్రాంతం నుంచి ఎదిగిన విష్ణుకుండులు తమ (కొత్త) రాజధాని మామిడి వనం మధ్య ఉండడంతో మామిడిపురం అని, దానినే సంస్కృతంలో అమరపురం అని ఉంటారు. ఈ ప్రాంతంలో 'మామిడి' పేరుతో చేను, చెలుక, ఊర్లు కూడా ఉన్నాయి. అమ్రాబాదు దగ్గర్లోనే 'మొలకమామిడి' అనే ఊరు ఇప్పటికీ ఉంది. మరికొన్ని గ్రామాల ఆవల మామిళ్ళపల్లి అనే క్షేత్ర గ్రామం ఉంది. మన్ననూరుకు దగ్గరలోని ప్రసిద్ధ ఉమామహేశ్వర క్షేత్ర ప్రాంతం మామిడిచెట్ల వనాలకు, ప్రత్యేకించి తుమ్మెద మామిడిచెట్లకు పేరుగాంచింది. నాలుగు దశాబ్దాల క్రితం వరకు కూడా ఉమామహేశ్వరంలో తుమ్మెద మామిడిచెట్టు ఉండేది. ఆ చెట్టు కిందనే ఇప్పటి ఆలయం ఉండేది. ఆ చెట్టు మామిడి కాయలను పగులగొడితే వాటిలో నుంచి తుమ్మెదలు వచ్చేవి. వాటిని చూసినవారిని ఆ క్షేత్రంలోనే 1995 లో ఈ పుస్తక రచయిత కలిసి మాట్లాడి ఆశ్చర్యపోయారు కూడా. సంస్కృతంలో మామిడిని ఆమ్రం అని, తుమ్మెదను 'భ్రమరం' అని అంటారు. అలా తుమ్మెద మామిడి భ్రమరామ్రం అవుతుంది. ఈ పదం చరిత్ర 14వ శతాబ్దాంభం నాటి నిత్యానాథ సిద్ధుని 'రసరత్నాకరం'లో కూడా ఉంది. భ్రమరామ్రం కాస్తా భ్రమరాంబై శ్రీశైలంలోని మల్లికార్జున స్వామికి భార్య అయింది. శ్రీశైలం స్థల పురాణం ప్రకారం మల్లికార్జున అంటే సంస్కృతంలో మల్లెపూలతో పూజింపబడిన మద్ది (అర్జున) చెట్టు అని అర్థం. ఇప్పటికి శ్రీశైలంలో గర్భగుడికి ఉత్తర దిశలో మద్ది కాండంతో చేసి నిలిపిన వృద్ధ మల్లికార్జున లింగాన్ని చూడవచ్చు. మొత్తం మీద చెప్పేదేమంటే, విష్ణుకుండులు సంస్కృతీకరణలో భాగంగా తమ ప్రాంతపు (పేరు) మామిడివనాన్ని ఆమ్రపురంగా, అమరపురంగా మార్చారు అని. విష్ణుకుండులు తమను తాము అమరపురీశులము అని తమ శాసనాలలో చెప్పుకోవడం గమనార్హం.

విష్ణుకుండులు వైదిక మతాన్ని అవలంబించారు కాబట్టి, వేదాల్లో ఇంద్రుడు ప్రధాన దైవం కాబట్టి, అతని (పురం) పేరున అమరపురం అని, అతని మరో పేరున శక్రపురమని, తరువాత తమ మరో రాజధాని పేరును ఇంద్రపాలనగరం అని సంస్కృత పేర్లు పెట్టుకొన్నారు. విష్ణుకుండులు యజ్ఞాలను నిర్వహించారు. బ్రాహ్మణులకు అగ్రహారాలను దానం చేశారు, బావులు, చెరువులు తవ్వించారని వారి శాసనాల్లో రాసి ఉంది. వీటిని నిర్ధారించే పలు భౌతిక ఆధారాలు మన్ననూరు, అమ్రాబాదు ప్రాంతాల్లో కనిపిస్తాయి. మన్ననూరు దగ్గర్లోని ప్రతాపరుద్రకోటలో ఉన్న ఒక ప్రాచీనాలయం పక్కన ఒక చతుర్భుజాకారపు బావి వంటి స్నానవాటిక ఉంది. అది విష్ణుకుండుల యజ్ఞ అవబృథ స్నానవాటిక అయ్యుండవచ్చు. దానినానుకొనే ఒక పెద్ద దిగుడు బావి, కోట కింద పడమటి దిక్కున ఉన్న రెండు ఆలయాలకు దగ్గర్లో మరో బావి ఉంది దానిని ఇరువయిదేండ్ల క్రితం మరమత్తు చేశారు). ఈ బావులనూ విష్ణుకుండులే తవ్వించి ఉండవచ్చు. ప్రతాపరుద్ర కోట కింద ఉత్తర దిశలో ఉన్న బ్రాహ్మణపల్లి అనే ఊరును విష్ణుకుండులు బ్రాహ్మణులకు అగ్రహారంగా ఇచ్చి ఉంటారు. ఆ ఊరి బ్రాహ్మణులే విష్ణుకుండుల చేత వేల యజ్ఞాలు చేయించి ఉంటారు.

విష్ణుకుండి వంశపు తొలి రాజుల్లో ఒకరైన గోవిందరాజు తన రాణి పరమభట్టారిక దేవి కోసం శక్రపురం (ఇంద్రపాలనగరం)లో నిర్మించిన పరమభట్టారిక మహాదేవి విహారానికి ప్రేణ్కపర, ఎన్మదల గ్రామాలను దానం చేసినట్లు శాసనాల్లో ఉంది. ఎన్మదల గ్రామం పేరు కొద్దిగా మారి ఎల్మల పేరుతో ఇప్పటికీ అమ్రాబాదు మండలంలో ఉంది. అయితే ఇంచుమించు అలాంటి పేరుతో ఉన్న గ్రామం మరొకటి నల్గొండ జిల్లాలో ఉంది అని బి.ఎన్. శాస్త్రి రాశారు. ఇక ప్రతాపరుద్రకోట పైన, దాని చుట్టుపక్కల ఎన్నో ప్రాచీన చెరువులున్నాయి. వీటిల్లో కొన్నింటినైనా విష్ణుకుండులే తవ్వించి ఉంటారు. అమరపురంలో భూతగ్రాహకస్వామి (యముడు) ఆలయం ఉన్నట్లు, విష్ణుకుండి మాధవవర్మ దంతముఖస్వామి (గణపతి) విగ్రహ ప్రతిష్ఠ చేసినట్లు కూడా వారి శాసనాలు తెలుపుతున్నాయి. అమ్రాబాదులో బృహత్ శిలా యుగానికి చెందిన అనేక తెలిపారు. వాటిని ఇప్పటికీ ఆ ఊరి నైరుతి దిశలోను, తూర్పు దిక్కున చూడవచ్చు. సమాధులున్నట్లు ప్రముఖ చరిత్రకారులు వి.వి. కృష్ణశాస్త్రి, ఠాకూర్ రాజారాం సింగ్ ఇలా వందల సంఖ్యలో సమాధులున్నాయి కాబట్టి సమాధుల (మరణం) అధిపతి యముడికి ఆ ఊరిలో ఆలయాన్ని కట్టారు. ఇక నాలుగు అడుగుల ఎత్తుగల నల్లని గణపతి విగ్రహాన్ని ఈ రోజు కూడా అమ్రాబాదు ఊరవతల (తూర్పున) చూడవచ్చు. తొలి తరం గణపతి విగ్రహాలకు కిరీటం ఉండేది కాదు. అమ్రాబాదు గణపతి విగ్రహానికి కూడా కిరీటం లేదు. కాబట్టి ఇది విష్ణుకుండులు ప్రతిష్ఠించిందేనవచ్చు. విగ్రహం పక్కనే 'వెంకయ్య బావి' ఉంది. ఈ గణపతికి తర్వాతి శతాబ్దాల్లో కూడా పూజలు జరిగాయని శాసనాలు చెప్తున్నాయి. కాబట్టి, భక్తుల సౌకర్యార్థం ఆ బావిని కూడా తమ శాసనాల్లో చెప్పుకున్నట్లు విష్ణుకుండులే తవ్వించారేమో. అమ్రాబాదుకు సమీపంలోని మాధవానిపల్లె, మంచాల అనే గ్రామాలున్నాయి. ఇవి కూడా విష్ణుకుండి రాజులు మాధవవర్మ, మంచణల పేర్ల మీద ఏర్పడినట్లు తోస్తుంది. కారణం, ఆ ఊళ్లల్లో వారి కాలపు శిథిలాలు కన్పిస్తుండటం. మొత్తం మీద చెప్పేదేమిటంటే, పురాతత్వ, శాసన, సాహిత్యాధారాలు తెలియచేస్తున్న కుండాలు (సుమారు 50) నగర్కర్నూల్ జిల్లాలోని మన్ననూరు-అమ్రాబాదు ప్రాంతాల్లో కన్పిస్తున్నాయి కాబట్టి, విష్ణుకుండులు వాటిల్లో ఏదో ఒక కుండం దగ్గర నుంచి నల్లమల అడవుల నుంచే ఎదిగారని నిర్ధారించవచ్చు.

- డా. ద్యావనపల్లి సత్యనారాయణ
m : 9490957078




# కలంచెలిమి



**పి. సాహిత్**
10వ తరగతి, జెడ్.పి.హెచ్.ఎస్,
తిరుమలపూర్, కొడిమ్యాల,
జగిత్యాల జిల్లా,



**జి. భవిష్య**
10వ తరగతి,
జెడ్.పి.హెచ్.ఎస్
అర్జునపట్ల



**గోపి సాయి రిత్విక్**
9వ తరగతి, జడ్.పి.హెచ్.ఎస్,
కేశవపట్నం, శంకరపట్నం



**జె. రిత్విక్**
8వ తరగతి, జెడ్.పి.హెచ్.ఎస్
కడవేరు, సిద్ధిపేట



**జె. శ్యామల**
8వ తరగతి, జడ్.పి.హెచ్.ఎస్,
ఎడపల్లి, నిజామాబాద్.



**చైతన్య**
10వ తరగతి, జడ్.పి.హెచ్.ఎస్,
ఇంద్రవెల్లి, ఆదిలాబాద్.

కథ

# కోతి సలహా




అరణ్యపురి అనే అడవిలో నివసించే ఓ అడవిపందికి జీవితం మీద విరక్తి కలిగింది. అడవిలో తమ జాతి మొత్తం అంతరించిపోయిందనినిరాశలో మునిగిపోయింది. అడవిలో తాను ఒక్కడినే అనే భావనతో తీవ్రమైన ఒంటరితనానికి లోనయ్యింది. అంతే కాకుండా ఇతరజాతి జంతువులు ఏవీ కూడా తనతో కలవడం లేదని, మాట్లాడటం లేదని మానసిక సంఘర్షణకు లోనయ్యింది అడవిపంది.

ఒక రోజు బురదగుంటలో కాసేపు సేద దేరి, ఒంటి నిండా బురద అంటించుకుని, తన బాధలు చెప్పుకోవడానికి కోతి దగ్గరకు వెళ్ళింది. చెట్టు మీద ఉన్న కోతి పందిని చూసి, ముక్కు మూసుకుని కిందికి దిగింది. అప్పుడు అడవిపంది, "మిత్రమా... నాకు ఈ అడవిలో ఉండాలని అనిపించడం లేదు. నేను ఇక్కడ ఒంటరి నయ్యాను. చనిపోవాలని నిర్ణయించుకున్నాను. చనిపోవడానికి ఏదైనా మార్గం చెప్పవా?" అని అడిగింది. అందుకు కోతి, "అలాగా.. చనిపోవాలని ఎందుకు అనిపించింది" అన్నది.

"ఈ అడవిలో ఎవరూ నాతో మాట్లాడటం లేదు. నాతో ఎవరూ స్నేహం చేయడం లేదు. కారణం ఏమిటో నాకు తెలియదు" అన్నది అడవిపంది దిగాలుగా.

"అవునా... అయితే నీవు చనిపోవడం సరైన నిర్ణయమే. ఇక్కడి నుండి కొంతదూరంలో ఒక చెరువు ఉంది. అక్కడికి వెళ్ళి చెరువులో దూకు. నీ కోరిక తీరుతుంది.." అంటూ సమాధాన మిచ్చింది కోతి.

కోతి మాటలతో బాధపడింది. పైగా తనను చూసి ముక్కు మూసుకుని దూరంగా ఉండటంతో అడవిపందికి ఇంకా ఎక్కువ ఇబ్బంది కలిగించింది. కంట్లో నీళ్ళు వస్తుండగా చెరువు వైపు పరుగులు తీసింది. అనుకున్నంత పని చేసింది అడవిపంది. చెరువులో దూకగానే ధైర్యం సన్నగిల్లింది. ప్రాణంమీద తీపి పుట్టుకొచ్చింది. "రక్షించండి... రక్షించండి.." అంటూ ఆర్తనాదాలు చేయడం మొదలుపెట్టింది.

అడవిలోని జంతువులన్నీ అడవిపంది అరుపులు విని పరుగెత్తుకుంటూ వచ్చాయి. ఒక ఏనుగు తన తొండంతో అవలీలగా అడవిపందిని చెరువులోనుండి బయటకు లాగింది. ప్రాణాలతో బయటపడ్డది అడవిపంది. కానీ నీళ్లు బాగా తాగడంతో ఊపిరి కష్టమైంది దానికి. తాగిన నీళ్లు బయటకు పోయేలా కొన్ని కోతులు ఛాతీని బలంగా వత్తాయి. ఎలుగుబంటి విసనకర్రతో గాలి ఊపడం చేసింది. కొంతసేపటికి కళ్ళు తెరిచింది అడవిపంది. జంతువులన్నీ సంతోషంతో చప్పట్లు కొట్టాయి. తనకోసం అడవి అంతా కదలిరావడం పట్ల ఒకింత ఆశ్చర్యానికి, ఆనందానికి లోనయ్యింది అడవిపంది.

చనిపోమ్మని సలహా ఇచ్చిన కోతి అడవిపంది దగ్గరకు వచ్చి ఇలా అంది. "నా సలహా నీకు కోపం తెప్పించి ఉండొచ్చు. కానీ నువ్వు ఆపదలో ఉంటే అడవి అంతా ఎలా ఏకమవుతుందో తెలియజేయడానికి అలా చెప్పాను. నిన్ను నువ్వు తక్కువ అంచనా వేసుకుని ఆత్మన్యూనతా భావంతో బాధ పడుతున్నావని అర్థం అయ్యింది. అంతే కాదు.. నువ్వు నిత్యం మట్టిలో పొర్లుతూ, బురదలో తిరుగుతూ ఉంటావు కదా! శుభ్రత పాటించని నిన్ను చూసి మన మిత్రులు నిన్ను దూరంగా పెట్టింది వాస్తవమే కానీ నీ మీద ప్రేమ లేక కాదు. నీళ్లలో నుండి బయటపడ్డ తర్వాత.. ఇప్పుడు చూడు, ఎంత శుభ్రంగా ఉన్నావో! నీలో ఇంతకుముందు లేని హుందాతనం వచ్చింది తెలుసా..! అంటూ కోతి నవ్వింది. ఇంకా ఇలా చెప్పింది," మాటలతో చెప్పినా కూడా నీ మనసును సంతృప్తి పర్చలేనని అర్థమైంది.అందుకే ఇలాంటి సలహా ఇవ్వాల్సి వచ్చింది. నువ్వు చెరువులో దూకుతున్నావని మన మిత్రులందరికీ ముందే సమాచారం ఇచ్చి, అందరినీ ఇక్కడికి రప్పించాను. నా మాటలు నిన్ను బాధ పెట్టి ఉంటే నన్ను క్షమించు మిత్రమా.." అని అన్నది కోతి.

కోతిపై అడవికిపందికి ఉన్న కోపం కూడా ఎగిరిపోయింది. ఇక మారాల్సింది తానేనని నిర్ణయించుకుంది. ఇక ఆ రోజు నుండి మనసులోనున్న కల్మషాన్ని తీసేసి అన్ని జంతువులతో కలివిడిగా నవ్వుతూ తిరుగుతూ సంతోషకరమైన జీవనాన్ని గడిపింది అడవిపంది. అలాగే అవసరం కోసం మట్టిలో వెళ్ళినా, బురదలో పొర్లినా వెంటనే స్నానం చేయడం కూడా అలవాటు చేసుకుంది.

– వడ్డేపల్లి వెంకటేశ్
m : 99895 96554

# వరుస మూడు సంఖ్యలు

1. ప్రేక్షకులను ఏవైనా వరుసగా వున్న 3 సంఖ్యలు రాసుకోమనాలి.
2. వాటిని కూడి ఆ మొత్తము ను చెప్పమనాలి.
3. అది విని వారు కోరుకున్న వరుస మూడు సంఖ్యలు చెప్పాలి.

ఉదా: 423+424+425=1272

1272 అనగానే 423, 424, 425 అని చెప్పాలి.

**రహస్యం:** చెప్పిన జవాబును 3తో భాగించాలి. వచ్చిన భాగఫలం మధ్య సంఖ్య అవుతుంది. దానికి ముందు, వెనుక సంఖ్యలను చెప్పాలి. ఈ విధంగా

వరుస ఐదు, ఏడు..... ఏవైనా బేసి వరుసలు వేసుకొని వాటి మొత్తాన్ని రాసుల సంఖ్యతో భాగించగా మధ్య సంఖ్య వస్తుంది. దానికి ముందు తర్వాత సంఖ్యలు చెపితే సరిపోతుంది.

## BEAUTY NUMBER

0 x 9 + 8 = 8

9 x 9 + 7 = 88

98 x 9 + 6 = 888

987 x 9 + 5 = 8888

9876 x 9 + 4 = 88888

98765 x 9 + 3 = 888888

987654 x 9 + 2 = 8888888

9876543 x 9 +1 = 88888888

98765432 x 9 + 0 = 888888888

– అంకెల మామయ్య చంద్రయ్య

m: 9440926937



## చెలిమి క్లబ్

చెలిమిక్లబ్‌లో సభ్యత్వం తీసుకోండి లాభాలు పొందండి.

1. చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ ప్రచురించే పుస్తకాలపై ప్రత్యేక తగ్గింపు.
2. మీ ప్రతి పుట్టిన రోజుకు అభినందనలతో అందమైన గ్రీటింగ్ కార్డు.
3. మీలో ఉన్న టాలెంట్‌ను అభివృద్ధి చేసుకోవడానికి క్లబ్ నిర్మాణాత్మక సహకారం అందిస్తుంది.
4. మీ స్కూల్లో, ఊర్లో పిల్లల కార్యక్రమాల వార్తలను చెలిమి సమాచార పత్రికకు పంపడానికి మీరు విలేఖరిగా ఉండవచ్చు.
5. అందమైన మెంబర్‌షిప్ బ్యాడ్జి.
6. మిమ్మల్ని ఆశ్చర్యపరచే బహుమతులు.

**చెలిమి క్లబ్**

పేరు : ----------------

తండ్రి పేరు : ----------------

పుట్టినతేదీ : ----------------

చిరునామా : ----------------

-------------------

-------------------

పిన్ : ----------------


హాబీలు : ----------------

మొబైల్ : ----------------

ఇ-మెయిల్ : ----------------

ఈ వివరాలతో మెయిల్ చేయండి.

బాల చెలిమి ఇ-మెయిల్ :
desk. chelimi@gmail. com






ఇరవై ఒకటవ శతాబ్దంలో మానవ నాగరికతను ప్రభావితం చేస్తున్న అత్యంత శక్తివంతమైన సాంకేతిక పరిణామాలలో కృత్రిమ మేధస్సు (Artificial Intelligence - AI) ఒకటి. మానవ మేధస్సును అనుకరించే సామర్థ్యంతో అభివృద్ధి చేయబడిన ఈ సాంకేతికత, సమాచార విశ్లేషణ, నిర్ణయాల రూపకల్పన, సమస్యల పరిష్కారం, భాషా ప్రాసెసింగ్ మరియు సృజనాత్మక కార్యకలాపాల వంటి అనేక రంగాలలో విప్లవాత్మక మార్పులకు దారితీస్తోంది. విద్య, వైద్యం, వ్యవసాయం, పారిశ్రామిక ఉత్పత్తి, రవాణా, ఆర్థిక సేవలు, మీడియా మరియు పరిశోధన వంటి విభిన్న రంగాలలో AI ప్రభావం రోజురోజుకు విస్తరిస్తున్న నేపథ్యంలో "ఓపెన్-సోర్స్ AI" ప్రపంచ సాంకేతిక వేదికపై అవతరించింది.

ఓపెన్-సోర్స్ AI అనేది కృత్రిమ మేధస్సు అభివృద్ధికి సంబంధించిన మోడల్ నిర్మాణాలు, శిక్షణా విధానాలు, ప్రోగ్రామింగ్ కోడ్, పరిశోధనా పత్రాలు, డేటా ప్రాసెసింగ్ పద్ధతులు మరియు కొన్నిసార్లు మోడల్ వెయిట్స్‌ను కూడా ప్రజలకు అందుబాటులో ఉంచే విధానం. ఈ విధానం ద్వారా ప్రపంచవ్యాప్తంగా ఉన్న పరిశోధకులు, డెవలపర్లు, విద్యార్థులు, స్టార్టప్ సంస్థలు మరియు సాంకేతిక నిపుణులు AI వ్యవస్థలను అధ్యయనం చేయడం, సవరించడం, అభివృద్ధి చేయడం మరియు స్థానిక అవసరాలకు అనుగుణంగా అన్వయించుకోవడం సాధ్యమవుతోంది. సాంకేతిక పరిజ్ఞానాన్ని కొద్ది సంస్థల ఆధిపత్యం నుంచి బయటకు తీసుకువచ్చి, విస్తృత సమాజానికి అందుబాటులోకి తీసుకురావడమే ఓపెన్-సోర్స్ AI యొక్క ప్రధాన లక్ష్యం.

ఓపెన్-సోర్స్ AI భావనకు పునాదులు 1950లలో ప్రారంభమైన కృత్రిమ మేధస్సు పరిశోధనలలోనే కనిపిస్తాయి. 1956లో అమెరికాలో జరిగిన చారిత్రాత్మక డార్ట్‌మౌత్ కాన్ఫరెన్స్‌లో "ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్" అనే పదం అధికారికంగా పరిచయం చేయబడింది. అప్పటి నుంచి శాస్త్రవేత్తలు, పరిశోధకులు తమ ఆవిష్కరణలు, అల్గోరిథమ్‌లు, పరిశోధన ఫలితాలను పరస్పరం పంచుకుంటూ జ్ఞాన వికాసానికి తోడ్పడ్డారు. విశ్వవిద్యాలయాలు, పరిశోధనా సంస్థలు మరియు శాస్త్రీయ వేదికలు జ్ఞానాన్ని అందరికీ అందుబాటులో ఉంచే సంప్రదాయాన్ని పెంపొందించాయి. జ్ఞాన భాగస్వామ్యం, పారదర్శకత మరియు సహకార పరిశోధనలపై ఆధారపడిన ఈ దృక్పథమే తరువాత కాలంలో ఓపెన్-సోర్స్ ఉద్యమానికి పునాదిగా నిలిచి, ఆధునిక ఓపెన్-సోర్స్ AI అభివృద్ధికి మార్గదర్శకంగా మారింది.

1980లలో ప్రారంభమైన ఓపెన్-సోర్స్ సాఫ్ట్‌వేర్ ఉద్యమం AI అభివృద్ధికి బలమైన మౌలిక వసతులను అందించింది. ఫ్రీ సాఫ్ట్‌వేర్ ఫౌండేషన్, లినక్స్ ఫౌండేషన్ వంటి సంస్థలు సాఫ్ట్‌వేర్ స్వేచ్ఛను ప్రోత్సహించగా, లినక్స్ ఆపరేటింగ్ సిస్టమ్, పైథాన్ ప్రోగ్రామింగ్ భాష మరియు అనేక ఓపెన్ లైబ్రరీలు ప్రపంచవ్యాప్తంగా సాంకేతిక ఆవిష్కరణలకు బాటలు వేశాయి.

2010 తర్వాత డీప్ లెర్నింగ్ యుగం ప్రారంభమవడంతో AI రంగంలో అపూర్వమైన పురోగతి నమోదైంది. భారీ డేటా నిల్వలు, శక్తివంతమైన GPUలు, న్యూరల్ నెట్‌వర్క్‌ల అభివృద్ధి AI సామర్థ్యాలను మరింత విస్తరించాయి. ఈ నేపథ్యంలో

2015లో Google విడుదల చేసిన TensorFlow, 2016లో Meta విడుదల చేసిన PyTorch వంటి ఓపెన్-సోర్స్ ఫ్రేమ్‌వర్క్‌లు ప్రపంచవ్యాప్తంగా పరిశోధకులకు మరియు డెవలపర్లకు శక్తివంతమైన వేదికలుగా మారాయి.

2022లో Stable Diffusion, 2023లో Llama మరియు Mistral వంటి ఓపెన్-సోర్స్ జనరేటివ్ AI నమూనాలు AI ప్రపంచంలో కొత్త అధ్యాయాన్ని ప్రారంభించాయి. ఈ మోడళ్లు అత్యాధునిక కృత్రిమ మేధస్సు సాంకేతికతను పెద్ద సంస్థలకే పరిమితం కాకుండా సాధారణ వినియోగదారులు, విద్యార్థులు, పరిశోధకులు మరియు స్టార్టప్‌లకు కూడా అందుబాటులోకి తీసుకువచ్చాయి.

ఓపెన్-సోర్స్ AI యొక్క ప్రధాన బలం దాని పారదర్శకత, సహకార స్వభావం మరియు విస్తృత అందుబాటు. ప్రపంచవ్యాప్తంగా వేలాది మంది డెవలపర్లు ఒకే వేదికపై కలిసి పనిచేయడం వల్ల ఆవిష్కరణలు వేగవంతమవుతున్నాయి. విద్యాసంస్థలు, పరిశోధనా కేంద్రాలు మరియు చిన్న సంస్థలు తక్కువ వ్యయంతో అత్యాధునిక AI సాంకేతికతను వినియోగించగలుగుతున్నాయి. అంతేకాకుండా స్థానిక భాషలు, ప్రాంతీయ అవసరాలు మరియు ప్రత్యేక రంగాలకు అనుగుణంగా AI పరిష్కారాలను అభివృద్ధి చేసే అవకాశాలు విస్తరిస్తున్నాయి.

అయితే, ఓపెన్-సోర్స్ AIతో పాటు కొన్ని సవాళ్లు కూడా ఉన్నాయి. డీప్‌ఫేక్‌లు, తప్పుడు సమాచారం, సైబర్ నేరాలు, కాపీరైట్ సమస్యలు, డేటా గోప్యత మరియు భద్రతా అంశాలు ప్రధాన ఆందోళనలుగా నిలుస్తున్నాయి. అందువల్ల సాంకేతిక అభివృద్ధితో పాటు నైతిక ప్రమాణాలు, చట్టపరమైన నియంత్రణలు మరియు బాధ్యతాయుత వినియోగ విధానాలు కూడా సమాంతరంగా అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉంది.

భవిష్యత్తులో ఓపెన్-సోర్స్ AI మరింత శక్తివంతమైన, మరింత అందుబాటులో ఉండే సాంకేతిక వేదికగా రూపాంతరం చెందనుంది. ప్రాంతీయ భాషల అభివృద్ధి, వ్యక్తిగత AI సహాయకులు, స్మార్ట్ పరికరాలు, రోబోటిక్స్, ఆరోగ్య సేవలు మరియు విద్యా రంగాలలో దీని ప్రభావం మరింత విస్తరించే అవకాశం ఉంది.

ఓపెన్-సోర్స్ AI అనేది కేవలం ఒక సాంకేతిక విధానం మాత్రమే కాదు. జ్ఞానం, ఆవిష్కరణ మరియు సహకారానికి ప్రతీకగా నిలిచిన ఒక ప్రపంచవ్యాప్త ఉద్యమం. సాంకేతికతను కొద్దిమంది చేతుల్లో కాకుండా సమాజమంతటికీ అందుబాటులోకి తీసుకువస్తూ, భవిష్యత్ డిజిటల్ ప్రపంచ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తున్న శక్తిగా ఓపెన్-సోర్స్ AI నిలుస్తోంది.

- లత
e: ogshydcbse@gmail. com

## 'మహబూబ్‌నగర్ జిల్లా బడిపిల్లల కథలు' పుస్తక ఆవిష్కరణ




మహబూబ్ నగర్ జిల్లాలోని వివిధ పాఠశాలల విద్యార్థులు రచించిన "మహబూబ్ నగర్ జిల్లా బడిపిల్లల కథలు" కథల సంకలనాన్ని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, విద్యార్థులు రాసిన కథలు ఎంతో ఆసక్తికరంగా, సృజనాత్మకంగా ఉన్నాయని ప్రశంసించారు. ఇలాంటి రచనలు చిన్నారుల్లో సృజనాత్మకతను పెంపొందించడంతో పాటు పఠనాసక్తిని పెంచుతాయని తెలిపారు. జిల్లా విద్యాశాఖాధికారి విజయకుమారి మాట్లాడుతూ, విద్యార్థుల అనుభవాలు, ఆలోచనలు, ఊహాశక్తికి ప్రతిబింబంగా ఈ పుస్తకం రూపుదిద్దుకుందని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ సహకారం, ప్రోత్సాహంతో ఈ పుస్తకం వెలువడినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ హరిప్రియ, జెడ్పీ సీఈఓ వెంకట్ రెడ్డి, ఏఓ సువర్ణరాజ్, వ్యవసాయ శాఖ శిక్షణ కేంద్రం డీడీ వెంకటేశ్, ఏఎంఓ దుంకుడు శ్రీనివాస్, సీఎంఓ సుధాకర్ రెడ్డి, జీసీడీఓ అస్రాఖాద్రి, పుస్తక సంపాదకులు డా. భీంపల్లి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.




- బాలచెలిమి డెస్క్

# కాకి - పాము కథ





ఒక అడివిలో పెద్ద చెట్టు పై ఒక కాకి గూడు కట్టుకుని సంతోషంగా ఉండేది. ఆ కాకి ప్రతి సంవత్సరం గుడ్లు పెట్టేది. కానీ ఆ చెట్టు కింద ఉన్న పుట్టలో ఒక పెద్ద పాము ఉండేది. కాకి ఆహారం కోసం బయటకు వెళ్లినప్పుడు, ఆ పాము చెట్టెక్కి గూడు లోని గుడ్లను తినేసేది. ఇలా ప్రతి సారి జరగడంతో కాకి చాలా బాధ పడేది.

ఒక రోజు కాకి తన స్నేహితుడైన నక్క దగ్గరకు వెళ్లి సహాయం కోరింది. నక్క కొంతసేపు ఆలోచించి ఒక తెలివైన ఉపాయం చెప్పింది.

నువ్వు "రాజభవనం దగ్గరికి వెళ్లి అక్కడ స్నానం చేసే రాణి లేదా రాజకుమార్తె ధరించిన బంగారు హారం తీసుకురా. దాన్ని పాము పుట్టలో పడేయి. సైనికులు హారం కోసం వచ్చి పామును చంపేస్తారు" అని చెప్పింది.

మరుసటి రోజు కాకి రాజభవనం దగ్గరకు వెళ్లింది. అక్కడ రాజకుమార్తె స్నానం చేస్తూ తన బంగారు హారం ఒడ్డున పెట్టింది. వెంటనే కాకి ఆ హారాన్ని తన ముక్కుతో పట్టుకుని ఎగురుతూ అడవి లోని తన చెట్టు వద్దకు వచ్చింది. సైనికులు వెంటపడసాగారు.

కాకి నేరుగా పాము పుట్ట దగ్గరకు వెళ్లి హారాన్ని సైనికులు చూస్తూ ఉండగా పుట్టలో పడేసింది. సైనికులు వచ్చి హారం తీసుకోవడానికి పుట్టలో వెదికారు. అందులో పాము కనిపించడంతో దాన్ని చంపేశారు.

ఇలా కాకి తమ శత్రువు నుంచి విముక్తి పొందినది. ఆ తరువాత ఆ కాకి వాటి పిల్లలు ప్రశాంతంగా జీవించాయి.

### కథలో సైన్స్ ఏమిటి?

### 1.కాకి గుడ్లు గురించి కొంత సమాచారం

కాకి గుడ్లు సాధారణంగా లేత ఆకుపచ్చ లేదా నీలిరంగు మిశ్రమంలో ఉంటాయి. వాటిపై గోధుమ లేదా నలుపు చుక్కలు కనిపిస్తాయి. కాకి ఒక్కసారికి 3 నుండి 5 గుడ్లు పెడుతుంది. గుడ్ల పరిమాణం సుమారు 3–4 సెంటీమీటర్ల వరకు ఉంటుంది. గుడ్లు సాధారణంగా 16–18 రోజుల్లో పిల్లలుగా బయటకు వస్తాయి

### 2.గుడ్డులో నుండి పిల్ల ఎలా బయటకు వస్తుంది?

ప్రతి గుడ్డులో నుండి పిల్ల బయటకు రాదు. ఆ గుడ్డులో ఫలదీకరణం ద్వారా చిన్న జీవ కణం ఉండాలి.కాకి గుడ్లపై కూర్చొని వేడి ఇస్తుంది.ఆ వేడి సుమారు 37–39°C ఉంటుంది. ఈ వేడి లేకపోతే పిల్ల పెరగదు.వేడి వల్ల గుడ్డులోని చిన్న జీవకణాలు విభజన చెంది పెరుగుతాయి. మొదటి రోజులలో గుడ్డులో చిన్న బిందువులా ఉంటుంది. గుండె కొట్టుకోవడం ప్రారంభ మవుతుంది. ఒక వారం తర్వాత కళ్ళు, తల కనిపిస్తాయి. తరువాత రక్తనాళాలు ఏర్పడతాయి మరికొన్ని రోజులు తర్వాత రెక్కలు, కాళ్లు పెరుగుతాయి. శరీర ఆకారం స్పష్టమవుతుంది మరి కొన్ని రోజులకు పిల్ల పూర్తిగా తయారవుతుంది గుడ్డు లోని పిల్ల ముక్కుతో గుడ్డు పెంకును పగలగొట్టి బయటకు వస్తుంది. గుడ్డు పెంకులో


చాలా చిన్న రంధ్రాలు ఉంటాయి. వాటి ద్వారా గాలి లోపలికి వెళుతుంది. పచ్చసొన (yolk)లో ఉన్న పోషకాలను తింటూ పెరుగుతుంది. సూపర్ మార్కెట్లో దొరికే కోడి గుడ్లు fertilized కావు. అందుకే వాటి నుండి పిల్లలు రావు.

### 3.పాములు చెట్లు ఎలా ఎక్కుతాయి?

పాములకు కాళ్లు లేకపోయినా అవి చెట్లను చాలా చాకచక్యంగా ఎక్కగలవు. దీనికి వాటి శరీర నిర్మాణం, కండరాల శక్తి, పొట్ట భాగంలోని ప్రత్యేక పొరలు(పొలుసు) కారణం. పాముల పొట్ట భాగంలో ఉండే వెడల్పైన పొలుసు చెట్టు పైభాగాన్ని గట్టిగా పట్టుకుంటాయి. శరీరంలోని బలమైన కండరాలను వంకరలుగా కదిలిస్తూ ముందుకు సాగుతాయి. చెట్టు చుట్టూ శరీరాన్ని చుట్టుకుని పైకి ఎక్కుతాయి. చెట్టు బెరడు మరియు పాము పొలుసు మధ్య ఘర్షణ బలం ఏర్పడుతుంది. ఈ ఘర్షణ బలం వల్ల జారిపోకుండా ఉంటుంది.

### 4.పుట్ట ఎలా ఏర్పడుతుంది?

చీమలు చిన్న మట్టికణాలను తెచ్చి ఒకదానిపై ఒకటి అమర్చుతాయి. వాటి లాలాజలం మట్టిని గట్టిగా అంటుకునేలా చేస్తుంది. ఇలా వేలాది చీమలు కలిసి పెద్ద గుట్టలా నిర్మిస్తాయి. పుట్టలో గాలి ప్రసరణ అద్భుతంగా ఉంటుంది. బయట వేడి ఎక్కువైనా లోపల ఉష్ణోగ్రత కొంత స్థిరంగా ఉంటుంది. పాములు మాత్రం పుట్టలు నిర్మించవు. పాములు మాత్రం పుట్టల్లో నివసిస్తాయి. ఎందుకంటే పుట్టలో చల్లగా ఉంటుంది. రక్షణ లభిస్తుంది. చిన్న జంతువులు ఆహారంగా దొరుకుతాయి.



**కొస మెరుపు**

చీమలు పెట్టిన పుట్టలు పాముల కిరవైన యట్లు
హేమమును కూడబెట్టిన భూమిసుల పాలజేరును
దానధర్మములేని ధనము నిలువదు
విశ్వదాభిరామ వినుర వేమ॥


– కె శ్రీకృష్ణ సాయి
రేవతి సైన్స్ ఫౌండేషన్ (రామచంద్రపురం)
m : 9866130320


## అమరావాది ఫౌండేషన్ పురస్కారాల ప్రకటన

తెలుగు బాలసాహిత్యం, సాహిత్య రంగాల్లో విశిష్ట సేవలు అందించిన వారిని గౌరవించేందుకు అమరావాది ఫౌండేషన్ 2026 సంవత్సరానికి "అమరావాది హైమవతి-ప్రసాద్ బాలసాహిత్య పురస్కారం" మరియు "అమరావాది హైమవతి-ప్రసాద్ సాహిత్య పురస్కారం"లను ప్రకటించింది. బాలసాహిత్య పురస్కారానికి ప్రముఖ రచయిత్రి జొన్నలగడ్డ శ్యామల ఎంపిక కాగా, సాహిత్య పురస్కారానికి యువకవి, సినీ గేయరచయిత నందకిశోర్ (నందూ) ఎంపికయ్యారు. త్వరలో హైదరాబాద్‌లో నిర్వహించే ప్రత్యేక కార్యక్రమంలో ఈ పురస్కారాలను ప్రదానం చేయనున్నారు. విజేతలకు రూ.5,000 నగదు బహుమతి, జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందజేయబడతాయి. ఈ విషయాన్ని ఫౌండేషన్ అధ్యక్షులు డా. అమరావాది నీరజ వెల్లడించారు. గతంలో ఈ పురస్కారాలను శ్రీ గరిపెల్లి అశోక్, అమ్మిన శ్రీనివాసరాజు, సి. మృణాళిని, శీలా సుబ్రద్రదేవిలు వంటి ప్రముఖులు అందుకున్నారు. సాహిత్య, బాలసాహిత్య రంగాల్లో విశేష కృషి చేసిన వారిని ప్రోత్సహించడం ఫౌండేషన్ లక్ష్యమని ఆమె తెలిపారు. – బాలచెలిమి డెస్క్




న్యూఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో నిర్వహించిన రక్షణ సత్కార మహోత్సవం-2026 తొలి విడతలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము 51 మంది సాహసవీరులకు వీరత్వ పురస్కారాలను ప్రదానం చేశారు. భారత సాయుధ దళాలు, కేంద్ర సాయుధ పోలీసు దళాలు, రాష్ట్ర పోలీసు శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది దేశ భద్రత, ఉగ్రవాద వ్యతిరేక చర్యలు, అంతరిక్ష శిక్షణ, ప్రమాదకర కార్యాచరణల్లో ప్రదర్శించిన అసాధారణ ధైర్యసాహసాలకు ఈ గౌరవాలు అందుకున్నారు. దేశ సేవలో ప్రాణత్యాగం చేసిన కొందరికి మరణానంతరంగా పురస్కారాలు ప్రదానం చేశారు. గగన్‌యాన్ వ్యోమగామి అభ్యర్థి, భారత వైమానిక దళ అధికారి ప్రశాంత్ బాలకృష్ణన్ నాయర్‌కు కీర్తి చక్రం లభించడం విశేషం. మొత్తం 51 పురస్కారాల్లో 7 కీర్తి చక్రాలు, 15 వీర చక్రాలు, 29 శౌర్య చక్రాలు, మొత్తం పురస్కారాలు: 51 ప్రదానం చేశారు.

**భారతదేశ వీరత్వ పురస్కారాలు:**

పరమ వీర్ చక్ర (Param Vir Chakra)
అశోక్ చక్ర (Ashoka Chakra)
మహా వీర్ చక్ర (Maha Vir Chakra)
కీర్తి చక్ర (Kirti Chakra)
వీర్ చక్ర (Vir Chakra)
శౌర్య చక్ర (Shaurya Chakra)

**యుద్ధకాల వీరత్వ పురస్కారాలు**

| క్ర.స. | పురస్కారం | వివరణ |
|---|---|---|
| 1 | పరమ వీర్ చక్ర | శత్రువు సమక్షంలో అత్యున్నత శౌర్యానికి |
| 2 | మహా వీర్ చక్ర | రెండవ అత్యున్నత యుద్ధకాల వీరత్వ పురస్కారం |
| 3 | వీర్ చక్ర | యుద్ధరంగంలో విశిష్ట ధైర్యసాహసాలకు |

**శాంతికాల వీరత్వ పురస్కారాలు**

| క్ర.స. | పురస్కారం | వివరణ |
|---|---|---|
| 1 | అశోక్ చక్ర | అత్యున్నత శాంతికాల వీరత్వ పురస్కారం |
| 2 | కీర్తి చక్ర | రెండవ అత్యున్నత శాంతికాల పురస్కారం |
| 3 | శౌర్య చక్ర | మూడవ అత్యున్నత శాంతికాల పురస్కారం |

**కీర్తి చక్ర గ్రహీతలు - 2026**

| పేరు | సేవ |
|---|---|
| లాన్స్ నాయక్ మీనాక్షి సుందరం ఎ | భారత సైన్యం |
| నాయబ్ సుబేదార్ దోలేశ్వర్ సుబ్బా | భారత సైన్యం |
| మేజర్ అర్ష్‌దీప్ సింగ్ | భారత సైన్యం |
| గ్రూప్ కెప్టెన్ ప్రశాంత్ బాలకృష్ణన్ నాయర్ | భారత వైమానిక దళం |
| కెప్టెన్ లాల్‌రినావ్మా సైలో | భారత సైన్యం |
| సిపాయి జంజల్ ప్రవీణ్ ప్రభాకర్ | భారత సైన్యం |

**వీర్ చక్ర గ్రహీతలు - 2026**

| పేరు | సేవ |
|---|---|
| కల్నల్ కోశాంక్ లాంబా | భారత సైన్యం |
| గ్రూప్ కెప్టెన్ రంజీత్ సింగ్ సిద్ధూ | భారత వైమానిక దళం |

| | |
|---|---|
| గ్రూప్ కెప్టెన్ మనీష్ అరోరా | భారత వైమానిక దళం |
| గ్రూప్ కెప్టెన్ అనిమేష్ పట్నీ | భారత వైమానిక దళం |
| గ్రూప్ కెప్టెన్ కునాల్ కల్రా | భారత వైమానిక దళం |
| గ్రూప్ కెప్టెన్ జాయ్ చంద్ర | భారత వైమానిక దళం |
| లెఫ్టినెంట్ కల్నల్ సుశీల్ బిష్ట్ | భారత సైన్యం |
| స్క్వాడ్రన్ లీడర్ సార్థక్ కుమార్ | భారత వైమానిక దళం |
| స్క్వాడ్రన్ లీడర్ సిద్ధాంత్ సింగ్ | భారత వైమానిక దళం |
| స్క్వాడ్రన్ లీడర్ రిజ్వాన్ మాలిక్ | భారత వైమానిక దళం |
| ఫ్లైట్ లెఫ్టినెంట్ అర్ష్వీర్ సింగ్ ఠాకూర్ | భారత వైమానిక దళం |
| నాయబ్ సుబేదార్ సతీష్ కుమార్ | భారత సైన్యం |

**శౌర్య చక్ర గ్రహీతలు – 2026**

| పేరు | సేవ |
|---|---|
| లెఫ్టినెంట్ కల్నల్ నీతేష్ భారతి శుక్లా | భారత సైన్యం |
| మేజర్ ఆదిత్య ప్రతాప్ సింగ్ | భారత సైన్యం |
| మేజర్ ఆశిష్ కుమార్ | భారత సైన్యం |
| అసిస్టెంట్ కమాండెంట్ మొహమ్మద్ షఫీక్ | అస్సాం రైఫిల్స్ |
| లెఫ్టినెంట్ కమాండర్ సూరజ్ ప్రసార్ | భారత నౌకాదళం |

| | |
|---|---|
| రామ్ గోయల్ | భారత నౌకాదళం |
| మేజర్ భార్గవ్ కలితా | భారత సైన్యం |
| మేజర్ దీపక్ సింగ్ | భారత సైన్యం |
| మేజర్ అన్షుల్ బాల్టూ | భారత సైన్యం |
| మేజర్ శివకాంత్ యాదవ్ | భారత సైన్యం |
| మేజర్ వివేక్ | భారత సైన్యం |
| కెప్టెన్ యోగేందర్ సింగ్ ఠాకూర్ | భారత సైన్యం |
| లెఫ్టినెంట్ కమాండర్ దిల్నా కె | భారత నౌకాదళం |
| లెఫ్టినెంట్ కమాండర్ రూపా ఎ | భారత నౌకాదళం |

**మరణానంతర వీరత్వ పురస్కార గ్రహీతలు – 2026**

| పేరు | పురస్కారం | సేవ |
|---|---|---|
| లాన్స్ దఫదార్ బలదేవ్ చంద్ | శౌర్య చక్ర | భారత సైన్యం |
| సబ్ ఇన్స్పెక్టర్ మొహమ్మద్ ఇంతేయాజ్ | వీర్ చక్ర | కేంద్ర భద్రతా దళం |
| కానిస్టేబుల్ దీపక్ చింగాఖామ్ | వీర్ చక్ర | కేంద్ర భద్రతా దళం |
| రైఫిల్‌మన్ సునీల్ కుమార్ | వీర్ చక్ర | భారత సైన్యం |
| సిపాయి జంజల్ ప్రవీణ్ ప్రభాకర్ | కీర్తి చక్ర | భారత సైన్యం |
| లెఫ్టినెంట్ శశాంక్ తివారి | కీర్తి చక్ర | భారత సైన్యం |

– బాలచెలిమి డెస్క్

# "సుస్థిర భవిష్యత్తు కోసం యువత సాధికారత" - Er. వేదకుమార్ మణికొండ




ప్రపంచ పర్యావరణ దినోత్సవం-2026 సందర్భంగా ఫోరం ఫర్ ఎ బెటర్ హైదరాబాద్ (FBH) తన 26వ వార్షికోత్సవాన్ని జూన్ 5న ఖైరతాబాద్‌లోని ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఇంజనీర్స్ (ఇండియా), తెలంగాణ స్టేట్ సెంటర్ సహకారంతో ఘనంగా నిర్వహించింది.

ఈ సందర్భంగా FBH వార్షిక సంచిక 2025-2026ను ప్రొ. దేవేందర్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బాలచెలిమి మాసపత్రిక సంపాదకులు Er. వేదకుమార్ మణికొండ మాట్లాడుతూ, ఫోరం గత 26 ఏళ్లుగా పర్యావరణ పరిరక్షణ, వారసత్వ సంపద సంరక్షణ, చెరువులు, అడవులు, జీవవైవిధ్య రక్షణ మరియు పౌర జీవన నాణ్యత మెరుగుదల కోసం నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు.

"సుస్థిరమైన, పర్యావరణహిత భవిష్యత్తు నిర్మాణంలో యువత భాగస్వామ్యం అత్యంత కీలకం. యువత ఎల్లప్పుడూ మానసిక వికాసంతో, సానుకూల దృక్పథంతో ముందుకు సాగాలని, ప్రపంచ దేశాలలో పర్యావరణ సంరక్షకులుగా యువకులు, విద్యార్థులు ఎదగాలని ఆకాంక్షించారు. ప్రకృతి వనరుల పరిరక్షణ, వాతావరణ మార్పుల నివారణ, జీవవైవిధ్య సంరక్షణ వంటి అంశాలలో యువత చురుకైన పాత్ర పోషించి భవిష్యత్ తరాలకు మెరుగైన ప్రపంచాన్ని అందించాలని ఆయన సూచించారు.

– బాలచెలిమి డెస్క్

కథ

# విహార యాత్రలో ఎదురైన వింత అనుభవం




అనగనగా ఒక పట్టణంలో నలుగురు స్నేహితులు ఉండేవారు. వేసవికాలం సెలవులు పిల్లలకు రానే వచ్చాయి స్నేహితులందరు కలిసి సెలవులలో విహార యాత్రకు ఎక్కడికి వెళ్ళాలో ఆలోచిస్తున్నారు. ఇంతలో ఒకడు అరే ఆంధ్ర రాష్ట్రంలో విస్తరించిన నల్లమల అడువులలో పెద్ద పెద్ద చెట్లు, పులుల వంటి మాంసాహార జీవులు, జింకలపంటి శాకాహార జీవులు ఉంటాయి. అవన్నీ మన మనస్సులకు ఆనందాన్ని, ఆహ్లాదాన్ని కలుగజేస్తాయి అని అన్నాడు. దాంతో స్నేహితులందరూ సరే నువ్వు చెప్పింది చాలా బాగుంది అక్కడికె వెళదాము అని యాత్రకు కావాల్సిన సామాగ్రి అంత సిద్ధం చేసుకున్నారు. ఉదయాన్నె తినుబండారాలతో అడవి లోఅడుగు పెట్టారు. అలా కొంత దూరం ప్రయాణించాక వారికిక్రింద నేల మీద పెద్ద పులి అడుగు జాడలు కనిపించాయి వాళ్ళలో ఒకడు “చూస్తుంటే ఇది పులి యొక్క ఆవాసంలా ఉంది, కాబట్టి నిశ్శబ్దంగా ఉండండి. పులిని దూరం నుంచి కొన్ని చిత్రాలు తీసుకొని వెళ్ళిపోదాం” అని అన్నాడు. అనుకున్నట్టే దూరం నుంచి చూసి కొన్ని చిత్రాలు తీసి వేరొక చోటుకు వెళ్లారు అయితే అలా వెళుతుండగా వీళ్ళని చూసిన ఒక తోడేలు వీళ్ళని వెంబడించ సాగింది. అది చూసిన ఒకడు వాళ్ళ మిత్రుల నీహెచ్చరించాడు. అది విని అందరు పరుగులు తీశారు. అలాకొంతదూరం పరిగెత్తాక వెనక్కి తిరిగి చూశారు. తోడేలుకనిపించడంలేదు దాంతో వీళ్ళు మెల్లగ వెళ్ళ సాగారు.

కాని దారి మర్చిపోయి తప్పిపోయారు అలా తిరుగుతుండగా ఒక గూడెంకి చేరుకున్నారు. వీళ్ళందరు ఆ గూడెం ప్రజల ఆచారాలని, కట్టు బాట్లని, జీవన విధానాన్ని చూసి ఆశ్చర్యపోయారుఆ ఆనంద కరమైన దృశ్యాలని చిత్రాలు తీసుకునేందుకు కెమెరాను తీసి చిత్రాలు తీసారు. ఆ కెమెరా నుంచి వెలువడిన కాంతిని చూసి ఆ గూడెం పెద్ద ఇదేదో మాయా శక్తి అనుకొని వాళ్ళని చెక్కతో చేసిన కారాగారంలో బంధించారు. ఉదయం నుండి సాయంత్రం వరకు అన్న పానీయాలు లేకుండ ఉండాలని గూడెం పెద్ద తిఞ్జాపించారు. అలా వారిని బంధించినప్పుడు ఆ నలుగురు గూడెంలోని వారి ఆచారాలను గమనించారు, గూడెంలోని వారందరూ ప్రకృతి మాతను పూజించడం, పర్యావరణంలోని చెట్లను కాపాడడం, అడవిలో దొరికే ఔషధాలను వినియోగించి ఆరోగ్య సమస్యలను నయం చేయడం, కాలుష్య నివారణ చేయడం, పశుపక్షులను ప్రేమతో చూడడం, వింతైన వస్త్రాలు ధరించడం వీరి కట్టు బాట్లు మరియు సాంప్రదాయాలు, ఆచారాలు ఆ నలుగురిని బాగా ఆకర్షించాయి. ఆవిధంగా వారు అక్కడ కాలం గడుపు తున్నారు ఒక రోజు సూర్యాస్తమయం జరుగుతూ ఉంది. చివరికి రాత్రి, రానే వచ్చింది అందరూ నిద్రపోయారు మరోవైపు మిత్రులు ఇదే తగిన సమయం ఎలాగైనా ఈ రోజు తప్పించుకోవాలి అని అనుకున్నారు. అనుకొని వాళ్ళ దగ్గర ఉన్న వస్తువులతో ఆ కారాగారాన్ని చీల్చుకొని బయటకు వచ్చారు. ఇంకోవైపు పెద్దపులి చాలా ఆకలితో ఆహారం కోసం ఈ గూడెం వైపుగా వస్తుంది. మరోపక్క ఆ గూడెంలోని పిల్లవాడు మూత్ర విసర్జన కోసం నిద్రలేచి ఒంటరిగా గుడిశ నుండి బయటకు వచ్చాడు. విసర్జన పూర్తయ్యి తిరిగి వెళ్తుండగా పెద్దపులి వేగంగా పరిగెత్తుతూ గాలిలో ఎగిరి పిల్లవాడి మీదకు దూకేందుకు వస్తుంది. పులి గాలిలో ఉన్న సమయంలో ఆ నలుగురు స్నేహితులు సమీపంలో ఉన్న నిప్పుకర్రతో పులి యొక్క దవడకి వేసి కొట్టారు, దాంతో పులి బెదిరిపోయి పారిపోయింది. ఈ శబ్దాలు విన్న గూడెం వాసులు బయట వచ్చారు. విషయం తెలుసుకున్న గూడెం పెద్ద వాళ్ళకి అతిథి మర్యాదలు చేసి వాళ్ళ ఇళ్ళకి సాగనంపారు.


– ఆర్.మహేష్ బాబు
తొమ్మిదో తరగతి, అరవింద మోడల్ స్కూల్, మంగళగిరి.
ఇంద్రాణి (ప్రిన్సిపల్), m: 97032 49666



# హిమాలయన్ క్వెయిల్ – హిమాలయాల గూఢ పక్షి

ప్రకృతిలో కొన్ని జీవజాతులు మన కళ్లముందే అంతరించి పోతాయి. మరికొన్ని జీవులు మాత్రం శతాబ్దాలుగా కనిపించకపోయినా, ఎక్కడో ఒకచోట ఇంకా జీవించి ఉండవచ్చనే ఆశను కలిగిస్తాయి. అలాంటి అత్యంత అరుదైన పక్షులలో హిమాలయన్ క్వెయిల్ (Ophrysia superciliosa) ఒకటి. దీనిని "మౌంటెన్ క్వెయిల్" అని కూడా పిలుస్తారు. భారతదేశంలోని పశ్చిమ హిమాలయ ప్రాంతాలకు మాత్రమే పరిమితమైన ఈ పక్షి నేడు ప్రపంచ పక్షిశాస్త్రవేత్తలలో ఆసక్తి, ఆశ్చర్యం మరియు ఆందోళనకు కారణమైంది.

హిమాలయన్ క్వెయిల్ ఫీజాంట్ (Phasianidae) కుటుంబానికి చెందిన చిన్న పరిమాణం గల భూచర పక్షి. ఇది ప్రధానంగా ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని నైనిటాల్, మసూరీ మరియు పరిసర హిమాలయ పర్వత ప్రాంతాల్లో నివసించేది. సముద్ర మట్టానికి సుమారు 1,600 నుండి 2,400 మీటర్ల ఎత్తులో ఉన్న గడ్డి మైదానాలు, దట్టమైన పొదలు, కొండ వాలులు దీని సహజ నివాస ప్రాంతాలు. ఈ పక్షి ఎక్కువగా నేలపై సంచరిస్తూ జీవించేది. అందువల్ల దానిని గుర్తించడం చాలా కష్టమయ్యేది.


1836లో బ్రిటిష్ ప్రకృతి పరిశోధకులు ఈ పక్షిని మొదటిసారిగా శాస్త్రీయంగా నమోదు చేశారు. అనంతరం కొన్ని నమూనాలు సేకరించబడినప్పటికీ, 1876 తరువాత ఈ పక్షి ఎక్కడా కనిపించలేదు. దాదాపు 150 సంవత్సరాలుగా దీని ఉనికికి సంబంధించిన స్పష్టమైన ఆధారాలు లభించలేదు. అయినప్పటికీ, హిమాలయాల దూర ప్రాంతాల్లో ఇంకా ఇది జీవించి ఉండవచ్చని కొందరు పరిశోధకులు విశ్వసిస్తున్నారు. ఈ కారణంగానే దీనిని "Lost Bird" లేదా "Ghost Bird of the Himalayas" అని కూడా పిలుస్తారు. హిమాలయన్ క్వెయిల్ సుమారు 25 నుండి 28 సెంటీమీటర్ల పొడవు కలిగి ఉండేది. దీని బరువు సాధారణంగా 200 నుండి 300 గ్రాముల మధ్య ఉండేదని అంచనా. మగ పక్షి నలుపు, ముదురు గోధుమ రంగు ఈకలతో, కళ్ల పైన తెల్లని చారలతో ఆకర్షణీయంగా కనిపించేది. ఆడ పక్షి గోధుమ రంగు ఈకలతో సహజ వాతావరణంలో కలిసిపోయే విధంగా ఉండేది. చిన్న గుండ్రని రెక్కలు, బలమైన కాళ్లు దీని ప్రత్యేక లక్షణాలు. ఎక్కువ దూరం ఎగరడం కంటే నేలపై వేగంగా పరుగెత్తడానికే ఇది అనుకూలంగా ఉండేది. గడ్డి విత్తనాలు, చిన్న కీటకాలు, మొక్కల భాగాలు దీని ప్రధాన ఆహారం. ఈ పక్షి అదృశ్యానికి అనేక కారణాలు సూచించబడుతున్నాయి. బ్రిటిష్ పాలన కాలంలో విస్తృత వేట, అడవుల నరికివేత, పర్వత ప్రాంతాల్లో మానవ నివాసాల విస్తరణ, వ్యవసాయ భూముల పెరుగుదల మరియు పశువుల అధిక మేత కారణంగా దీని నివాస ప్రాంతాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. గడ్డి మైదానాలు తగ్గిపోవడం వల్ల ఈ పక్షి జనాభా క్రమంగా క్షీణించి ఉండవచ్చని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. వాతావరణ మార్పులు కూడా దీని మనుగడపై ప్రభావం చూపి ఉండవచ్చని తాజా అధ్యయనాలు సూచిస్తున్నాయి.

ప్రపంచ ప్రకృతి పరిరక్షణ సంస్థ (IUCN) హిమాలయన్ క్వెయిల్‌ను "Critically Endangered (Possibly Extinct)" వర్గంలో చేర్చింది. భారతదేశంలోని అటవీశాఖ, పక్షి శాస్త్రవేత్తలు మరియు పర్యావరణ సంస్థలు దీని ఆనవాళ్ల కోసం పలు సర్వేలు నిర్వహించాయి. నైనిటాల్, మసూరీ ప్రాంతాల్లో ప్రత్యేక అన్వేషణ కార్యక్రమాలు చేపట్టినా ఇప్పటివరకు ఖచ్చితమైన ఆధారాలు లభించలేదు. హిమాలయన్ క్వెయిల్ కథ మనకు ప్రకృతి పరిరక్షణ యొక్క అత్యవసరతను గుర్తుచేస్తుంది. ఒక జీవజాతి అంతరించిపోవడం అంటే కేవలం ఒక పక్షి కనుమరుగవడం మాత్రమే కాదు; అది ఒక సంపూర్ణ పర్యావరణ వ్యవస్థలోని కీలక భాగం కోల్పోవడమే. జీవ వైవిధ్య పరిరక్షణ, అడవుల సంరక్షణ, గడ్డి మైదానాల రక్షణ మరియు పర్యావరణ సమతుల్యతను కాపాడడం ద్వారా మాత్రమే ఇటువంటి అరుదైన జీవజాతులను భవిష్యత్ తరాలకు అందించగలం. హిమాలయన్ క్వెయిల్ నేడు ఒక పక్షి మాత్రమే కాదు; అది ప్రకృతి సంరక్షణకు సంబంధించిన హెచ్చరిక, జీవ వైవిధ్యానికి ప్రతీక, మరియు మనం కోల్పోతున్న సహజ సంపదకు ఒక మౌన సాక్ష్యం.

– సచిన్ కోత్వాల్
m : 97010 01036

కథ

# మూలాలు మరచిన మొక్క




గీతానగర్‌లో ఎనిమిదో తరగతి చదువుతున్న కిరణ్ అనే బాలుడు ఉండేవాడు. తండ్రి ప్రభుత్వ ఉద్యోగి, తల్లి గృహిణి. ఇద్దరూ కిరణ్ చదువుకుని మంచి స్థాయికి చేరాలని కలలు కనేవారు. కానీ కిరణ్ మాత్రం రోజురోజుకు మారిపోతున్నాడు. ఉదయం లేవగానే మొబైల్, స్కూల్ నుంచి రాగానే స్నేహితులతో తిరగటం, రాత్రి ఆలస్యంగా పడుకోవటం-ఇవే అతని నిత్యకృత్యాలయ్యాయి. తల్లి చదువుకోమని చెప్పినా, "నాకు తెలుసు అమ్మా... మీరు పాతకాలం వాళ్లు" అంటూ నిర్లక్ష్యంగా మాట్లాడేవాడు.

తండ్రి హెచ్చరించినా, "నన్ను ఎవరు ఆపలేరు" అంటూ అహంకారంగా సమాధానం చెప్పేవాడు.

స్కూల్‌లోనూ పరిస్థితి అదే. ఉపాధ్యాయులు చెప్పే మాటలు అతనికి వినిపించేవే కాదు. హోంవర్క్ చేయకపోవడం, క్లాస్‌లో అల్లరి చేయడం, చెడు స్నేహాలకు దగ్గర కావడం – ఇవన్నీ అతని అలవాట్లయ్యాయి. చదువులో వెనుకబడిపోతున్నాడని టీచర్‌లు చెప్పినా, అతనికి మాత్రం ఏమాత్రం పట్టలేదు. ఒక రోజు స్కూల్‌లో వృక్షారోపణ కార్యక్రమం జరిగింది. ప్రతి విద్యార్థికి ఒక మొక్క ఇచ్చి, దాన్ని పెంచే బాధ్యత అప్పగించారు. కిరణ్‌కు ఇచ్చిన మొక్కను అతడు ఇంటి వెనుక మూలలో నాటేశాడు. రోజులు గడిచాయి. నీరు పోయలేదు. సంరక్షణ చేయలేదు.

కొన్ని వారాల తర్వాత, టీచర్ అందరి మొక్కలను పరిశీలించడానికి వచ్చారు. అందరి మొక్కలు పచ్చగా పెరిగాయి. కానీ కిరణ్ మొక్క మాత్రం ఎండిపోయి, వాడిపోయి కనిపించింది. టీచర్ కిరణ్‌ను పిలిచి మెల్లగా అన్నారు....

"ఈ మొక్క ఎందుకు ఎండిపోయిందో తెలుసా నాన్నా? నీరు లేక, శ్రద్ధ లేక. అలాగే విద్యార్థి జీవితం కూడా. తల్లి దండ్రుల ప్రేమ నీరు, ఉపాధ్యాయుల మాటలు ఎరువు, కష్టపడి చదవడం సంరక్షణ. ఇవి లేకపోతే జీవితం కూడా ఇలాగే వాడిపోతుంది." ఆ మాటలు కిరణ్ గుండెల్లో బలంగా తాకాయి. ఇంటికి వెళ్లాక తల్లి పాదాలపై తల వంచి క్షమాపణ కోరాడు. తండ్రి చేతిని పట్టుకుని, "నన్ను క్షమించండి నాన్న... ఇక మారతాను" అన్నాడు.

ఆ రోజు నుంచి కిరణ్ అలవాట్లు మారాయి. మొబైల్ దూరం పెట్టాడు. చెడు స్నేహాలను వదిలేశాడు. చదువుపై శ్రద్ధ పెట్టాడు. ఉపాధ్యాయులను గౌరవించటం మొదలు పెట్టాడు. వాడిపోయిన మొక్క దగ్గర రోజూ నీరు పోస్తూ,

"నేను కూడా కొత్తగా పెరుగుతాను" అని అనుకున్నాడు. కొన్ని నెలల తర్వాత, అదే మొక్క మళ్లీ పచ్చగా మొలకెత్తింది. కిరణ్ జీవితంలాగే.

* * *

తల్లి దండ్రుల ఆశీర్వాదం, ఉపాధ్యాయుల మార్గదర్శనం ఉన్న విద్యార్థి... ఎప్పటికీ వాడిపోడు.

– ఎలగొండ రవి
బాల చెలిమి గ్రంథాలయం జెడ్‌పిహెచ్‌ఎస్ బాలికలు, సిరిసిల్లా
m : 98487 70345

చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ

హైదరాబాద్ (Regd. 720/1982)

బాలచెలిమి గ్రంథాలయం

# బాల చెలిమి గ్రంథాలయం - విద్యార్థుల్లో పఠనాసక్తిని పెంపొందించిన బడిబాట కార్యక్రమం




మా జల్లేపల్లి ఉన్నత పాఠశాలలో నిర్వహించిన "బడిబాట" కార్యక్రమం విద్యార్థులకు ఎంతో ప్రయోజనకరంగా నిలిచింది. వేసవి సెలవులను సద్వినియోగం చేసుకునేలా బాల చెలిమి గ్రంథాలయం ఆధ్వర్యంలో విద్యార్థులకు వివిధ అంశాలకు సంబంధించిన పుస్తకాలు అందుబాటులో ఉంచారు. కథలు, జీవిత చరిత్రలు, విజ్ఞాన శాస్త్రం, పర్యావరణం, సాధారణ జ్ఞానం, స్ఫూర్తిదాయక రచనలు వంటి అనేక పుస్తకాలను విద్యార్థులు ఆసక్తిగా చదివారు.

ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో పఠనాసక్తి పెరగడమే కాకుండా, కొత్త విషయాలను తెలుసుకోవాలనే జిజ్ఞాస కూడా అభివృద్ధి చెందింది. పుస్తకాలు చదవడం వల్ల భాషా నైపుణ్యాలు మెరుగుపడటంతో పాటు ఆలోచనా శక్తి, సృజనాత్మకత మరియు వ్యక్తిత్వ వికాసానికి కూడా దోహదపడింది. విద్యార్థులు తాము చదివిన పుస్తకాల ద్వారా ఎన్నో తెలియని విషయాలను తెలుసుకున్నామని, భవిష్యత్తులో కూడా పుస్తక పఠనాన్ని కొనసాగిస్తామని ఆనందంగా తెలిపారు.

వేసవి సెలవుల్లో బాల చెలిమి గ్రంథాలయం ద్వారా అనేక పుస్తకాలు చదివే అవకాశం లభించింది. వాటి ద్వారా ఎన్నో కొత్త విషయాలను నేర్చుకున్నాను. పుస్తకాలు చదవడం వల్ల నా జ్ఞానం పెరిగింది. ఈ అవకాశాన్ని కల్పించిన బాల చెలిమి వారికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు. **- సి. హెచ్. మేఘన**, 9వ తరగతి విద్యార్థి

బాల చెలిమి గ్రంథాలయంలో అందుబాటులో ఉన్న పుస్తకాలు చదవడం ద్వారా ఎన్నో ఆసక్తికరమైన విషయాలు తెలుసుకున్నాను. పఠనం పట్ల మరింత ఆసక్తి కలిగింది. మాకు ఈ విలువైన అవకాశాన్ని కల్పించిన బాల చెలిమి వారికి ప్రత్యేక ధన్యవాదాలు. **- ప్రవళిక,** 9వ తరగతి విద్యార్థి

"పుస్తకం మంచి మిత్రుడు, పఠనం ఉజ్వల భవిష్యత్తుకు పునాది" అని బాల చెలిమి గ్రంథాలయం చైర్మన్ శ్రీ మణికొండ వేదకుమార్ గారు పిల్లలకు ఎల్లప్పుడూ సందేశం ఇస్తుంటారు. జల్లేపల్లి పాఠశాలలో నిర్వహించిన బడిబాట కార్యక్రమం ఆ సందేశాన్ని విద్యార్థుల హృదయాల్లో సజీవంగా నిలిపింది. **- శ్రీ డి. రాజేష్ గారు**, ప్రధానోపాధ్యాయులు

మా పాఠశాలలో బాల చెలిమి గ్రంథాలయం అందిస్తున్న సేవలను అభినందిస్తూ, విద్యార్థుల్లో పఠన సంస్కృతిని పెంపొందించడంలో ఈ కార్యక్రమం విశేషంగా దోహద పడిందన్నారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల భవిష్యత్తును మరింత ప్రకాశవంతం చేస్తాయని పేర్కొన్నారు. **- శ్రీమతి ఉషశ్రీ గారు**, స్కూల్ అసిస్టెంట్ (తెలుగు)

నేటి డిజిటల్ యుగంలో పిల్లలను పుస్తకాల వైపు మళ్లించడం ఒక గొప్ప సేవ. ఆ సేవను సమర్థవంతంగా నిర్వహిస్తూ విద్యార్థుల మేధో వికాసానికి తోడ్పడుతున్న బాల చెలిమి గ్రంథాలయం వారికి మా హృదయపూర్వక అభినందనలు మరియు కృతజ్ఞతలు. **- శ్రీ ఉపేందర్ గారు**, స్కూల్ అసిస్టెంట్ (తెలుగు)

బాల చెలిమి గ్రంథాలయం వారికి మా పాఠశాల తరపున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము.

**- శ్రీమతి ఝాన్సీ లక్ష్మి**

ఇన్‌చార్జ్, బాల చెలిమి గ్రంథాలయం

SA(తెలుగు), ZPHS జల్లేపల్లి. m: 9441312240

# ఎడ్యుకేషన్ వీక్-2026 వేడుకల్లో కళా వైభవం

2026 మే 11-17 మధ్య నిర్వహించిన ఎడ్యుకేషన్ వీక్ వేడుకలలో భాగంగా మే 16న హైదరాబాద్‌లో రాష్ట్ర స్థాయి కళా, హస్తకళ, సాంస్కృతిక పోటీలు నిర్వహించారు. డ్రాయింగ్, శిల్పకళ, నృత్యం, తెలంగాణ గీతాలు, ఒగ్గుకథ తదితర విభాగాల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు ప్రతిభ చాటారు. విజేతలకు జూన్ 2న పాఠశాల విద్యాశాఖ సంచాలకుల కార్యాలయంలో ఘనంగా బహుమతులు ప్రదానం చేశారు.

| సం. | విద్యార్థి / బృందం | పాఠశాల | విభాగం | స్థానం / బహుమతి |
|---|---|---|---|---|
| 1 | రిక్కీ తేజ్ | యూపీఎస్, తుమ్మలపల్లి, నాగర్‌కర్నూల్ | డ్రాయింగ్ / పెయింటింగ్ / 3డీ ఆర్ట్ (జూనియర్స్) | ప్రథమ బహుమతి |
| 2 | కవిత ముప్పల్ల | జెడ్పీహెచ్ఎస్ గర్ల్స్, మెడ్చల్ మల్కాజిగిరి | డ్రాయింగ్ / పెయింటింగ్ / 3డీ ఆర్ట్ (జూనియర్స్) | ద్వితీయ బహుమతి |
| 3 | పి. కవితారాణి | జీహెచ్ఎస్ జామియా ఉస్మానియా, హైదరాబాద్ | డ్రాయింగ్ / పెయింటింగ్ / 3డీ ఆర్ట్ (జూనియర్స్) | ద్వితీయ బహుమతి |
| 4 | జి. ప్రణీత | ఎంజేపీటీసీబీసీ బాలికల పాఠశాల, బహదూర్‌పూర్ | డ్రాయింగ్ / పెయింటింగ్ / 3డీ ఆర్ట్ (జూనియర్స్) | ద్వితీయ బహుమతి |
| 5 | శివ | జెడ్పీహెచ్ఎస్, బిజ్వార్, ఉట్నూర్, ఆదిలాబాద్ | డ్రాయింగ్ / పెయింటింగ్ / 3డీ ఆర్ట్ (సీనియర్స్) | ప్రథమ బహుమతి |
| 6 | అర్జున్ ప్రసాద్ | జెడ్పీహెచ్ఎస్ బాలుర పాఠశాల, కోస్గి, నారాయణపేట | డ్రాయింగ్ / పెయింటింగ్ / 3డీ ఆర్ట్ (సీనియర్స్) | ద్వితీయ బహుమతి |
| 7 | కురెళ్ల శ్రీనివాస్ | జెడ్పీహెచ్ఎస్, లింగోజిగూడెం, చౌటుప్పల్, | ఉపాధ్యాయుల విభాగం యాదాద్రి భువనగిరి | ప్రథమ బహుమతి |
| 8 | శ్రీవాస్ రెడ్డి | ఎంపీపీఎస్, కట్కూర్, బచ్చన్నపేట, జనగామ | ఉపాధ్యాయుల విభాగం | ద్వితీయ బహుమతి |
| 9 | వి. విష్ణు వర్ధన్ | జెడ్పీహెచ్ఎస్ దర్గా హుస్సేన్ షావలి, | హస్తకళ – శిల్పకళ శేరిలింగంపల్లి, రంగారెడ్డి | ప్రథమ బహుమతి |
| 10 | దీక్షిత, హర్షిత | జవహర్ బాలభవన్ | హస్తకళ – కొబ్బరి చిప్పల బొమ్మలు | ద్వితీయ బహుమతి |
| 11 | పవన్ తేజ | శ్రీ టీఎస్ఎంఎస్, గుర్రంపోడు, నల్గొండ | హస్తకళ – పేపర్ క్రాఫ్ట్&బీడ్ క్రాఫ్ట్ | ద్వితీయ బహుమతి |
| 12 | మైత్రి తేజల్ | కళా ఉత్సవ్ రన్నరప్, హనుమకొండ | సోలో శాస్త్రీయ నృత్యం | స్పెషల్ జ్యూరీ బహుమతి |
| 13 | యుక్తా మరియు బృందం | జవహర్ బాలభవన్, హైదరాబాద్ | తెలంగాణ గీతం | ప్రథమ బహుమతి |
| 14 | ప్రభాకర్ | జెడ్పీహెచ్ఎస్, యూసుఫ్‌గూడ, హైదరాబాద్ | శివ తాండవం | ద్వితీయ బహుమతి |
| 15 | బోలిశెట్టి బుచ్చన్న | ఎంపీపీఎస్, గుడిరేవు, మంచిర్యాల | ఒగ్గుకథ – పాఠశాల విద్య | విజేత |
| 16 | వి. అంజని | ఎంపీపీఎస్, పాతిపాక, శ్యాంపేట, హనుమకొండ | ఏకపాత్రాభినయం-ఝాన్సీ లక్ష్మీబాయి | విజేత |

– బాలచెలిమి డెస్క్

# భావాలకు ప్రాణం పోసిన
# మహానటి సావిత్రి

తెలుగు చలనచిత్ర చరిత్రలో నటనకు నిర్వచనంగా నిలిచిన మహానటి సావిత్రి గారు భారతీయ సినీ రంగంలో చిరస్థాయిగా నిలిచిపోయిన గొప్ప కళాకారిణి. తన సహజసిద్ధమైన నటన, అద్భుతమైన భావవ్యక్తీకరణ, పాత్రలో పూర్తిగా లీనమయ్యే ప్రతిభతో ఆమె ప్రేక్షకుల హృదయాలలో చెరగని ముద్ర వేశారు. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం, హిందీ భాషలలో వందలాది చిత్రాలలో నటించి దక్షిణ భారత సినీ పరిశ్రమకు అపూర్వ సేవలందించారు. అందుకే ఆమెను అభిమానులు ప్రేమతో "మహానటి" అని పిలుస్తారు. సావిత్రి గారు 1934 డిసెంబర్ 6న ఆంధ్రప్రదేశ్ లోని గుంటూరు జిల్లా చిర్రావూరు గ్రామంలో జన్మించారు. ఆమె పూర్తి పేరు నిస్సంకర సావిత్రి. చిన్న వయసులోనే తండ్రి గురవయ్యను కోల్పోవడంతో కుటుంబం అనేక కష్టాలను ఎదుర్కొంది. ఆమె తల్లి సుభద్రమ్మ ప్రోత్సాహంతో చిన్ననాటి నుంచే సంగీతం, నృత్యం, నాటకాల పట్ల ఆసక్తి పెంచుకున్నారు. చిన్న వయస్సులోనే వేదికలపై ప్రదర్శనలు ఇస్తూ తన ప్రతిభను చాటుకున్నారు. ఈ కళాప్రతిభే ఆమెను సినీరంగం వైపు నడిపించింది.




సినీ అవకాశాల కోసం కుటుంబ సభ్యులతో కలిసి మద్రాసుకు వెళ్లిన సావిత్రి తొలుత చిన్న పాత్రలతో తన ప్రయాణాన్ని ప్రారంభించారు. ప్రారంభంలో కొన్ని నిరాశలు ఎదురైనా ఆమె పట్టుదల కోల్పోలేదు. 1952లో విడుదలైన "పెళ్లి చేసి చూడు" చిత్రంతో ఆమెకు మంచి గుర్తింపు లభించింది. అనంతరం "దేవదాసు" చిత్రంలో పార్వతి పాత్ర పోషించి నటిగా తన ప్రత్యేకతను నిరూపించారు. ఈ చిత్రం ఆమె సినీ జీవితంలో కీలక మలుపుగా నిలిచింది.

1950, 1960 దశకాలు సావిత్రి గారి స్వర్ణయుగంగా చెప్పవచ్చు. "మిస్సమ్మ", "అర్ధాంగి", "దొంగరాముడు", "మాయాబజార్", "తోడికోడళ్ళు", "అప్పు చేసి పప్పు కూడు", "గుండమ్మ కథ", "నర్తనశాల", "డాక్టర్ చక్రవర్తి", "రక్తసంబంధం" వంటి అనేక చిత్రాలలో ఆమె అద్భుత నటన కనబరిచారు. ముఖ్యంగా "మాయాబజార్" చిత్రంలో శశిరేఖ పాత్రలో ఆమె నటన తెలుగు సినీ చరిత్రలో చిరస్మరణీయంగా నిలిచింది. హాస్యం, విషాదం, ప్రేమ, కోపం, కరుణ వంటి అన్ని భావాలను ఎంతో సహజంగా వ్యక్తపరచగలగడం ఆమె ప్రత్యేకత. సావిత్రి గారి నటనలో కళ్లకు ఎంతో ప్రాధాన్యం ఉండేది. మాటలు లేకుండానే కళ్లతో భావాలను వ్యక్తపరచగల అసాధారణ ప్రతిభ ఆమె సొంతం. అందువల్ల ఆమె నటించిన ప్రతి పాత్ర ప్రేక్షకుల హృదయాలలో చిరస్థాయిగా నిలిచిపోయింది. తెలుగు చిత్ర పరిశ్రమలో నటనకు ఒక పాఠశాలగా ఆమెను భావిస్తారు.

వ్యక్తిగత జీవితంలో సావిత్రి గారు ప్రముఖ తమిళ నటుడు జెమినీ గణేశన్‌ను వివాహం చేసుకున్నారు. వారికి విజయ చాముండేశ్వరి, సతీష్ కుమార్ అనే ఇద్దరు సంతానం. కుటుంబ జీవితంలో కొన్ని సమస్యలు, వ్యక్తిగత ఒడిదుడుకులు ఎదురైనా ఆమె కళా జీవితాన్ని కొనసాగించారు. నటిగా మాత్రమే కాకుండా నిర్మాతగా, దర్శకురాలిగా కూడా తన ప్రతిభను చాటుకున్నారు. మహిళా దర్శకురాలిగా దక్షిణ భారత సినీరంగంలో ప్రత్యేక గుర్తింపు పొందారు. సావిత్రి గారు దాతృత్వ స్వభావం కలిగిన వ్యక్తి. తన వద్దకు సహాయం కోసం వచ్చిన వారికి ఉదారంగా సహాయం చేసేవారు. అనేక మంది కళాకారులకు, అవసరమైన వారికి ఆర్థికంగా అండగా నిలిచారు. అయితే అదే ఉదారత, కొన్ని వ్యక్తిగత నిర్ణయాలు మరియు ఆర్థిక ఇబ్బందులు ఆమె జీవితాన్ని ప్రభావితం చేశాయి. అనంతరం ఆరోగ్య సమస్యలు, ముఖ్యంగా మధుమేహం కారణంగా ఆమె ఆరోగ్యం క్షీణించింది.

దీర్ఘకాల అనారోగ్యంతో బాధపడిన సావిత్రి గారు 1981 డిసెంబర్ 26న చెన్నైలో పరమపదించారు. అప్పటికి ఆమె వయస్సు కేవలం 47 సంవత్సరాలు మాత్రమే. ఆమె మరణం తెలుగు సినీరంగానికి తీరని లోటుగా మిగిలింది. అయినప్పటికీ ఆమె నటించిన చిత్రాలు నేటికీ ప్రేక్షకులను అలరిస్తూనే ఉన్నాయి. 2018లో విడుదలైన "మహానటి" చిత్రం ద్వారా ఆమె జీవితగాథ కొత్త తరానికి చేరువైంది. మహానటి సావిత్రి గారు కేవలం ఒక నటీమణి మాత్రమే కాదు; కళకు అంకితమైన వ్యక్తిత్వం, సహజ నటనకు ప్రతీక, తెలుగు సినీ గౌరవానికి చిరునామా. ఆమె పేరు భారతీయ చలనచిత్ర చరిత్రలో స్వర్ణాక్షరాలతో చిరస్థాయిగా నిలిచి ఉంటుంది.

– సువేగా




Printed at : Deccan Press, Azamabad, Hyderabad-20, Ph : 90599 50055

**BALA CHELIMI**, Telugu Children's Monthly Magazine
Date of Publication: 23rd Every Month
Postal Dates: 24th & 26th Every Month
Posting at BPC IV, Patrika Channel, Nampally, Hyderabad-500001.

RNI Regn. No. 52828/1992 TC No. TELTEL01232
Postal Regn.No.HCD-5022/2024-2026



# బాల చెలిమి
పిల్లల వికాస పత్రిక
## ప్రచురణలు



**46 పుస్తకాల ధర రూ.2320 • తగ్గింపు ధర రూ. 2100**

## తెలంగాణ బడి పిల్లల కథలు
10 పుస్తకాల సెట్ ధర రూ.330 తగ్గింపు ధర రూ. 300



## పెద్దలు రాసిన పిల్లల కథలు (ఉమ్మడి పది జిల్లాలు)
10 పుస్తకాల సెట్ ధర రూ.350 • తగ్గింపు ధర రూ. 300



## చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ ప్రచురించిన ఇతర పుస్తకాలు
18 పుస్తకాల ధర రూ.950 • తగ్గింపు ధర రూ. 850



పిల్లలకు అత్యంత ఆనందానిచ్చేది ఆట బొమ్మలు, కథల పుస్తకాలే. పాఠ్యపుస్తకాలు అందించే జ్ఞానానికి సమాంతరంగా మరెంతో లోకజ్ఞానాన్ని అందించేది బాల సాహిత్యమే. పుస్తకాలు పిల్లల ఆలోచనా నైపుణ్యాలను పెంచుతాయి. వారి ఊహలకు ప్రాణం పోస్తాయి. వారిలో సృజనాత్మకతను పెంచుతాయి. చరిత్ర, సంస్కృతి, కళలు, సైన్స్, మానవ స్వభావాలు, జంతు స్వభావాలు, ఆరోగ్య సంబంధిత అంశాలు - ఒకటేమిటి ప్రాథమిక విజ్ఞానఖని బాలసాహిత్యం, పిల్లలో నైతికతను, ఆధ్యాత్మికతను, సక్రమమైన ప్రవర్తనను, మంచి చెడుల అవగాహనను పెంచే బాధ్యతను బాలసాహిత్యమే నెరవేర్చగలదు.

-మణికొండ వేదకుమార్
చైర్మన్, చిల్డ్రన్స్ ఎడ్యుకేషన్ అకాడమీ

**చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ**
హైదరాబాద్ (Regd. 720/1982)

**Account Details :**
Account Name : Bala Chelimi
Bank Name : Canara Bank
A/c. No. : 30101010003714
Branch : Ashoknagar, Hyderabad.
IFSC Code : CNRB0013010

**ప్రతులకు**
అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలు. మరియు
'భూపతి సదన్' 3-6-716, స్ట్రీట్ నెం.12,
హిమాయత్‌నగర్, హైదరాబాద్-500029
ఫోన్ : 9030 6262 88

SCAN & PAY

email: edit.chelimi@gmail.com website : www.balachelimi.com

Printed at : Deccan Press, Azamabad, Hyderabad-20, Ph : 90599 50055

Edited, printed, published and owned by Manikonda Vedakumar,
Printed at Deccan Press, H.No.1-9-1126/B, Azamabad, Musheerabad, Hyderabad-500020, Telangana State.
Published at "CHANDRAM", # 3-6-712/2, 12th Street, Himayatnagar, Hyderabad-500029, Telangana.
Editor: Manikonda Vedakumar. RNI Reg No. 52828/92, Tc No: TEL Tel01232.
Cell : 9030626288, Mail ID : edit.chelimi@gmail.com